అల్లాహ్ యొక్క ప్రవక్త

# ముహమ్మద్

సల్లల్లాహు అలైహి వసల్లం

**سيرة محمد** - صلى الله عليه وسلم -

بلغة التلغو

www.islamhouse.com

క్విజ్ పోటీలో పాల్గొనండి !

వేల రూపాయలు గెలుచుకోండి !

# అల్లాహ్ యొక్క ప్రవక్త

# ముహమ్మద్

# సల్లల్లాహు అలైహి వసల్లం


రచయిత

అబ్దుర్రహ్మాన్ అల్ షీహ్

అనువాదం

ముహమ్మద్ కరీముల్లాహ్

Third Edition, 1427/2006

© Copyright. All rights reserved for the author. This book may be reproduced for charitable purpose only.

We would like to express our sincere appreciation to those who contributed to the publication of this book. May Allah reward them for their efforts. If you have any corrections, commments or questions about this publication, please feel free to contact us to the below email address:

teluguwebmaster@gmail.com

**Written by:** **Abdur Rahman Al Sheha**

**Translated by:** **Muhammed Kareemullah**

**Reveiwed by:** Divya Quran Educational Foundation

**Published by:**

The Islamic Propagation Office in Rabwah

Tel. +4454900 - 4916065

Email: **teluguwebmaster@gmail.com**

**www.islamhouse.com**

# విషయసూచిక


1. పరిచయం
2. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అంటేఎవరు?
3. ఆయన వంశపరంపర
4. జననం, బాల్యం మరియు ప్రవక్తత్వం
5. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క వర్ణన
6. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఉత్తమ సంస్కారాలు మరియు ప్రత్యేక లక్షణాలు
7. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క నైతిక ప్రవర్తన
8. న్యాయం మరియు సమానత్వంతో నిండిన నిష్పక్షపాత తీర్పులు
9. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క భార్యలు
10. గ్రాంధిక నిదర్శనాలు
11. ఖుర్ఆన్ నుండి కొన్ని నిదర్శనాలు
12. సున్నతుల నుండి కొన్ని నిదర్శనాలు
13. ప్రాచీన గ్రంథాల నుండి కొన్ని నిదర్శనాలు
14. గోస్పెల్ నుండి కొన్ని నిదర్శనాలు
15. విజ్ఞానుల ధృవీకరణలు
16. లా ఇలాహ ఇల్లల్లాహ్ – ముహమ్మదుర్రసూలుల్లాహ్ అనే సాక్ష్య ప్రకటన నిర్దేశించేదేమిటి?
17. ముగింపు
18. Glossary

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

# పరిచయం

అల్హందులిల్లాహి రబ్బిల్ ఆలమీన్ – సకల స్తోత్రములు సర్వలోకాల ఏకైక ప్రభువు అయిన అల్లాహ్[1] కొరకే. ప్రవక్త ముహమ్మద్ ను మరియు ఆయన కుటుంబాన్ని అల్లాహ్ ప్రశంసించుగాక మరియు ఘనత ప్రసాదించుగాక!

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం[2] 'నిస్సందేహంగా చరిత్రలోని అత్యంత శ్రేష్ఠమైన మరియు ఘనమైన వ్యక్తిగా' ముస్లింలు నొక్కి మరీ వక్కాణిస్తారు. ఇది నిరాధారమైన మామూలు దావా కాదు.

ఎవరైతే ఆయన జీవిత చరిత్రను చదువుతారో, ఆయన గుణగణాల గురించిన మరియు వ్యక్తిత్వం గురించిన నిజనిజాలు గ్రహిస్తారో, అలాంటి వారు కూడా ఇదే అంతిమ అభిప్రాయానికి చేరుకుంటారు. అయితే వారు

---

1. అరబీ భాషలోని అల్లాహ్ అంటే 'ఏకైక దేవుడు' మరియు 'ఏకైక ఆరాధ్యుడు' అని అర్థం. 'రబ్' అనే అరబీ పదానికి సరిసమానమైన పదం తెలుగు భాషలో లేనే లేదు. దీని అర్థం – సమస్త విశ్వానికి ఏకైక సార్వభౌముడు, ప్రభువు. ఆయనే సృష్టికర్త, యజమాని, అధిపతి, వ్యవస్థీకరించువాడు, రూపురేఖలు తీర్చిదిద్దేవాడు, సిద్ధం చేసేవాడు, సర్వాధికారి, కార్యప్రణాళిక కర్త, సమర్థకుడు, పోషకుడు, భద్రతనిచ్చేవాడు, తమ జీవనాధారము కొరకు మరియు జీవనోపాధి కొరకు సృష్టంతా ఆధారపడే ఏకైక శక్తి, ప్రాణం పోసేవాడూ మరియు ప్రాణం తీసేవాడు. ప్రభువు అనే పదం ఎక్కడ వచ్చినా, వాస్తవానికి అది 'రబ్' అనే అరబీ పదానికి అనువాదంగా వాడబడినదని గ్రహించాలి మరియు పైన వివరించిన విధంగా అర్థం చేసుకోవాలి.

2. 'సల్లల్లాహు అలైహి వసల్లం' అంటే 'అల్లాహ్ ఆయనను ప్రశంసించు గాక మరియు అన్ని రకాల దుష్టశక్తుల నుండి మరియు చెడుల నుండి ఆయనను కాపాడు గాక!' అని అర్థం. కొన్ని చోట్ల 'అల్లాహ్ యొక్క శాంతి మరియు దీవెనలు ఆయనపై కురుయుగాక' అని కూడా అనువదించబడింది.

దురభిమానం మరియు పక్షపాతములతో కూడిన పూర్వభావనలను ప్రక్కన పెట్టి, పరిశోధించవలసి ఉంటుంది. అలా చేసిన కొందరు నిష్పక్షపాత ముస్లిమేతరులు ఇలాంటి ముగింపునకే చేరుకున్నారు.

ఒకసారి తనతో పాటు పనిచేసే ఒక బ్రాహ్మణ సహోద్యోగి ఇలా చెప్పాడని ప్రొఫెసర్ హసన్ అలీ (రహిమహుల్లాహ్ – అల్లాహ్ ఆయనపై దయ చూపుగాక), తన 'నూరుల్ ఇస్లాం'[1] పత్రికలో వ్రాసినారు: "చరిత్రలోని అత్యంత శ్రేష్ఠమైన వ్యక్తి 'ఇస్లాం యొక్క ప్రవక్తని' గుర్తించాను మరియు విశ్వసిస్తున్నాను". అది విని ప్రొఫెసర్ హసన్ అలీ, 'అత్యంత శ్రేష్ఠమైన వ్యక్తిగా ఆయనను మీరెందుకు పరిగణిస్తున్నారు?' అని ప్రశ్నించగా, దానికి ఆయనిలా జవాబిచ్చారు:

ఆయనలోని అత్యుత్తమమైన గుణగణాలు మరియు నైతిక ప్రవర్తనల నన్నింటినీ ఏకకాలంలో ఏ వ్యక్తీ కలిగి ఉండలేదు. ఆయన నాయకత్వంలో అరేబియా ద్వీపకల్పం మొత్తం ఐక్యమై, ఒక పెద్ద రాజ్యంగా వెలిసింది. అయినా ఆయన అల్లాహ్ కు వినమ్రత మరియు విధేయత చూపుతూ, అత్యంత అణుకువతో 'సర్వాధిపత్యము కేవలం అల్లాహ్ కు మాత్రమే చెందినదని' విశ్వసించేవారు.

గొప్ప గొప్ప సంపదలు ఆయన వద్దకు వచ్చినా, ఆయన పేదరికంలో మరియు వైరాగ్యంలో జీవించేవారు. వరుసగా అనేక దినాల పాటు ఆయన ఇంటిలో వంట కొరకు నిప్పు రాజేయబడేది కాదు మరియు ఆయన ఆకలితో గడిపేవారు. ఆయన ఒక గొప్ప నాయకుడు. ఎందుకంటే ఆయన తరచుగా అనేక వేల సంఖ్యలో ఉన్న శత్రుసైన్యాలకు వ్యతిరేకంగా కేవలం కొన్ని వందల సైన్యాన్ని యుద్ధరంగంలోనికి నడపడమే కాకుండా వారు

[1]. మునీర్ సులైమాన్ అన్నద్వీ గారి 'అర్రిసాలహ్ అల్ ముహమ్మదియ్యహ్' 114-115 అనే పుస్తకాన్ని చూడండి.

ధైర్యసాహసాలతో పోరాడేలా చేసి, సత్యతిరస్కారులను స్పష్టంగా ఓడించినారు. కొంచెం కూడా దిగులు పడకుండా ఒక్కొక్కరు స్వయంగా వందల, వేల శత్రుసైన్యాలను ఎదుర్కొనే దృఢవిశ్వాసంతో నిండిన అనేక వేల సహచరులు తన వద్ద తయారుగా ఉన్నప్పటికీ, ఆయన శాంతి సంధులను ఇష్టపడేవారు, స్థిరమైన మనస్సుతో వాటిని అంగీకరించేవారు. అంతేగాక ప్రవక్త దయార్ద్ర హృదయులు, కరుణామయులు మరియు అనవసరంగా ఒక్క రక్తపు బొట్టు కూడా చిందించకూడదని అభిలషించేవారు మరియు శాంతికే ప్రాధాన్యత నిచ్చేవారు. అరేబియా ద్వీపకల్ప వ్యవహారాలలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ, ఆయన తన భార్యాబిడ్డలను, కుటుంబాన్ని, నిరుపేదలను మరియు అక్కరగలవారిని నిర్లక్ష్యం చేయలేదు. దగ్గరిలో ఉన్నా, దూరంగా ఉన్నా సరే, మార్గభ్రష్టులకు ఇస్లాం సందేశాన్ని అందజేయటంలో ఆయన చాలా చురుకుగా ప్రవర్తించేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన మానవజాతి యొక్క అభివృద్ధి మరియు సుఖసంతోషాల గురించి విచారించేవారు. ఇతర నాయకులు మునిగిపోయినట్లుగా, ఆయన అద్భుతమైన ఈ ప్రాపంచిక భోగభాగ్యాలలో మునిగిపోలేదు, ఆకర్షణలకు లోనుకాలేదు. తరచుగా ఆయన అల్లాహ్ యొక్క ఆరాధనలో మునిగి పోయేవారు. ఇంకా అల్లాహ్ ఇష్టపడే పనులు చేయటానికే ఇష్టపడేవారు. తన స్వయం కోసం ఆయన ఏనాడూ ప్రతీకారం తీర్చుకోలేదు. సరైన మార్గదర్శకత్వం ప్రసాదించమని తన బద్ధశత్రువుల కొరకు కూడా ఆయన అల్లాహ్ ను ప్రార్థించేవారు మరియు అల్లాహ్ యొక్క కఠిన శిక్షల నుండి కాపాడుకోమని వారిని హెచ్చరించేవారు.

ప్రాపంచిక భోగభాగ్యాలకు దూరంగా ఉంటూ, వైరాగ్యంలో గడిపేవారు మరియు రాత్రిళ్ళలో అధిక భాగం అల్లాహ్ ఆరాధనలలో గడిపేవారు. ఆయన స్వయంగా తన చేతిలో కత్తి పట్టుకుని, సత్యతిరస్కారులను

ధైర్యసాహసాలతో ఎదుర్కొంటూ వీరోచితంగా పోరాడి, అల్లాహ్ కొరకు అనేక తెగలను జయించిన గొప్ప సైనికుడు. అయినా ఎండు గడ్డితో తయారుచేయబడిన చాపపై, మామూలు నారపోగు (పీచు) తో నింపబడిన దిండును తలక్రింద పెట్టుకుని సామాన్య మానవుని వలే పడుకునేవారు. అయితే బయట ప్రజలు ఆయనను అరబ్బుల సుల్తానుగా, అరేబియా ద్వీపకల్ప మహారాజుగా సన్మానించేవారు[1]. జయించిన ప్రాంతాల నుండి ఆయన వద్దకు చేరిన యుద్ధసంపత్తి, పంపిణీ కొరకు మస్జిదులో గుట్టలు గుట్టలుగా పోగై ఉన్నప్పటికీ, ఆయన కుటుంబం అతి సాధారణమైన నిరుపేద జీవితాన్నే గడిపింది. ఒకసారి ఆయన కుమార్తె ఫాతిమహ్ పిండి విసరటంలో మరియు బావి నుండి నీళ్ళు మోసుకురావటంలో తన శరీరంపై పడిన గుర్తులు చూపుతూ, తను పడుతున్న కష్టాల్ని ఆయనకు విన్నవించుకున్నది. అయినా ఆయన యుద్ధసంపత్తి నుండి వీసమెత్తు భాగాన్ని కూడా ఇవ్వకుండా, కొన్ని దుఆలు మరియు కొన్ని ధ్యానపదాలు మాత్రమే ఆవిడకు నేర్పినారు. ఒకసారి ప్రవక్త సహచరుడు ఉమర్[2] ఆయన ఇంటికి వచ్చారు. ప్రవక్త గదిలోని వస్తువులపై దృష్టిసారించగా, ప్రవక్త కూర్చుని ఉన్న ఎండుగడ్డితో చేయబడిన చాప తప్ప మరింకేమీ అతనికి  కనబడలేదు. ఆ చాప ఆయన శరీరంపై వేసిన గుర్తులు చూసి అతను చలించిపోయారు. అపుడు ప్రవక్త ఇంటిలో ఉన్న ఆహారపదార్థాలు - కేవలం గుప్పెడు బార్లీ గింజలు మరియు గోడకు వ్రేలాడదీసిన నీళ్ళ

---

[1]. వాస్తవానికి ఇది ఒక భాషాపరమైన పొరపాటు. ఎందుకంటే ఆయన ఏనాడూ కిరీటాన్ని ధరించలేదు. ఆయన  నాయకత్వానికి ఉపమానంగా ఇలా పేర్కొనటం జరిగింది.

[2]. ప్రవక్త యొక్క సన్నిహిత సహచరులలో ఒకరు.  ప్రవక్త మరణించిన తరువాత రెండో ఖలీఫాగా నాయకత్వం వహించినారు.

తోలుతిత్తి మాత్రమే. అరేబియా ద్వీపకల్పంలో దాదాపు సగభాగాన్ని నియంత్రిస్తున్నటువంటి ఆ గొప్ప సమయంలో, ఆయన ఇంట్లో ఆనాడు ఉండిన వస్తువులు కేవలం ఇవి మాత్రమే. ఇది చూసి ఉమర్ రదియల్లాహు అన్హు తనను తాను నిగ్రహించుకోలేక, ఏడవటం మొదలు పెట్టారు.

అపుడు అల్లాహ్ యొక్క ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అతనిని ఇలా ప్రశ్నించారు: "ఎందుకు ఏడుస్తున్నావు ఓ ఉమర్?"

దానికి అతను ఇలా జవాబిచ్చారు: "ఈ ప్రపంచంలో (పర్షియన్ చక్రవర్తి) ఖుస్రూ మరియు (రోమన్ చక్రవర్తి) సీజర్ భోగభాగ్యాలలో ఓలలాడుతూ విలాసవంతమైన జీవితం గడుపుతుండగా, నా కళ్ళ ముందు చూస్తున్న వాటిని మాత్రమే కలిగి ఉన్న అల్లాహ్ యొక్క ప్రవక్తను చూసిన తరువాత నేనెలా ఏడవకుండా ఉండగలను ఓ ప్రవక్తా!"

దానికి ఆయనిలా జవాబిచ్చారు: "ఓ ఉమర్, ఇవి (ఈ ప్రాపంచిక భోగభాగ్యాలు) కేవలం ఈ ఇహలోకంలో మాత్రమే ఖుస్రూ మరియు సీజర్ లకు ప్రసాదించబడిన వారి వంతు భాగాలు. అయితే, పరలోకంలో ఈ భోగభాగ్యాలు మన కొరకు ప్రత్యేకించబడటం నీకు సంతోషం కలిగించదా?"

మక్కా దండయాత్రకు బయలు దేరేటప్పుడు, ప్రవక్త తన సైనిక పంక్తులను పరిశీలిస్తుండగా, అప్పటి ఇస్లాం బద్ధవిరోధి అయిన అబూ సుఫ్యాన్, ప్రవక్త పినతండ్రి అల్ అబ్బాస్ ప్రక్కన నిల్చొని ఉన్నాడు. వారిద్దరూ ముస్లిం సైన్యం యొక్క పతాకాలపై దృష్టి సారించారు. మక్కా వైపు వరద నీటి వలే వేగంగా కదులుతున్న బ్రహ్మాండమైన ముస్లిం సైన్యం అబూ సుఫ్యాన్ ను అమితంగా ఆశ్చర్యపరచింది. వారిని ఆపగలిగే వారెవరూ లేరు మరియు వారి దారిలో ఏదీ అవరోధం కాజాలదని తలుస్తూ, అల్ అబ్బాస్ తో అబూ సుఫ్యాన్ ఇలా అన్నాడు: "ఓ అబ్బాస్! నీ తమ్ముడి కుమారుడు ఒక గొప్ప మహారాజు అయిపోయినాడు!" అతని మాటలకు స్పందిస్తూ, అల్ అబ్బాస్

ఇలా అన్నారు: "ఇది రాజత్వం కాదు, ఇది అల్లాహ్ యొక్క ప్రవక్తత్వము మరియు ఇస్లాం యొక్క ప్రవక్తత్వము"

ఉదార స్వభావుడిగా ప్రఖ్యాతి చెందిన అదీ బిన్ హాతిమ్ అత్ తాయీ, ఒకసారి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సభలో హాజరైనాడు. అప్పటికింకా అతడు క్రైస్తవుడిగానే ఉన్నాడు. ఏ విధంగానైతే సహచరులు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ను గౌరవిస్తున్నారో మరియు అభిమానిస్తున్నారో చూసి, ఆయనను ఒక ప్రవక్తగా భావించాలో లేక ఒక మహారాజుగా భావించాలో తెలియక గందరగోళానికి గురై, తనలో తాను ఇలా ప్రశ్నించు కోసాగాడు, "ఆయన ఒక రాజా లేక అల్లాహ్ యొక్క ప్రవక్తలలోని ఒక ప్రవక్తా?" ఈ విషయం పై అతను దీర్ఘాలోచనలో ఉండగా, ఒక నిరుపేద స్త్రీ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి, ఆయనతో ఇలా అన్నది "నేను మీతో రహస్యంగా మాట్లాడాలి". దానికి ఆయన ఆమెతో "మదీనాలోని ఏ మార్గంపై నీతో కలవాలి?" అని అడిగారు. ఆ తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన సహచరులతో ఆమె వద్దకు వెళ్ళి, ఆమె సమస్యను విని, దానిని పరిష్కరించారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఈ అణుకువ, వినమ్రతను చూడగానే అదీ బిన్ హాతిమ్ కు సత్యం అర్థమై పోయింది. వెంటనే తను ధరించి ఉన్న శిలువను త్యజించి, అతను ముస్లింగా మారిపోయాడు."

తూర్పు దేశాల మతములను పరిశోధించే కొందరు ఓరియంటలిష్టుల కొన్ని ప్రకటనలను మేము ఇక్కడ ఉదహరించాము. ముస్లింలుగా మేము ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తత్వంపై మరియు ఆయన దివ్యసందేశంపై దృఢమైన విశ్వాసం కలిగి ఉన్నాము. ఈ వాస్తవాన్ని నిర్ధారించుకొనుట కొరకు ముస్లిమేతరుల ప్రకటనల అవసరం మాకు లేదు. అయితే క్రింది తెలుపబడిన రెండు కారణాల వలన మేము వాటిని పేర్కొంటున్నాము:

అ) అవి తమ ప్రవక్తను, ఆయన బోధనలను నిర్లక్ష్యం చేస్తున్న సాధారణ ముస్లింలకు రిమైండర్ గా మరియు మందలింపుగా మారి, వారు తమ తప్పుడు పనుల నుండి మేల్కొని, పశ్చాత్తాప పడి, అల్లాహ్ క్షమాభిక్షను వేడుకుంటూ మరల తమ ఇస్లాం ధర్మం[1] వైపు మరలాలని.

ఆ) ప్రవక్త గురించి బహిరంగంగా తెలిపిన కొందరు ప్రపంచ ప్రఖ్యాత ముస్లిమేతరుల సత్యవాక్కులను ముస్లిమేతరులకు తెలిపి, తద్వారా వారు ఇస్లాం వైపు దారి చూపబడాలని, నరకం నుండి కాపాడబడాలని మరియు స్వర్గంలో శాశ్వతస్థానం ప్రసాదించబడాలని.

తమ పూర్వాభిప్రాయాల ప్రభావంలో మునిగి ఉండి, అదే దృష్టితో ఈ పుస్తకంలో లేదా వేరే ఇతర ఇస్లామీయ రచనలలో సత్యాన్వేషణకు పూనుకోవద్దని పాఠకులకు మన్నవి చేసుకుంటున్నాను.

సత్య స్వీకరణ కొరకు వారి హృదయాలను పూర్తిగా తెరవమని, వారికి సన్మార్గం చూపమని, దానిని అనుసరించే విధంగా వారిని ప్రోత్సహించమని నేను అల్లాహ్ ను వేడుకుంటున్నాను.

అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్ కరీమ్ అల్ షీహా,
రియాద్ - 11535, P.B.No. 59565
email: alsheha@yahoo.com website: www.islamland.org

[1]. ఇక్కడ ఇస్లాం ధర్మంగా అనువదించబడిన అసలు అరబీ పదం 'దీన్'. అరబీ దీని అర్థం – ఒక సమగ్రమైన వ్యక్తిగత మరియు బహిరంగ జీవన విధానం. ఈ సంపూర్ణ పదంలో అల్లాహ్ కు చూపే విధేయత మరియు ఆరాధనలు, రాజకీయ ఆచరణలు, వివరణాత్మకమైన ఆచారవ్యవహారాలు, సంప్రదాయాలు, పరిశుభ్రత మరియు గుణగణాలు మొదలైనవన్నీ ఇమిడి ఉన్నాయి.

# ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అంటే ఎవరు?

## ఆయన వంశపరంపర

ఆయన పేరు అబుల్ ఖాసిం (ఖాసిం యొక్క తండ్రి) ముహమ్మద్, ఆయన తండ్రి పేరు అబ్దుల్లాహ్. ఆయన తాత పేరు అబ్దుల్ ముత్తలిబ్.

ఆయన వంశపరంపర చివరికి (అల్లాహ్ ప్రవక్త ఇబ్రాహీం అలైహిస్సలాం కుమారుడైన) ఇస్మాయీల్ అలైహిస్సలాం సంతతికి చెందిన 'అద్నాన్' తెగను చేరుతుంది. ఆయన తల్లి వహబ్ కుమార్తె 'ఆమినా'.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపినారు: "నిశ్చయంగా అల్లాహ్ ఇస్మాయీల్ సంతతికి చెందిన ఇతర తెగలలో నుండి కినానాహ్ తెగను ఎన్నుకున్నాడు; కినానాహ్ కు చెందిన తెగలలో నుండి ఖురైష్ తెగను ఎన్నుకున్నాడు; ఖురైష్ తెగలలో నుండి బనూ హాషిమ్ కుటుంబాన్ని ఎన్నుకున్నాడు మరియు బనూ హాషిమ్ కుటుంబం నుండి నన్ను ఎన్నుకున్నాడు." ముస్లిం హదీథ్ నం. 2276

అలా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉన్నత వంశానికి చెందినవారు. రోమను చక్రవర్తి హిరాక్యులస్[1] ఎదుట అబూ సుఫ్యాన్ ఒప్పుకున్నట్లుగా, ఆయన బద్ధశత్రువులు కూడా ఈ సత్యాన్ని ఒప్పుకున్నారు. (ముస్లింలతో జరిగిన అనేక యుద్ధాలలో ఇస్లాంకు వ్యతిరేకంగా ఖురైషీ విగ్రహారాధకులకు అబూ సుఫ్యాన్ నాయకత్వం వహించాడు. చివరికి ఇస్లాం స్వీకరించి, ముస్లింగా చనిపోయారు).

---

[1]. ఆయన బైజాంటైన్ సామ్రాజ్యం (610-641) యొక్క చక్రవర్తి. పర్షియా సామ్రాజ్యం నుండి సిరియా, ఫలస్తీన్ మరియు ఈజిప్టు దేశాలను వశపరచుకొని (613-628), ఆయన వాటిని తన సామ్రాజ్యంలో కలుపుకున్నాడు.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పినతండ్రి కుమారుడైన అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు – ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇస్లాం వైపు ఆహ్వానిస్తూ హిరాక్ల్యులస్ కు ఉత్తరం వ్రాసి, దానిని తన సహచరుడైన దిహ్యా అల్ కల్బికు ఇచ్చి పంపారు. అతను దానిని (జోర్డాను పట్టణమైన) బుస్రా గవర్నరుకు అందజేయగా, ఆ గవర్నరు దానిని హిరాక్ల్యులస్ వద్దకు పంపినాడు.

పర్షియన్ సైన్యాలపై తనకు ప్రసాదించిన విజయానికి బదులుగా హిరాక్ల్యులస్ దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ, హిమ్స్ నుండి ఇల్యా (జెరుసలెం) వరకు నడుచుకుంటూ వచ్చాడు. అల్లాహ్ యొక్క ప్రవక్త ఉత్తరం తన చేతికి అందగానే హిరాక్ల్యులస్ దానిని చదివించుకుని, ఇలా ఆజ్ఞాపించినాడు, "అల్లాహ్ యొక్క ప్రవక్త గురించి ప్రశ్నించడానికి గాను ఆయన ప్రజలలో (ఖురైష్ తెగకు చెందిన అరబ్బుల) నుండి ఒకవేళ ఎవరైనా ఇక్కడ ఉన్నట్లయితే, వెంటనే వారిని నా వద్దకు తీసుకురండి." ఆ సమయంలో అబూ సుఫ్యాన్ బిన్ హరబ్ కొంత మంది ఖురైషీయులతో కలిసి వ్యాపార నిమిత్తం షామ్ (గ్రేటర్ సిరియా)[1] లో బస చేసి ఉండినాడు. అప్పటికి అల్లాహ్ యొక్క ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకూ మరియు ఖురైషీ బహుదైవారాధకులకూ మధ్య సంధి ఒడంబడిక జరిగి కొంత కాలమే అయినది. అపుడు అబూ సుఫ్యాన్ ఇలా పలికినాడు,

"గ్రేటర్ సిరియా లోని ఒక ప్రాంతంలో హిరాక్ల్యులస్ దూత నన్ను కనుగొన్నాడు. అతడు నన్నూ మరియు నా సహచరులనూ ఇల్యాకు తీసుకువెళ్ళి, హిరాక్ల్యులస్ ముందు నిలబెట్టినాడు. అపుడు హిరాక్ల్యులస్

[1]. మధ్యాసియాలో మెడిటేరియన్ మధ్యధరా సరిహద్దులలోని ఒక చారిత్రక ప్రాంతం. దీనిలో నేటి సిరియా, లెబనాన్, ఫలస్తీన్ మరియు జోర్డాన్ దేశాలు వస్తాయి.

కిరీటం ధరించి, బైజాంటైన్ ఉన్నతాధికారుల మధ్య, రాజదర్బారులోని తన సింహాసనంపై ఆశీనుడై ఉన్నాడు.

తన అనువాదకుడి ద్వారా హిరాక్యులస్ మాతో ఇలా అన్నాడు 'తాను ప్రవక్తనని ప్రకటించుకున్న ఈ మనిషికి, మీలో ఎవరు బాగా దగ్గరి బంధువు?'

దానికి నేను 'ఈ సమూహంలో అతనికి అతి దగ్గరి బంధువును నేనే' అని జవాబిచ్చాను.

అపుడు హిరాక్యులస్ 'ఆయనతో నీ బంధుత్వం ఎలాంటిది?' అని నన్ను ప్రశ్నించినాడు.

దానికి నేను 'ఆయన నాకు తండ్రి తరఫు సోదరుడు మరియు నేను తప్ప, అబ్ద్ మనాఫ్ తెగకు చెందిన వారెవరూ ఈ వ్యాపార బృందంలో లేరు.'

అపుడు హిరాక్యులస్ నన్ను తన దగ్గరకు రమ్మని ఆజ్ఞాపించినాడు. వారు నన్ను అతనికి ఎదురుగా కూర్చోబెట్టారు. మా బృందంలోని మిగతా వారిని నా వెనుక కూర్చోబెట్టమని హిరాక్యులస్ ఆదేశించినాడు. ఆ తరువాత హిరాక్యులస్ తన అనువాదకుడితో ఇలా అన్నాడు 'వీరికి (నా వెనుక కూర్చున్నవారికి) చెప్పు, నేను ఇతడిని (అబూ సుఫ్యాన్ ను) తాను ప్రవక్తనని ప్రకటించుకున్న ఈ మనిషిని గురించి ప్రశ్నించబోతున్నాను. ఒకవేళ ఇతను ఆ మనిషిని గురించి ఏదైనా అసత్యం పలికితే, వీరు దానిని వెంటనే ఖండించాలి'.

అబూ సుఫ్యాన్ నాతో అన్నాడు "అల్లాహ్ సాక్షిగా, ఒకవేళ నా వెంట ఉన్నవారు నన్ను 'అబద్ధాలకోరు' అనే భయమే గానీ నాకు లేకుంటే, నేను నిశ్చయంగా అబద్ధాలే చెప్పేవాడిని."

అపుడు హిరాక్ల్యులస్ తన అనువాదకునితో ఇలా అన్నాడు, 'ఇతడిని అడుగు! మీ మధ్యన ఆయన (ఆ ప్రవక్త) యొక్క వంశపు స్థాయి ఏమిటి?'

నేను 'ఆయన మా మధ్యన ఒక ఉన్నత వంశానికి చెందినవాడు' అని జవాబిచ్చాను.

తరువాత హిరాక్ల్యులస్ ఇలా అడిగాడు, 'ఆయన పూర్వీకులలో ఎవరైనా రాజులు ఉన్నారా?'

దానికి నేను 'లేరు' అని జవాబిచ్చాను.

అపుడు హిరాక్ల్యులస్ 'ఆయన ఇప్పుడు ఏదైతే ప్రకటించాడో, దాని కంటే ముందు ఏనాడైనా ఆయనను 'అబద్ధాల కోరని' మీరు నిందించటం జరిగిందా?' అని అడిగాడు.

నేను 'లేదు' అని జవాబిచ్చాను.

హిరాక్ల్యులస్ 'ఆయనను ఉన్నత వంశీయులు అనుసరిస్తున్నారా లేక పేదవారా?' అని అడిగాడు.

దానికి నేను 'ఆయనను పేదవారే అనుసరిస్తున్నారు' అని జవాబిచ్చాను.

అపుడు హిరాక్ల్యులస్ ఇలా అడిగాడు 'ఆయన అనుచరుల సంఖ్య పెరుగుతున్నదా లేక తరుగుతున్నదా?'

దానికి నేను 'పెరుగుతున్నది' అని జవాబిచ్చాను.

అపుడు హిరాక్ల్యులస్ ఇలా అడిగాడు 'ఒకసారి ఆయన (ఇస్లాం) ధర్మాన్ని స్వీకరించిన తరువాత ఎవరైనా ఆ ధర్మానికి అయిష్టత చూపి, దానిని విడిచి పెట్టినారా?'

దానికి నేను 'లేదు' అని జవాబిచ్చాను.

మరల హిరాక్ల్యులస్ 'నీవు ఆయనతో యుద్ధం చేశావా?' అని అడిగాడు.

దానికి నేను 'అవును, యుద్ధం చేశాను' అన్నాను.

అపుడు హిరాక్ల్యులస్ 'ఆయనతో నీ యుద్ధ ఫలితం ఎలా ఉండినది?' అని అడిగాడు.

దానికి నేను 'యుద్ధ ఫలితం మా మధ్య ఎప్పుడూ ఏకపక్షంగా ఉండ లేదు. విజయం మాలో ఒక్కొక్కరిని ఒక్కొక్కసారి వరించినది. ఆయన పక్షం మా వారిని వధిస్తే, మేమాయన పక్షం వారిని వధించామని' జవాబిచ్చినాను.

హిరాక్ల్యులస్ ఇలా అడిగాడు, 'ఆయన ఎప్పుడైనా నమ్మకద్రోహానికీ, విశ్వాసఘాతానికీ పాల్పడినాడా?'

దానికి నేను 'లేదు, ప్రస్తుతం మా మధ్య ఒడంబడిక ఉన్నందున, మేము అతనికి దూరంగా ఉన్నాము. ఆయన ఈ సంధి విషయంలో ఏమి చేస్తాడో మాకు తెలియదు' అని జవాబిచ్చినాను.

ఆ తరువాత అబూ సుఫ్యాన్ ఇలా పలికినాడు 'అల్లాహ్ సాక్షిగా, 'ఆయన సంధి విషయంలో ఏమి చేస్తాడో మాకు తెలియదు' అనే ఈ ఒక్క మాట తప్ప, హిరాక్ల్యులస్ తో నా సంభాషణలో అదనంగా ఒక్క పదాన్ని కూడా నేను ఆయనకు (ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు) వ్యతిరేకంగా జొప్పించ లేకపోయాను.

ఆ తరువాత హిరాక్ల్యులస్ నన్ను 'ఇంతకంటే ముందు మీలో ఎవరైనా ఈ విధంగా (నేను అల్లాహ్ ప్రవక్తనని) దావా చేశారా?' అని అడిగాడు.

దానికి నేను 'లేదు' అని జవాబిచ్చినాను.

అపుడు హిరాక్ల్యులస్ తన అనువాదకునితో నాతో ఇలా చెప్పమని అన్నాడు 'నేను నిన్ను, 'ఆయన వంశపు స్థాయిని గురించి' అడిగాను,

‘ఆయన మా మధ్య ఒక ఉన్నత వంశానికి చెందిన వాడని’ నీవు చెప్పినావు. నిస్సందేహంగా, ప్రవక్తలందరూ వారి ప్రజలలోని ఉన్నత వంశాల నుండి వచ్చిన వారే.

నేను నిన్ను ‘ఆయన పూర్వీకులలో ఎవరైనా రాజులున్నారా?’ అని అడిగాను, నీవు లేరని అన్నావు. నేను ‘ఒకవేళ ఆయన పూర్వీకులలో ఎవరైనా రాజులు ఉండి ఉంటే, ఈయన (ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం) తన పూర్వీకులు పాలించిన రాజ్యాన్ని పాలించాలనుకుంటున్నాడు’ అందామనుకున్నాను.

అపుడు నేను ‘ఆయన అనుచరులు – ప్రజలలో ఉన్నత వంశానికి చెందిన వారా లేక నిరుపేదలా’ అని అడుగగా, దానికి నీవు ‘నిరుపేదలని’ జవాబిచ్చావు. నిజానికి పేదప్రజలే ప్రవక్తలందరి అనుచరులు.

అపుడు నేను, ‘ఆయన దావా చేసిన ఈ విషయానికి పూర్వం ఆయన అబద్ధాల కోరని మీరెప్పుడైనా ఆరోపించారా’ అని అడిగాను. దానికి నీవు ‘లేదని’ జవాబిచ్చినావు. అపుడు నేను రూఢీపరుచుకున్నాను - ‘ఇతరులను గురించి ఎపుడూ ఒక్క అసత్యమైనా పలకని వ్యక్తి, దైవం గురించి అస్సలు అబద్ధం పలుకడని’.

తరువాత నేను ‘ఆయన అనుచరులలో ఎవరైనా ఆయన ధర్మాన్ని స్వీకరించిన తరువాత, ఆ ధర్మంపై అయిష్టత వలన, దానిని విడిచిపెట్టడం జరిగిందా’ అని అడుగగా, దానికి నీవు ‘లేదని’ జవాబిచ్చినావు. విశ్వాసం అంటే అదే – దాని మాధుర్యం హృదయంలో ప్రవేశించి, దానితో పూర్తిగా కలిసిపోతుంది.

తరువాత నేను ‘ఆయన అనుచరుల సంఖ్య పెరుగుతున్నదా లేక తరుగుతున్నదా’ అని అడుగగా, దానికి నీవు ‘పెరుగుతున్నదని’

జవాబిచ్చినావు. పరిపూర్ణమయ్యేంత వరకు అలా పెరగటమే సత్యధర్మపు లక్షణం.

తరువాత నేను 'నీవు ఆయనతో ఎప్పుడైనా యుద్ధం చేశావా' అని అడుగగా, దానికి నీవు 'ఆయనతో యుద్ధం చేశానని, యుద్ధ ఫలితం ఎప్పుడూ ఏకపక్షంగా ఉండేది కాదని, విజయం నిన్నూ – ఆయననూ మార్చి మార్చి వరించేదనీ, నీవు ఆయన పక్షం వారిని చంపితే, ఆయన నీ పక్షం వారిని చంపాడని' జవాబిచ్చినావు. ఇది ప్రవక్తలందరి జీవితంలో జరిగిన విషయమే. వారు ఎన్నోరకాల పరీక్షలకు గురిచేయబడతారు. కానీ, చివరికి అంతిమ విజయం వారినే వరిస్తుంది.

తరువాత నేను 'ఆయన ఎవరికైనా ద్రోహం తలపెట్టాడా' అని అడుగగా, దానికి నీవు 'ఆయన ఎప్పుడూ, ఎవరికీ ద్రోహం తలపెట్టలేదని' జవాబిచ్చినావు. నిశ్చయంగా, ప్రవక్తలెవరూ ఇతరులకు ఎలాంటి ద్రోహం చేయరు.

అప్పుడు నేను 'ఈయన కంటే ముందు ఎవరైనా ఇలా దావా చేసారా' అని అడుగగా, దానికి నీవు 'లేదని' జవాబిచ్చినావు. నేను 'ఒకవేళ ఈయన కంటే ముందు ఎవరైనా ఇలా దావా చేసి ఉన్నట్లయితే, తను వారి బోధనలను నకలు చేస్తున్నాడని' అందామనుకున్నాను."

ఆ తరువాత అబూ సుఫ్యాన్ ఇంకా ఇలా అన్నాడు "హిరాక్ల్యలస్ నన్ను ఇలా అడిగినాడు 'ఈయన మిమ్మల్ని ఏమి చేయమని ఆదేశిస్తున్నాడు?'

దానికి నేను ఇలా అన్నాను 'ఆయన మమ్మల్ని నమాజు ఆచరించమని, జకాతు చెల్లించమని, బంధుమిత్రులతో సత్సంబంధాలు నెరపమని, శీలవంతమైన జీవితం గడపమని ఆదేశిస్తున్నాడు.'

అపుడు హిరాక్యులస్ 'నీవు ఏమేమి చెప్పావో అదంతా ఒకవేళ సత్యమే అయితే, ఆయన నిజంగానే ఒక ప్రవక్త. ఒక ప్రవక్త రాబోతున్నాడనే విషయం నాకు తెలుసు. కానీ, ఆయన మీలో నుంచి వస్తాడని నేనెప్పుడూ ఊహించలేదు. నేను ఆయన వద్దకు చేరగలను అనే విషయం నాకు రూఢీగా తెలిస్తే, నేను ఆయనను తప్పకుండా కలుస్తాను. నేను ఆయనను కలిసినప్పుడు, ఆయన పాదాలు కడుగుతాను. నిశ్చయంగా ఆయన సామ్రాజ్యం నా పాదాక్రాంతమై ఉన్న ఈ రాజ్యం వరకూ విస్తరిస్తుంది.' అని అన్నాడు.

ఆ తరువాత అల్లాహ్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పంపిన ఉత్తరాన్ని హిరాక్యులస్ తెప్పించుకుని, దానిని మరల చదివించినాడు. అందులో ఇలా వ్రాసి ఉంది:

'అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో, (ఈ లేఖ) అల్లాహ్ యొక్క సందేశహరుడైన ముహమ్మద్ నుండి, బైజాంటైన్ సార్వభౌముడైన హిరాక్యులస్ సమక్షమునకు; సత్యమార్గమును అనుసరించే వానిపై శాంతి కురుయుగాక!

ఇస్లాం స్వీకరించమని నేను మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను.

ఇస్లాం స్వీకరించండి, (అల్లాహ్ శిక్ష నుండి) మీరు రక్షింపబడతారు.

ఇస్లాం స్వీకరించండి, అల్లాహ్ మీకు రెట్టింపు ప్రతిఫలాన్నిస్తాడు. ఒకవేళ మీరు తిరస్కరిస్తే, మీ సామ్రాజ్యంలోని ప్రజలందరి పాపాలకు (ఇస్లాం స్వీకరించకపోవటానికి) మీరే బాధ్యులవుతారు.

"ఓ గ్రంథప్రజలారా! మాకూ, మీకూ మధ్య సమానంగా ఉన్న ఆ మాట వైపునకకు రండి - మనం అల్లాహ్ ను తప్ప వేరెవ్వరినీ ఆరాధించరాదు; మరియు దేనినీ, ఎవ్వరినీ ఆయనకు సాటిగా చేయరాదు; మరియు

అల్లాహ్ ను తప్ప మనలో ఎవ్వరూ, ఇతరుల నెవ్వరినీ ప్రభువులుగా చేసుకోరాదు. ఒకవేళ వారు (తిరస్కరించి) వెనుదిరిగితే, వారితో మీరు ఇలా అనండి–'మేము ముస్లింలము (తలఒగ్గి, అల్లాహ్ కు విధేయులైన వారము) అనే విషయానికి మీరు సాక్షులుగా ఉండండి.'" ఖుర్ఆన్ 3:64

ఆయన ఉత్తరం చదవడం పూర్తి చేసిన తరువాత, సభలోని ప్రజలు బిగ్గరగా మాట్లాడటం మొదలు పెట్టారు. సభ అంతా అరుపులు, కేకలతో నిండిపోయింది. అపుడు మమ్మల్ని అక్కడి నుండి బయటకు పంపివేసినారు. "

ఆ తరువాత అబూ సుఫ్యాన్ ఇంకా ఇలా అన్నాడు 'బయటికి వస్తూ, మేము ఒంటరిగా ఉన్నపుడు, నేను నా అనుచరులతో ఇలా అన్నాను 'ఇబ్నె అబూ కబ్షా'* విషయం చాలా ప్రసిద్ధికెక్కుతున్నది. చివరికి బనూ అస్ఫార్ (రోమన్ల) చక్రవర్తి కూడా భయపడటం మొదలు పెట్టాడు'.

ఆ తరువాత అబూ సుఫ్యాన్ 'ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తప్పకుండా విజయవంతులవుతారని నేను అప్పటి నుండే నమ్మసాగాను. చివరికి నేను ఇస్లాం స్వీకరించకుండా ఉండలేకపోయాను' అని జతచేసినాడు.

అజ్జుహిరీ అనే ఒక ఇస్లామీయ పండితుడు ఇలా వ్యాఖ్యానించినాడు, "తరువాత హిరాక్ల్యలస్ తన రాజ్యంలోని ముఖ్యులందరినీ తన రాజభవనంలో సమావేశ పరచి, వారితో ఇలా అన్నాడు 'ఓ బైజాంటైన్ ప్రముఖులారా, మీ సామ్రాజ్యం మీతోనే ఉండేలాగా మీకు శాశ్వత విజయం మరియు మార్గదర్శకత్వం లభించాలని కోరుకుంటున్నారా?' ఈ మాట వినగానే వారంతా అడవి జంతువులలాగా ద్వారం వైపు పరుగెత్తినారు. కానీ, ద్వారం మూయబడి ఉంది. అపుడు హిరాక్ల్యలస్ తన వారితో 'వారిని వెనుకకు తీసుకుని రండి' అన్నాడు. వారిని రప్పించిన తరువాత, ఆ ప్రముఖులతో మరల అతను ఇలా పలికినాడు 'నేను కేవలం మీరు మీ

ధర్మానికి ఎంత గట్టిగా కట్టుబడి ఉన్నారో పరీక్షించడం కోసమే అలా అన్నాను. మీ కట్టుబాటును చూసి, నాకు సంతోషంగా ఉంది.' అది విని ఆ ప్రముఖులు సంతోషంగా అతని ముందు సాష్టాంగపడినారు." (సహీహ్ అల్ బుఖారీ 6వ గ్రంథం, హదీథ్ నెం. 75).

*అబూ కబ్షా అనే ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క తండ్రి కాదు. కానీ, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పై తిరస్కారంతో అబూ సుఫ్యాన్ ఆయనను అలా హేళన చేస్తూ అలా పలికినాడు.

# జననం, బాల్యం మరియు ప్రవక్తత్వం

క్రీ.శ. 571 వ సంవత్సరంలో, అరేబియా ద్వీపకల్పం యొక్క ధార్మిక మరియు ఆర్థిక ముఖ్యపట్టణమైన మక్కా నగరంలో, అరబ్బులందరూ అత్యంత శ్రేష్ఠమైన వంశంగా గౌరవించే ఖురైష్ తెగలో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మించారు. అరబ్బులు మక్కా నగరాన్ని (హజ్జ్ మరియు ఉమ్రా నిమిత్తం) సందర్శించి, తమ పూర్వీకులైన ప్రవక్త ఇబ్రాహీం అలైహిస్సలాం, ఆయన కుమారుడైన ప్రవక్త ఇస్మాయీల్ అలైహిస్సలాం లు పునర్ నిర్మించిన అల్లాహ్ యొక్క మొట్టమొదటి ఆరాధనా గృహం (కాబాగృహం) చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు.

తల్లి గర్భంలోనే తండ్రిని కోల్పోయిన అనాథ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం. ఆరేళ్ళ వయస్సులో తల్లిని కూడా కోల్పోయి, తాత అబ్దుల్ ముత్తలిబ్ సంరక్షణలోనికి తీసుకోబడినారు. తాత మరణం తరువాత, ఆయన సంరక్షణ బాధ్యతను పినతండ్రి అబూ తాలిబ్ తీసుకున్నారు. ఖురైషీయులు, ఇతర అరబ్బులు – రాతిశిల్పాలను, కొయ్యవిగ్రహాలను, బంగారు విగ్రహాలను ఆరాధించేవారు. వీటిలో కొన్ని కాబాగృహం చుట్టూ ప్రతిష్ఠించబడి ఉండినాయి. ఆ విగ్రహాలు కష్టాలను, హానిని తొలగిస్తాయని మరియు శుభం కలుగజేస్తాయని ప్రజలు విశ్వసించేవారు.

అల్లాహ్ చే ప్రవక్తగా ఎంచుకోబడక ముందు నుండే ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అత్యంత నమ్మకస్తునిగా మరియు నిజాయితీపరునిగా ప్రసిద్ధి చెందారు. ఆయన ఏనాడూ ఎవరినీ మోసగించలేదు, వంచించలేదు, ఈ కారణంగా తన ప్రజలలో 'అల్ అమీన్' (అత్యంత నిజాయితీపరుని) గా ప్రసిద్ధి చెందారు. మక్కా ప్రజలు దూరప్రాంతాలకు ప్రయాణించించేటప్పుడు, తమ విలువైన వస్తువులను ఆయన వద్ద భద్ర పరుచుకునేవారు. ఆయన 'అస్సాదిఖ్' (అత్యంత సత్యవంతుని) గా కూడా ప్రసిద్ధి చెందారు.

ఎందుకంటే ఆయన ఏనాడూ చిన్న అబద్ధం కూడా పలకలేదు. ఆయన మహోన్నతంగా ప్రవర్తించేవారు, ఉత్తమ రీతిలో లేదా మృదువుగా మాట్లాడేవారు, అక్కర గలవారికి సహాయపడటాన్ని ఇష్టపడేవారు. ఆయన యొక్క ప్రత్యేక లక్షణాలు మరియు ఉత్తమ సభ్యతా సంస్కారాల కారణంగా ప్రజలు ఆయనను ఎంతో ప్రేమించేవారు, గౌరవించేవారు. ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటించాడు: "మరియు నిశ్చయంగా నీవు ఉత్తమమైన శీలవంతుడవు" (68:4)

ప్రసిద్ధ స్కాటిష్ చరిత్రకారుడు మరియు రచయిత థామస్ కార్లయిల్ (Thomas Carlyle, d.1885) తన పుస్తకం 'Heroes, Hero-worship and the Heroic in History' లో ఇలా వ్రాసినాడు:

కానీ, చిన్నప్పటి నుండే ఆయన వివేకవంతునిగా, ఆలోచనాపరునిగా గుర్తించబడినారు. సహచరులచే 'అల్ అమీన్ (నిజాయితీపరుడు) ' అని పిలవబడేవారు. సత్యసంధత మరియు విశ్వసనీయత కలిగిన వ్యక్తి. తను చేసే పనులలో, పలికే పలుకులలో మరియు తన ఆలోచనలలో ఆయన సత్యసంధత గలవారు. ఆయనలో ఎల్లప్పుడూ ఏదో ఒక ప్రత్యేకత వారికి కనబడేది. మాటలలో మితభాషి; పలకటానికేమీ లేనప్పుడు నిశ్శబ్దంగా ఉండేవారు; కానీ ఆయన మాట్లాడునప్పుడు పొందికగా, యుక్తంగా, నిష్కపటంగా మాట్లాడేవారు, ఎల్లప్పుడూ అసలు విషయం పైనే దృష్టి కేంద్రీకరించేవారు. ఈ విధమైన సంభాషణే, యోగ్యమైన అసలు సంభాషణ! ఆయన మొత్తం జీవితంలో మనం ఆయనను దృఢత్వం, సోదరభావం, స్వచ్ఛత, నిష్కళంకం మొదలైన లక్షణాలన్నింటినీ తనలో కలిగియున్న వ్యక్తిగా కనుగొంటాము. ఒక గంభీరమైన, నిష్కపటమైన, నిస్వార్థమైన స్వభావం గలవాడు అయినప్పటికీ సరసంగా, మనోహరంగా, సాదరంగా, స్నేహపూర్వకంగా, సహచార/సహవాస యోగ్యంగా మరియు నమ్రతతో మెలిగేవారు. చిరునవ్వు నవ్వుతూ అపుడపుడు పరిహాసాలాడేవారు.

ఆయన నవ్వు కూడా స్వచ్ఛంగా, సహజంగా ఉండేది: కొందరు జనుల గురించిన విషయాలు ఎంత అబద్ధంగా ఉంటాయో, వారి నవ్వు కూడా అంతే అసహజంగా, తెచ్చిపెట్టుకున్నట్లుగా ఉంటుంది. వారు నవ్వు అసహజమైనదిగా, కపటమైనదిగా ఉంటుంది.

ఆయన స్వతస్సిద్ధమైన, స్వేచ్ఛాయుతమైన, సాహసవంతమైన, న్యాయవంతమైన ఆదర్శమానవుడి లక్షణాలతో నిండిన ఒక పరిపూర్ణ మహనీయ వ్యక్తి! ఏ పాఠశాలా ఆయనకు శిక్షణ ఇవ్వలేదు. ఏ ఉపాధ్యాయుడూ, గురువూ ఆయన స్వభావాన్ని తీర్చిదిద్దలేదు మరియు ఆయనకు సభ్యతా సంస్కారాలు నేర్పలేదు. ఆయనలోని ఉన్నతమైన గుణగుణాలు ఆయనకు శిక్షణ ఇవ్వవలసిన అవసరమే లేదని చాటిచెప్పేవి. ఆయన ఆ ఎడారిలో తనకు ఇవ్వబడిన బాధ్యతను తన జీవితంలో ఒంటరిగానే పూర్తిచేసారు.

ఆయన ఎలాంటి అసత్యపు పనులలో పాల్గొనలేదు. మద్యపానం, విగ్రహారాధన, వాటిపై ప్రమాణం చేయటం, వాటి పేరున బలివ్వడం మొదలైన అసత్య కార్యకలాపాల్లో ఏనాడు పాల్గొనలేదు. కొంతకాలం తమ ప్రజల గొర్రెల కాపరిగా పనిచేసినారు. దీని గురించి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు "అల్లాహ్ చే ఎంచుకోబడిన ప్రతి ప్రవక్తా గొర్రెల కాపరిగా పనిచేసినవాడే". అది విని ఆయన సహచరులు ఇలా అడిగారు: "మీరు కూడానా, ఓ అల్లాహ్ ప్రవక్తా?". అపుడు "అవును, నేను మక్కా ప్రజల గొర్రెల మందను కాచేవాడిని"అన్నారు. (సహీహ్ బుఖారీ 2143)[1]

[1]. మొదట పశువులతో వ్యవహరించడాన్ని నేర్పడం ద్వారా మానవులతో వ్యవహరించడానికి తయారు చేయడమే దీని వెనుక నున్న వివేకమని పేర్కొనబడింది. మేకలను మరియు గొర్రెలను మేపుట వ్యక్తులలో ప్రేమను పెంచుతుంది మరియు

ప్రవక్తగా ఎంచుకోబడక పూర్వం, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హీరా గుహలో ఏకాంతంగా గడపటాన్ని ఎక్కువ ఇష్టపడేవారు. ఒక్కోసారి అనేక రాత్రులు నిరంతరంగా అక్కడే గడిపేవారు.

40 ఏళ్ళ వయస్సులో, ఒకసారి హీరా గుహ వద్ద ఉండగా, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై మొట్టమొదటిసారి వహీ (దివ్యవాణి) అవతరించింది. దీని గురించి ఆయేషా రదియల్లాహు అన్హా[1] ఇలా వివరించారు:

మక్కాలోని హీరా గుహలో ఉంటున్నపుడు, మొదటగా అల్లాహ్ యొక్క ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు మంచి స్వప్నాలు వచ్చేవి (కలల రూపంలో దివ్యవాణి అవతరించేది). ఆయనకు వచ్చిన ప్రతి కలా ఉషోదయ కాంతిరేఖల వలే నిజమయ్యేది. ఆ తరువాత అల్లాహ్ యొక్క ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అక్కడ ఏకాంతంలో గడపటాన్ని ఇంకా ఎక్కువగా ఇష్టపడసాగారు. ఎడతెరపిలేకుండా అనేక రాత్రింబవళ్ళు ఆయన హీరాగుహలో గడిపేవారు. ఇంటికి వచ్చి, ఆహారపదార్థాలను తీసుకుని, మరల అక్కడికే వెళ్ళేవారు. తన భార్య ఖదీజా రదియల్లాహు అన్హా[2] వద్దకు వచ్చినపుడు, దీర్ఘకాల ఏకాంతవాసానికి సరిపోయేటట్లుగా ఆయన తాజా ఆహారపదార్థాలను ఏర్పాటు చేసుకునే వారు.

ఒకసారి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హీరాగుహలో ఉండగా, దైవదూత జిబ్రయీలు ఆయన వద్దకు వచ్చి, చదవమని ఆజ్ఞాపించారు.

---

సున్నిత హృదయం గలవారిగా చేస్తుంది. ఆవులు, గుర్రాలు మరియు ఒంటెలను పెంచుట మరియు మేపుట ద్వారా స్థిరత్వం పెరుగుతుంది.

[1]. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఒక భార్య.

[2]. ఖదీజా రదియల్లాహు అన్హా, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క మొదటి భార్య.

దానికి ఆయన "నాకు చదవటం రాదు" అని జవాబిచ్చారు. అపుడు జిబ్రయీలు ఆయన శ్వాస ఆగిపోయేటంత గట్టిగా ఆయనను కౌగలించుకుని, వదలిపెట్టారు. ఆ తరువాత "ఓ ముహమ్మద్! చదువు" అని అన్నారు. మరలా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం "నాకు చదవటం రాదు" అని జవాబిచ్చారు. రెండోసారి జిబ్రయీలు ఆయనను గట్టిగా కౌగలించుకుని, వదలిపెట్టారు. ఆ తరువాత "ఓ ముహమ్మద్! చదువు" అని అన్నారు. అయినా ఆయన చదవలేదు. మరలా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం "నాకు చదవటం రాదు" అని జవాబిచ్చారు. అప్పుడు జిబ్రయీలు ఆయన శ్వాస ఆగిపోయేటంత గట్టిగా మరోసారి ఆయనను కౌగలించుకుని, ఇలా పలుకుతూ వదలిపెట్టారు **"చదువు! నీ ప్రభువు పేరుతో, ఆయనే (సర్వాన్ని) సృష్టించాడు. ఆయనే మానవుణ్ణి రక్తపుముద్దతో సృష్టించాడు. చదువు! మరియు నీ ప్రభువు పరమదాత."** (ఖుర్ఆన్ 96:1-3)

అల్లాహ్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం భయంతో వణుకుతూ, పరుగు పరుగున ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో ప్రవేశించి, ఖదీజా రదియల్లాహు అన్హాతో "నన్ను దుప్పటితో కప్పివేయి, నన్ను దుప్పటితో కప్పివేయి!" అన్నారు. ఖదీజా రదియల్లాహు అన్హా ఆయనను దుప్పటితో కప్పివేసారు. భయం తగ్గిన తరువాత, హీరా గుహలో అతనికి ఎదురైన అనుభవాన్ని ఆయన ఆమెకు తెలిపి, "నాకేదో జరుగబోతుందని, నా ప్రాణానికి ముప్పు వాటిల్లుతుందని, నష్టం జరుగుతుందని భయంగా ఉంది" అని అన్నారు. అపుడు ఖదీజా రదియల్లాహు అన్హా ఇలా పలుకుతూ ఆయనకు ధైర్యం చెప్పినారు: "అల్లాహ్ సాక్షిగా! నీవు చింతించవద్దు. అల్లాహ్ నిన్ను ఎన్నడూ అగౌరపరచడు. ఎందుకంటే నీవు బంధువులతో మంచిగా ప్రవర్తిస్తావు. నీవు పేదలకు, అక్కరగలవారికి సహాయపడతావు. నీవు

దానశీలుడివి మరియు నీవు అతిథులను ఆదరిస్తావు. కష్టాలలో ఉన్నవారికి తోడ్పడతావు."

ఆ తరువాత ఖదీజా, తన బంధుపైన వరఖా ఇబ్నె నౌఫల్ ఇబ్నె అసద్ ఇబ్నె అబ్దుల్ ఉజ్జా వద్దకు తన భర్తను తీసుకు వెళ్ళారు. ఆయన ఇస్లాంకు పూర్వం (అజ్ఞాన కాలంగా ప్రసిద్ధి చెందిన కాలంలో) క్రైస్తవునిగా మారిపోయారు. ఆయన హిబ్రూ భాషలో బైబిలును (ఇంజీలును) వ్రాసారు, కాని తరువాత జీవితంలో తన కంటిచూపును కోల్పోయారు. ఖదీజా ఆయనతో "ఓ సోదరుడా! నీ మేనల్లుడు (అంటే ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్పేదేమిటో విను" అన్నారు. అది విని, వరఖా ఆయనను ఇలా అడిగారు "ప్రియమైన మేనల్లుడా, నీవేమి చూసావు?"

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హీరా గుహలో తను చూసిన దానిని అతనికి తెలిపారు. అది వినగానే వరఖా ఇలా అన్నారు,

"అల్లాహ్ సాక్షిగా! అతను ప్రవక్త మూసా అలైహిస్సలాం వద్దకు వచ్చిన జిబ్రయీల్ దైవదూత. నీ ప్రజలు నిన్ను మక్కా నుండి బహిష్కరించే టప్పుడు నేను జీవించి ఉండాలని కోరుకుంటున్నాను." అది విని ఆశ్చర్య పడుతూ, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు "వారు నన్ను మక్కా నుండి బహిష్కరిస్తారా?" అవునంటూ వరఖా ఇలా అన్నారు "నీకు ఇవ్వబడినటువంటి సందేశాన్ని, తన ప్రజలే తనపై యుద్ధం ప్రకటించటం జరగకుండా ఏ వ్యక్తీ అందజేయలేదు. ఒకవేళ ఇది నేనుండగా జరిగితే, నేను నీకు సహాయపడతాను, నిన్ను సమర్ధిస్తాను."

ఈ సంఘటన జరిగిన కొద్ది కాలానికే వరఖా మరణించారు. అప్పటి వరకు మరల దివ్యవాణి అవతరించలేదు. (బుఖారీ)

పై హదీథులో[1] పేర్కొనబడిన ఖుర్ఆన్ అధ్యాయం, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి ప్రవక్త పదవి ఆరంభాన్ని సూచిస్తుంది. ఆ తరువాత అల్లాహ్ ఈ ఆయతులను అవతరింపజేసాడు.

ఓ (దుప్పటిలో) చుట్టుకున్న వాడా! లే! హెచ్చరించు! నీ ప్రభువు గొప్పదనాన్ని (ఘనతను) కొనియాడు. మరియు నీ దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకో! (ఖుర్ఆన్ 74:1-4)

ఖుర్ఆన్ యొక్క ఈ అధ్యాయం అవతరించగానే, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా ప్రజలను బహిరంగంగా ఇస్లాం వైపు పిలవటం ప్రారంభించారు. మొదట ఆయన తన స్వంత బంధువులు మరియు తన స్వంత తెగవారిని పిలిచారు, కానీ వారిలో చాలా మంది, వారు ఇంతకు ముందెన్నడూ వినని విషయం వైపునకు మరియు తరతరాలుగా తమలో నాటుకుపోయిన విగ్రహారాధనను ఖండిస్తున్న విషయం వైపునకు పిలుస్తున్నారని చెబుతూ ఆయన పిలుపును గట్టిగా తిరస్కరించారు.

ఇస్లాం ఒక సంపూర్ణ జీవన విధానం. ధార్మిక, రాజకీయ, ఆర్థిక మరియు సామాజిక విషయాలన్నింటితో ముడిపడి ఉంది. కేవలం అల్లాహ్ ను మాత్రమే ఆరాధించమని పిలవటమే కాకుండా, విగ్రహారాధనలన్నింటినీ త్యజించమనీ మరియు ప్రీతికరమైనవిగా భావించే మత్తుపదార్థాలు, వ్యభిచారం, జూదం, వడ్డీ వంటి వాటిని కూడా త్యజించమని పిలుస్తుంది.

---

[1]. హదీథ్ అంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క పలుకులు, ఆచరణలు, ఆయన అనుమతించిన విషయాలు లేదా ఆయన స్వభావం. అప్రామాణికమైన ఉల్లేఖనలను మరియు కల్పిత అసత్యాలను ఎదుర్కోవటానికి, ఎలాంటి అంతరాయం లేకుండా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వరకూ చేరే నమ్మకస్తులైన ఉల్లేఖకుల పరంపరచే ఉల్లేఖించబడిన హదీథుల ప్రామాణికతను చారిత్రకంగా పరిశోధించటానికి హదీథు విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి చేయబడినది.

పరస్పరం న్యాయంగా మరియు మంచిగా / సముచితమైన రీతిలో ప్రవర్తించవలెనని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలందరూ సమానులేనని, అల్లాహ్ పట్ల ఉండే భయభక్తుల ద్వారా కలిగే భేదం తప్ప వారి మధ్య ఎలాంటి భేదాలు / తారతమ్యాలు లేవని, ఆయన స్పష్టం చేసారు. అరబ్బులలో అత్యుత్తమంగా పేర్కొనబడే ఖురైషీ తెగ, తన కంటే తక్కు స్థాయి తెగలతో మరియు బానిసలతో సమానంగా చూడబడటాన్ని ఎలా తట్టుకోగలదు! దీని వలన వారు ఇస్లాంను గట్టిగా వ్యతిరేకించడమే కాకుండా, ఆయనను అనేక విధాలుగా హింసించారు. అవమాన పరచే ఉద్దేశంతో ఆయనను మతిస్థిమితం కోల్పోయిన వాడని, మాంత్రికుడని, జ్యోతిష్కుడని మరియు అసత్యపరుడని పిలిచేవారు. ఇస్లాం కంటే పూర్వం ఆయనపై మోపటానికి సాహసించలేని నేరాలను, వారు ఆయనపై ఆరోపించసాగారు. ఆయనకు హాని కలిగించమని ఆయనకు వ్యతిరేకంగా సామాన్య ప్రజలను ఉసిగొలిపేవారు. ఆయన సహచరులను అణగ ద్రొక్కమని మరియు చిత్రహింసలు పెట్టమని తమ అనుయాయులను పురిగొల్పేవారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సహచరుడైన అబ్దుల్లాహ్ ఇబ్నె మస్ఊద్ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు "కాబాగృహానికి దగ్గరగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నమాజు చేయటం కొరకు నిలుచున్నపుడు, సమీపంలో కూర్చుని ఉన్న ఖురైషీయుల సమూహంలో నుండి ఒకతను ఇలా అన్నాడు: 'ఈ మనిషిని చూశారా మీరు? ఫలానా వాని ఒంటెల పేగులు, కసురు, కశ్మలము మొదలైన మలినాలను ఎవరైనా ఇక్కడికి తీసుకువచ్చి, ఆయన సజ్దాలో వెళ్ళే వరకు నిరీక్షించి, వాటిని ఆయన భుజాల మధ్యన ఉంచగలరా?' ". వారిలో నుండి ఒక పరమ నీచుడు ఆ పని చేయటానికి సిద్ధపడినాడు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సజ్దాలోనికి వెళ్ళగానే, అతడు చాలా బరువుగా ఉన్న ఆ మలినాలను ఆయన వీపుపై భుజాల మధ్య, ఉంచాడు. ఆ బరువుకు

ఆయన సజ్దాలో నుండి లేవలేక, ఇబ్బంది పడసాగారు. అది చూసి వారు ఒకరిపై మరొకరు పడిపోయేటంతగా పగలబడి నవ్వసాగారు. అక్కడి ప్రజలలో నుండి ఒకతను పిన్న వయస్సులో ఉన్న ఫాతిమా రదియల్లాహు అన్హా (ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కుమార్తె) వద్దకు వెళ్ళి, కాబాగృహం వద్ద జరుగుతున్న ఘోరాన్ని గురించి తెలిపాడు. వెంటనే ఆమె పరుగు పరుగున ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి, ఆయన వీపుపై నుండి బరువైన ఆ మలినాలను తొలగించింది. ఆ తరువాత అక్కడ కూర్చుని ఉన్న ఖురైషీయులను శపించింది. (సహీహ్ బుఖారీ)

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఒక సహచరుడు మునీబ్ అల్ అజ్దీ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు: "అజ్ఞాన కాలంలో ప్రజలతో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అంటూ ఉండగా నేను విన్నాను: 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని పలకండి, మీరు సాఫల్యం పొందుతారు." అది విని, కొందరు ఆయన ముఖంపై ఉమ్మేశారు, కొందరు ఆయన ముఖంపై మట్టి విసిరారు మరియు మరికొందరు మధ్యాహ్నం వరకు ఆయనను దూషిస్తూ ఉండినారు. ఒకసారి ఎవరో ఒక బాలిక ఆయన వద్దకు పెద్ద తోలుతిత్తిలో నీరు తీసుకు వస్తే, ఆయన తన ముఖాన్ని మరియు చేతులను కడుక్కొని, ఆ బాలికతో ఇలా పలికారు "ఓ పుత్రికా! నీ తండ్రి అవమానానికి గురి చేయబడతాడనో లేదా బీదరికం అతనిపై విరుచుకు పడుతుందనో నీవు భయపడవద్దు." (ముఅజమ్ అల్ కబీర్)

మక్కా ముష్రికుల (విగ్రహారాధకుల) దుష్కృత్యాలను గురించి అడిగిన ప్రశ్నకు జవాబుగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సహచరుడైన అబ్దుల్లాహ్ బిన్ అమర్ అల్ ఆస్ రదియల్లాహు అన్హుమా ఇలా అన్నారు: "ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాబాగృహం వద్ద నమాజు చేస్తుండగా, (ఒక విగ్రహారాధకుడు) ఆయన సమీపానికి వచ్చి, తన కండువా తీసి ఆయన

మెడ చుట్టూ, గట్టిగా బిగించసాగాడు. అబూ బకర్ (రదియల్లాహు అన్హు)[1] వెంటనే పరుగెత్తుకుంటూ వచ్చి, అతడి భుజం పట్టుకుని, 'అల్లాహ్ యే తన ప్రభువని ప్రకటించినందుకు గాను మరియు మీ ప్రభువు నుండి స్పష్టమైన సూచనలు మీ వద్దకు తీసుకు వచ్చినందుకు గాను, మీరు ఒక వ్యక్తిని చంపాలనుకుంటున్నారా?' అని అంటూ అతడిని దూరంగా త్రోసివేసారు:" సహీహ్ బుఖారీ.

ఇస్లాం వైపు ఆహ్వానించటం నుండి ఇటువంటి సంఘటనలు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఆపలేకపోయాయి. హజ్[2] కొరకు మక్కా వచ్చిన తెగలకు ఆయన తనపై అవతరించబడిన దివ్యసందేశాన్ని బోధించటం కొనసాగించారు. మక్కా నగరానికి ఉత్తరంలో ఉన్న యత్రిబ్ అనే ఒక చిన్న పట్టణం నుండి హజ్ యాత్ర కొరకు వచ్చిన ఒక చిన్న బృందం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై విశ్వాసం ప్రకటించింది మరియు ఒకవేళ వారి వద్దకు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం వలస వస్తే, తాము పూర్తిగా సహాయం అందిస్తామని ఆయనకు వాగ్దానం చేశారు. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం తన సహచరుడైన ముస్అబ్ బిన్ ఉమైర్ రదియల్లాహు అన్హు వారిని ఇస్లాం ధర్మ నియమాలు బోధించటానికి వారితో పాటు పంపారు. మక్కాలో తమ స్వంత ప్రజలచే ముస్లింలు ఎంతో దౌర్జన్యానికి గురైన తరువాత, మదీనా వలస కొరకు అల్లాహ్ అనుమతిచ్చాడు. మదీనా వాసులు ఎంతో ఆప్యాయతతో, ఆదరణతో, హృదయపూర్వకంగా వారిని

---

[1]. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అత్యంత దగ్గరి సహచరుడు మరియు ఆయన మరణానంతరం ఇస్లాం యొక్క మొదటి ఖలీఫా.

[2]. అల్లాహ్ ఆదేశించిన విధంగా నిర్ణీత సమయంలో, నిర్ణీత పద్ధతిలో మక్కా సందర్శనం మరియు అక్కడి ఆచరణలు, ఆరాధనలు.

ఆహ్వానించారు. నవీన ఇస్లామీయ రాజ్యానికి మదీనా రాజధాని అయింది. అక్కడి నుండి ఇస్లాం దూరదూరాలకు, విస్తృతంగా వ్యాపించింది.

స్వంత ప్రాణం కంటే అధికంగా తనను ఇష్టపడే విధంగా ఎదిగిన మదీనా వాసులకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, అల్లాహ్ ఉపదేశాలను నేర్పించి, ఆచరించేటట్లు చేసినారు. ఆయనకు సేవలు అందించడానికీ మరియు అల్లాహ్ కొరకు ఇస్లాం మార్గంలో తమ వద్దనున్నదంతా ఖర్చు చేయడానికి వారు పోటీ పడేవారు. విశ్వాస విషయంలో ఆ నూతన సమాజం పటిష్ఠంగా మరియు పరిపూర్ణంగా వృద్ధిచెందింది. ఐకమత్యం, తోడ్పాటు, సహాయ సహకారాలు, పరస్పర ప్రేమాభిమానాలు, సోదరత్వం మొదలైన వాటిని అలవర్చుకోవడంతో, ప్రజలలో ఆనందోత్సాహాలు ప్రస్ఫుటం అవసాగాయి. అల్లాహ్ ధర్మంలో ప్రజలందరూ సమానులుగా, ఒకరికొకరు సోదరులుగా పరిగణింపబడతారు. ధనవంతులూ పేదవారు, నల్లవారూ తెల్లవారు, అరబ్బులూ అరబ్బేతరుల మధ్య అల్లాహ్ యొక్క భయభక్తులు మరియు సత్కార్యాల ద్వారా కలిగే ఔన్నత్యం తప్ప ఎలాంటి తారతమ్యాలు ఉండవు.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఇస్లామీయ పిలుపు దావానలంలా వ్యాపిస్తున్న విషయాన్ని గ్రహించిన ఖురైషీయులు, ఇస్లాం వ్యాప్తిని ఎలాగైనా ఆపాలని గట్టిగా నిశ్చయించుకున్నారు. అవకాశం లభించగానే, వారు ఆయనతో ఇస్లాం యొక్క మొట్టమొదటి యుద్ధం చేసారు. అది బదర్ యుద్ధం పేరుతో ప్రసిద్ధి చెందినది. వారు సైనికబలంలో మరియు ఆయుధ సామాగ్రిలో ఆధిక్యత కలిగి ఉన్నప్పటికీ, ఓటమి పాలయ్యారు. ముస్లింల సంఖ్య 314 మంది సైనికులు మాత్రమే కాగా, మక్కా బహుదైవారాధకులు 1000 మంది సైనికులు ఉండిరి. అయినప్పటికీ, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఆయన సహచరులకే అల్లాహ్ స్పష్టమైన విజయాన్ని ప్రసాదించినాడు. ఆ తరువాత ముస్లింలు మరియు మక్కా విగ్రహారాధకుల మధ్య అనేక యుద్ధాలు జరిగాయి. ఎనిమిది సంవత్సరాల తరువాత

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం 10,000 మందితో కూడిన బలమైన సైన్యాన్ని తయారుచేయగా, అది మక్కా నగరాన్ని అవలీలగా జయించింది. ఆ ఘనవిజయంతో తనను మరియు తన సహచరులను అనేక విధాలుగా కష్టపెట్టిన మరియు అతిక్రూరంగా హింసించిన మక్కా విగ్రహారాధకులపై ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆధిక్యత సాధించి, వారిని వశపరచు కున్నారు. వారు తమపై జరిపిన హింసలకు మరియు అరాచకానికి ప్రతీకారం తీర్చుకునే అవకాశం లభించినప్పటికీ, ఆ విజయ సందర్భంలో ఆయన వారితో చాలా ఉదారంగా ప్రవర్తించారు. ఘనవిజయం సాధించిన ఈ సంవత్సరం 'విజయ సంవత్సరం'గా ప్రసిద్ధి చెందినది. దీని గురించి అల్లాహ్ ఖుర్ఆన్ లో ఇలా ప్రకటించినాడు.

"(ఓ ముహమ్మద్!) ఎప్పుడైతే అల్లాహ్ సహాయం వస్తుందో మరియు విజయం (లభిస్తుందో), మరియు నీవు ప్రజలను గుంపులు గుంపులుగా అల్లాహ్ ధర్మంలో ప్రవేశించడం చూస్తావో, అపుడు నీవు నీ ప్రభువు స్తోత్రంతో పాటు ఆయన పవిత్రతను కొనియాడు మరియు ఆయన క్షమాభిక్షను అర్థించు. నిశ్చయంగా, ఆయనే పశ్చాత్తాపాన్ని అంగీకరించే వాడు" సూరహ్ అన్నస్ర్ 110:1-3

మక్కావిజయం తరువాత, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కావాసులను సంబోధించి, ఇలా అన్నారు: "ఇపుడు నేను మిమ్మల్ని ఏమి చేస్తానని అనుకుంటున్నారు?" దానికి వారిలా అన్నారు: "మీరు మాకు కేవలం మంచినే చేస్తారు. మీరు కరుణ మరియు ఔదార్యం గల సోదరులు. కరుణ మరియు ఔదార్యం గల మేనల్లుడివి!" అపుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: "వెళ్ళండి, మీరు విముక్తులు." బైహఖీ గ్రంథం.

ఈ గొప్ప క్షమాభిక్ష కారణంగా వేలమంది ప్రజలు ఇస్లాం స్వీకరించారు. తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తిరిగి మదీనాకు చేరుకున్నారు.

కొన్నాళ్ళ తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్ యాత్ర చేయాలని సంకల్పించారు. దాదాపు 1,14,000 సహచరులతో ఆయన మక్కా నగరానికి చేరుకుని, హజ్ యాత్ర పూర్తిచేసినారు. ఈ హజ్ 'హజ్జతుల్ విదాఅ' అనే పేరుతో ప్రసిద్ధి గాంచింది. ఎందుకంటే ఈ హజ్ తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరో హజ్ చేయలేదు మరియు హజ్ చేసిన కొద్ది కాలానికే మరణించారు.

9వ దిల్ హిజ్జహ్ నాడు అరాఫాత్ కొండ వద్ద, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన వీడ్కోలు ప్రసంగం చేసారు. అల్లాహ్ ను స్తుతించిన తరువాత, ఆయన ఇలా అన్నారు:

"ఓ ప్రజలారా! శ్రద్ధగా ఆలకించండి, ఎందుకంటే ఈ సంవత్సరం తర్వాత నేను మీ మధ్యన జీవించి ఉంటానో లేదో నాకు తెలియదు. కాబట్టి, నేను మీకు చెబుతున్న దానిని చాలా జాగ్రత్తగా వినండి మరియు **ఈ పలుకులను (సందేశాన్ని) నేడు ఇక్కడ హాజరు కాలేకపోయిన వారికి చేరవేయండి.**

ఓ ప్రజలారా! మీరు ఈ నెలను, ఈ దినమును పవిత్రమైనదిగా పరిగణించినట్లే, ప్రతి ముస్లిం యొక్క ప్రాణాన్ని మరియు సంపదను(ఆస్తిని) పవిత్రమైనదిగా పరిగణించండి. మీకు వొప్పగించిన వస్తువుల్ని, వాటి హక్కుదారులైన యజమానులకు తిరిగి వాపసు చెయ్యండి. మీకెవ్వరూ హాని కలిగించ వీలు లేకుండా మీరు ఎవ్వరికీ హాని కలిగించకండి. 'నిశ్చయంగా మీరు మీ రబ్ (ప్రభువు) ను కలుసుకోబోతున్నారు మరియు ఆయన నిశ్చయంగా మీ కర్మల లెక్క తీసుకోబోతున్నాడు' అనే విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోండి.

మీరు వడ్డీ తీసుకోవటాన్ని అల్లాహ్ నిషేధించాడు; కాబట్టి ఇక మీదట వడ్డీ వ్యాపారానికి సంబంధించిన నియమ నిబంధనలన్నీ రద్దు చేయబడినవి.

మీ అసలు మూలధనం మాత్రం మీరు తీసుకోవచ్చును. ఈ విషయంలో మీరు అసమానత్వాన్ని (హెచ్చుతగ్గులను, భేదాలను, వైషమ్యాలను) ఇతరులపై ఆపాదించకూడదు, సహించనూ సహించకూడదు.

షైతాన్ నుండి మీ ధర్మాన్ని కాపాడుకునేందుకు అప్రమత్తంగా (జాగ్రత్తగా) ఉండవలెను. అతడు పెద్ద పెద్ద విషయాలలో మిమ్ముల్ని తప్పు దారి పట్టించే శక్తి తనకు ఏ మాత్రం లేదని తెలుసుకుని, తన ఆశలన్నీ వదులు కున్నాడు. కాబట్టి చిన్న చిన్న విషయాలలో కూడా అతడిని అనుసరించ కుండా అప్రమత్తంగా ఉండండి.

ఓ ప్రజలారా! మీ స్త్రీలపై మీకు కొన్ని ప్రత్యేక హక్కులు ఉన్నమాట వాస్తవమే కాని వారికి కూడా మీ పై హక్కులు ఉన్నాయి. జ్ఞాపకం ఉంచుకోండి, కేవలం అల్లాహ్ పై ఉన్న విశ్వాసం ఆధారంగానే మరియు అల్లాహ్ యొక్క అనుమతి మూలంగానే మీరు వారిని మీ భార్యలుగా చేసుకున్నారు.

ఒకవేళ వారు స్థిరంగా మీ హక్కులను పూర్తిచేస్తున్నట్లయితే, మీ నుండి దయతో ఆహారం (అన్నపానీయాలు) మరియు దుస్తులు పొందే హక్కు వారి స్వంతమవుతుంది. మీ స్త్రీలతో మంచిగా ప్రవర్తించండి మరియు దయతో వ్యవహరించండి ఎందుకంటే వారు మీ జీవిత భాగస్వాములు మరియు శ్రద్ధాభక్తులతో, సేవానిరతితో సహాయ సహకారాలందించే అంకితమైన సహాయకులు ఇంకా మీరు అనుమతించని (ఇష్టపడని) వారితో, వారు స్నేహంగా మెలగకూడదనేది మరియు వారు ఎన్నడూ వ్యభిచరించకూడదనేది వారిపై మీకున్న హక్కు.

ఓ ప్రజలారా! మనస్ఫూర్తిగా నా మాట వినండి. కేవలం అల్లాహ్ నే ఆరాధించండి, ప్రతి నిత్యం ఐదు పూటల నమాజులను ఆచరించండి,

రమదాన్ నెలలో ఉపవాసం పాటించండి, జకాత్ విధిదానం చెల్లించండి మరియు మీకు తగిన శక్తిసామర్థ్యాలు, స్థోమత ఉంటే, హజ్ చేయండి.

సమస్త మానవజాతి ఆదం సంతానమే మరియు ఆదం మట్టితో సృష్టించ బడ్డాడు. అరబ్బులకు అరబ్బేతరులపై ఎలాంటి ఆధిక్యతా లేదు, మరియు అరబ్బేతరులకు అరబ్బులపై ఎలాంటి ఆధిక్యతా లేదు; అలాగే నల్లవారిపై తెల్లవారికి ఎలాంటి ఆధిక్యతా లేదు మరియు తెల్లవారిపై నల్లవారికి ఎలాంటి ఆధిక్యతా లేదు - కేవలం దైవభక్తి పారాయణత్వంలో తప్ప.

ప్రతి ముస్లిం, ప్రతి ఇతర ముస్లింకు సోదరుడని మరియు ముస్లింలందరూ ఒకే సమాజమని గ్రహించవలెను. స్వతంత్రంగా మరియు మనస్ఫూర్తిగా బహుకరిస్తే తప్ప ఒక ముస్లింకు చెందిన వాటిపై, ఇతర ముస్లిం కు ఎటువంటి అధికారం లేదు. కాబట్టి, ఈ విధంగా మీకు మీరే (ఇతరుల హక్కును కాజేసి) అన్యాయంచేసుకోవద్దు.

గుర్తుంచుకోండి! ఒకరోజు మీరు అల్లాహ్ ముందు హాజరవబోతున్నారు. మీరు చేసిన ప్రతి పనికి, ప్రతి ఆచరణకు ఆ రోజున సమాధానం ఇవ్వవలసి ఉంటుంది. కాబట్టి, జాగ్రత్త! నేను ఈ ప్రపంచం నుండి వెళ్ళిపోయిన తర్వాత మీరు సత్యమార్గానికి దూరం కావద్దు.

ఓ ప్రజలారా! నా తర్వాత ఏ ప్రవక్త గానీ లేదా ఏ సందేశహరుడు గానీ రాడు. మరియు ఏ క్రొత్త ధర్మమూ పుట్టదు. కాబట్టి ఓ ప్రజలారా! వివేకంతో వ్యవహరించండి. ఇంకా, నేను మీకు తెలియజేస్తున్న ఈ మాటలను బాగా అర్థం చేసుకోండి. నేను నా వెనుక రెండు విషయాలను వదిలి వెళ్ళు తున్నాను, మీరు వాటిని అనుసరిస్తే, ఎట్టిపరిస్థితిలోను మార్గభ్రష్టులు కారు, అవి ఖుర్ఆన్ మరియు నా సంప్రదాయాలు (సున్నత్).

నా మాటలు వింటున్నవారందరూ, ఇతరులకు చేర్చవలెను, అలాగే వారు కూడా ఇతరులకు చేర్చవలెను. అలా చిట్టచివరిగా విన్నవారు, ఇప్పుడు

నా నుండి ప్రత్యక్షంగా వింటున్న మీకంటే బాగా అర్థం చేసుకుంటారు కాబోలు. ఓ అల్లాహ్, నేను నీ దివ్యసందేశాన్ని నీ ప్రజలకు అందజేసానని సాక్ష్యంగా ఉండుము.

కొన్ని ఉల్లేఖనాల ప్రకారం హిజ్రీ 11వ సంవత్సరం, రబ్బీల్ అవ్వల్ 12వ తేదీన ఆయన మదీనాలో మరణించారు. మదీనాలో ఆయన మరణించిన స్థలంలోనే సమాధి గావించబడినారు. ఆయన మరణవార్త విని ముస్లింలు దిగ్భ్రాంతి చెందారు. కొందరు సహచరులైతే ఆ వార్తను నమ్మలేదు. ఉమర్ (రదియల్లాహు అన్హు) చాలా క్షోభ చెంది, ఇలా అన్నారు: "ఎవరైనా ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణించారని అంటే, నేను అతడి మెడ నరికేస్తాను!" అపుడు అబూ బకర్ (రదియల్లాహు అన్హు) ప్రజలను సంబోధిస్తూ, అల్లాహ్ యొక్క ఈ వచనాలను పఠించారు, "మరియు ముహమ్మద్ కేవలం ఒక 'రసూల్' (సందేశహరుడు) మాత్రమే. నిస్సందేహంగా ఆయనకు పూర్వం ఎందరో సందేశహరులు గతించి పోయారు. మరి ఒకవేళ ఆయన మరణించినా లేదా చంపబడినా మీరు మీ కాలిమడమలపై (ఇస్లాంనుండి) వెనుదిరిగి వెళ్ళిపోతారా? (గుర్తుంచుకోండి) ఎవరైతే అలా వెనుదిరిగి పోతారో, వారు అల్లాహ్ కు అణువంత కూడా నష్టం కలిగించలేరు. మరియు కృతజ్ఞులై ఉండే వారికి, అల్లాహ్ త్వరలోనే తగిన ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు." ఖుర్ఆన్ 3:144

ఈ ఆయతు వినగానే ఉమర్ (రదియల్లాహు అన్హు) తన మాటలు ఆపాడు. ఎందుకంటే ఆయన ఎల్లప్పుడూ అల్లాహ్ ఆజ్ఞలను ఆచరించటంలో మరియు అల్లాహ్ ఆజ్ఞలను ఉల్లంఘించకుండా జాగ్రత్త పడేవారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం 63 సంవత్సరాల వయస్సులో మరణించారు.

అల్లాహ్ చే ప్రవక్తగా ఎన్నుకోబడక పూర్వం, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాలో 40 ఏళ్ళు గడిపారు. ప్రవక్త బాధ్యతలు అప్పగించబడిన

తరువాత, ప్రజలను పరిశుద్ధమైన ఇస్లామీయ ఏకదైవారాధన విశ్వాసం వైపుకు పిలుస్తూ, ఆయన మక్కాలో మరో 13 సంవత్సరాలు గడిపారు. ఆ తరువాత ఆయన మదీనాకు వలస పోయి, అల్లాహ్ నుండి వహీ (దివ్యవాణి) అందుకుంటూ మరియు ప్రజలను ఇస్లాం వైపునకు ఆహ్వానిస్తూ, చివరికి ఖుర్ఆన్ మరియు ఇస్లాం పరిపూర్ణమయ్యే వరకు ఆయన అక్కడ 10 సంవత్సరాలు గడిపారు.

ప్రఖ్యాత నాటక రచయిత, విమర్శకుడు జార్జి బెర్నార్డ్ షా (మ.1950) ఇలా అన్నారు: "దాని అత్యద్భుతమైన జీవనోపయోగ్యత్వం వలన ముహమ్మద్ యొక్క ధర్మాన్ని నేను ఎల్లప్పుడూ అత్యున్నతమైనదిగా గౌరవవించాను. జీవితంలోని మారుతున్న దశలకు ధీటుగా సదృశ్యమయ్యే సామర్థ్యం తనలో ఉన్న ధర్మం కేవలం ఇదొక్కటే. అందుకని ఇది ప్రతి తరం వారిని ఆకర్షిస్తున్నది. ఇది ప్రతి తరాన్ని సంబోధిస్తున్నది. యూరపు నేడు ముహమ్మద్ యొక్క ధర్మాన్ని స్వీకరిస్తున్నట్లుగా, భవిష్యత్తులోనూ దీనిని స్వీకరిస్తుందని భాష్యం చెబుతున్నాను. అజ్ఞానం లేక మతదురభిమానం వలన మధ్యయుగాల క్రైస్తవ పండితులు ముహమ్మదీయ మతానికి నల్లటి రంగులు పులిమారు. నిజానికి వారు ముహమ్మద్ ను, ఆయన ధర్మాన్నీ అసహ్యించుకునే విధంగా శిక్షణపొందారు. వారి దృష్టిలో ముహమ్మద్ ఒక క్రీస్తువిరోధి (యాంటీక్రైస్టు). నేను ఆయన గురించి క్షుణ్ణంగా చదివాను - ఆయన ఒక అద్భుతమైన వ్యక్తి. క్రీస్తువిరోధి లక్షణాలు ఆయనలో మచ్చుకైనా లేవని, ఆయన తప్పక మానవజాతి ముక్తిదాతగా,రక్షకుడిగా పిలవబడాలని అభిప్రాయబడుతున్నాను[1]."

---

[1]. ఎన్ సైక్లోపీడియా ఆఫ్ సీరహ్ – అఫ్జలుర్రహ్మాన్ గారి రచన.

## ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క వర్ణన

మానవుడి సగటు ఎత్తు కంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కొంచెం ఎక్కువ పొడుగ్గా ఉండేవారు. కానీ విచిత్రమేమిటంటే ఆయన జనసమూహాలలో నిలుచుని ఉన్నప్పుడు, ఆ సమూహం చెదిరిపోయేంత వరకు, అక్కడ నిలుచున్నవారిలో ఆయన ఎత్తుకు మించిన వాని కంటే కూడా ఆయనే మరింత ఎత్తుగా కనబడేవారు.

శరీర వర్ణం విషయానికి వస్తే, ఆయన లేత గులాబీ ఛాయతో కూడిన తెల్లటి రంగులో, కొద్దిగా గోధుమ రంగులో కనబడే శరీరం కలిగి ఉండేవారు; ఆయన తల వెంట్రుకలు నల్లటి కారు నలుపు రంగులో, అలలు అలలుగా, పూర్తిగా ఉంగరాల జుట్టులా మాదిరిగా కాకుండా, చెవి దిమ్మల మరియు భుజాల మధ్య వరకు ఉండేవి. కొన్నిసార్లు తల మధ్య భాగంలో నుండి దువ్వుకునేవారు. ఒక్కోసారి వాటిని జడవేసినట్లుగా అల్లేవారు.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బలమైన,దృఢమైన శరీర నిర్మాణం కలిగి ఉండేవారు. ఆయన వీపు పైభాగం మరియు భుజాలు విశాలంగా ఉండి, వాటి మధ్య ప్రవక్తత్వం యొక్క స్పష్టమైన 'సీలు' ఉండేది. ఆయన కండరాలు గల పొడుపైన అవయవాలు, పెద్ద పెద్ద కీళ్ళు మరియు చుట్టుకొలత (నడికట్టు) కలిగి ఉండేవారు. శుష్కించిన పొట్ట ఏనాడూ ఆయన రొమ్మును దాటి బయటకు వచ్చేది కాదు.

ఆయన సహచరులలోని ఒక సహచరుడు వివరించినట్లుగా - 'ఆయన ముఖము, సూర్యుడు ప్రకాశిస్తూ, తన దిశలో పయనిస్తున్నట్లుగా ...' ఆయన ముఖం ప్రకాశవంతంగా ఉండేది. ఆయన మెడ వెండిలాంటి తెలుపు రంగులో ఉండేది; ఆయన నుదురు ఉన్నతంగా, విశిష్టంగా ఉండేది; ఆయన కనుపాపలు విశాలంగా మరియు నల్లగా ఉండేవి. ఆయన కనురెప్పలు పొడవుగా మరియు దట్టంగా ఉండేవి; సన్నని

ముక్కుపుటాలుతో కూడిన ఎత్తైన నిటారైన ముక్కు కలిగి ఉండేవారు; మరణించేనాటికి ఆయన కణతలలో మరియు దట్టమైన గెడ్డం ముందుభాగంలో ఖచ్చితంగా 17 తెల్లటి వెంట్రుకలు కలిగియున్నారు. ఆయన ముంజేతులపై మరియు కాలిపిక్కల పై వెంట్రుకలుండేవి. ఆయన రొమ్ము నుండి నాభి వరకు వెంట్రుకల సన్నటి రేఖ ఉండేది.

అల్లాహ్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నడక వడివడిగా, ముందుకు వంగి నడుస్తున్నట్లుగా ఉండేది. తగినంత బలంతో అడుగు ముందుకు వేసేవారు. ప్రతి పాదాన్నీ స్పష్టంగా నేల నుండి పైకి లేపేవారు. ఆయన నడక వేగాన్ని అందుకోవటంలో శక్తిమంతులు కూడా వెనుకబడి పోయేవారు.

ఎవరైనా తనతో సంభాషిస్తున్నపుడు, తన మొత్తం శరీరాన్ని అతని వైపు త్రిప్పి, తన దృష్టిని పూర్తిగా కేంద్రీకరిస్తూ, అతను తెలిపే విషయంపైన పూర్తి ఏకాగ్రత చూపేవారు. ఎవరినైనా చూపినపుడు ఎదుటివానికి కోపం తెప్పించకుండా ఉండటానికి, పూర్తిగా తెరచి ఉన్న తన చేతిని వాడేవారు. అలాగే ఎవరి ప్రవర్తననైనా విమర్శించినపుడు, అతని పేరుతో విమర్శించక, "ప్రజలు ఫలానా ఫలానా విధంగా ఎందుకు చేస్తారు?" అని అనేవారు. నవ్వేటప్పుడు, ఆయన తన ముందు పళ్ళ మధ్యనున్న సందు మాత్రమే కనబడేటట్టు నవ్వేవారు (పెద్దగా నోరు తెరిచి, పగలబడి నవ్వేవారు కాదు). కోపం వచ్చినపుడు, ఆయన ముఖం ఎర్రగా కందిపోయి; విల్లు ఆకారంలో పొందికగా ఉన్న ఆయన కనుబొమ్మల మధ్య నరం ఉబ్బిపోయేది. ఒకసారి ఆయనిలా పలికారు: "నేను ఆదం సంతానం యొక్క నాయకుడిని మరియు నేను అహంకారంతో ఈమాట అనటం లేదు." అత్తిర్మిధీ.

అహంకారం సంకెళ్ళలో ఆయన బందీకాలేదనేది చిన్నపిల్లలకు కూడా తెలుసు, ఎందుకంటే మదీనా వీధులలో చిన్నపిల్లలు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో ఆటలాడుతూ, ఆయన వ్రేలు పట్టుకుని తమతో పాటు

ముందుకు తీసుకుపోయేవారు. నిశ్చయంగా ఒకసారి ఆయన ఇలా పలికారు: "ఎవరైతే మన చిన్నారులపై దయ చూపరో మరియు మన పెద్దలను గౌరవించరో, వారు మాలోని వారు కాదు" అబూ దావూద్.

ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటించాడు: (ఖుర్ఆన్ ఆయతు భావానువాదం) "(అల్లాహ్ పంపిన) ఒక ప్రవక్త! మీకు స్పష్టమైన అల్లాహ్ సూచనలను వినిపిస్తున్నాడు. అది, విశ్వసించి సత్కార్యాలు చేసేవారిని అంధకారాల నుండి వెలుగులోనికి తీసుకురావటానికి, ... " 65:11

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గురించి, ఆయన చిన్నాన్న కుమారుడు మరియు చిన్నల్లుడు అయిన అలీ రదియల్లాహు అన్హు ఇలా అన్నారు: "ఆయన ప్రవక్తలలో చిట్టచివరి వారు; హృదయాలలో కెల్లా అత్యంత ఔదార్యం, దాతృత్వం గలవారు; అత్యంత సత్యసంధులు; స్వభావంలో, వ్యక్తిత్వంలో అత్యుత్తములు మరియు అత్యంత కలుపుగోలుతనంతో ఉండేవారు; ఎవరైనా క్రొత్తవారు హఠాత్తుగా ఆయనను చూస్తే, భయంతో వెంటనే లేచి నిలబడి పోయేవారు. అయితే ఎవరైనా ఆయన వెంట కొన్నాళ్ళు ఉండి, ఆయన గురించి తెలుసుకున్నవారు, ఆయనను అమితంగా ప్రేమించేవారు, ఆయన గురించి వివరించునపుడు, 'ఆయనతో పోల్చదగిన వారినెవరినీ ఆయనకు పూర్వం గానీ మరియు ఆయన తరువాత గానీ నేను చూడలేదు.' " అనేవారు.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రియసతీమణి ఆయెషా రదియల్లాహు అన్హా, నిస్వార్థపరుడైన తన భర్త గురించి ఇలా అన్నారు: "ఆయన ఎల్లప్పుడూ ఇంటి పనులలో సహాయపడేవారు, అప్పుడప్పుడు తన దుస్తులను తనే బాగు చేసుకునేవారు, తన పాదరక్షలను తనే మరమ్మతు చేసుకునేవారు మరియు నేలను ఊడ్చేవారు. ఆయన పాలు పితికేవారు, తన పశువులకు పగ్గం బిగించేవారు మరియు మేత వేసేవారు." బుఖారీ.

ఇంకా ఆయన ప్రవర్తన "ఖుర్ఆన్ (కు దృష్టాంతం)" అని ఆవిడ వర్ణించారు.

"నిశ్చయంగా అల్లాహ్ యొక్క ప్రవక్తలో మీకొరకు అత్యుత్తమ ఆదర్శం ఉంది – అల్లాహ్ పట్ల, అంతిమదినం పట్ల ఆశ కలిగి ఉండి, అల్లాహ్ ను అత్యధికంగా స్మరించే ప్రతిఒక్కరి కొరకు" (ఖుర్ఆన్ వచన భావానువాదం) 33:21

## ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఉత్తమ సంస్కారాలు మరియు ప్రత్యేక లక్షణాలు

1. **తెలివితేటలు:** ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అత్యంత వివేకవంతులు. ఆయన కలిగి ఉండిన సంపూర్ణమైన, నిర్దుష్టమైన మరియు ఉత్తమమైన తెలివితేటల్ని, వివేకాన్ని మరియు బుద్ధిసూక్ష్మతను ఏనాడూ, ఏ వ్యక్తీ కలిగి ఉండలేదు. దీని గురించి ఖాజీ ఇయాద్[1] (అల్లాహ్ ఆయనపై దయ చూపుగాక) ఇలా అన్నారు: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క జీవిత చరిత్ర మరియు ఆయన యొక్క నిజమైన పాలనా వ్యవహారాలు చదివిన ప్రతి ఒక్క వ్యక్తికీ మరియు ప్రతి పరిశోధకునికీ "లోతైన అర్థాలతో నిండున్న మరియు వాక్పటుత్వంతో కూడిన ఆయన పలుకులు; ఉత్తమ మర్యాదలు, సభ్యతా - సంస్కారాలు, మంచి నడవడిక, నైతిక ప్రవర్తన మరియు సదాచారం; తౌరాహ్, గోస్పెలు మరియు ఇతర దివ్యగ్రంథాల గురించిన (ఖుర్ఆన్ లోని) జ్ఞానం; పూర్వకాలపు తెలివైన జాతుల బుద్ధీవికాసం, వివేకము గురించి ఆయనకు ప్రసాదించబడిన జ్ఞానం; మనస్సుకు హత్తుకు పోయేలా ఉపమానాలు మరియు ఉదాహరణలు ఇచ్చే ఆయన సామర్ధ్యం; ప్రయోజనకరమైన విధానాలు మరియు చట్టాలు ఆచరింప జేయగలిగే ఉత్తమ నాయకత్వం" మొదలైన లక్షణాలు స్పష్టంగా అర్థమై పోతాయి. సమాజంలో ఉత్తమ గుణగణాలను మరియు ఉత్తమ నడవడికను ప్రోత్సహించారు మరియు స్థాపించారు. అన్నిరకాల జ్ఞానం, ఆరాధనారీతులు, వైద్యం, వారసత్వ చట్టాలు, వంశం మరియు

[1]. ప్రఖ్యాత ఇస్లామీయ పండితుడు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితచరిత్రతో సహా ఆయన అనేక పుస్తకాలు వ్రాసారు.

ఇతర విషయాలలో ఆయన సహచరులు ఆయనను పూర్తిగా అనుసరించేటంతటి పరిపూర్ణ ఆదర్శవంతులు. పూర్వ ప్రజల గ్రంథాలు చదవ వలసిన, పరిశోధించవలసిన అవసరం లేకుండానే అల్లాహ్ ఆయనకు దీని జ్ఞానాన్ని ప్రసాదించాడు. అంతేగాక పూర్వ ధర్మాల ఏ పండితుని వద్దా ఆయన కూర్చోలేదు. ఆయన ప్రవక్తగా ఎంచుకోబడక ముందు ఏ పాఠశాలలోనూ ఆయన కనీస విద్యాభ్యాసం కూడా చేయలేదు, పైవిషయాల గురించి ఆయనకు కొంచెం కూడా తెలియదు, చదవటం లేక వ్రాయటం అస్సలు రాదు. మొత్తం మానవజాతిలో ఒక్కరు కూడా తనకు సాటి రానంత అధికంగా ఆయన తెలివితేటలు, వివేకము కలిగి ఉండినారు. గతించిన కాలంలో ఏమి జరిగింది మరియు రాబోయే కాలంలో ఏమి జరుగ బోతుందనే విషయాలను అల్లాహ్ ఆయనకు తెలియజేసాడు. ఇదంతా అల్లాహ్ యొక్క మహాద్భుతమైన సర్వశక్తిత్వం మరియు సంపూర్ణ సార్వభౌమత్వాన్ని సూచించే ఒక చిహ్నం[1].

2. **కేవలం అల్లాహ్ కోసం మాత్రమే ఏ పనైనా చేయటం:** తన ఆచరణలలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎల్లప్పుడూ అల్లాహ్ యొక్క అభీష్టానికే ప్రాధాన్యతనిస్తూ అడుగు ముందుకు వేసేవారు. ప్రజలను ఇస్లాం ధర్మం వైపు ఆహ్వానించినపుడు, వారు నిర్దయగా ఆయనపై దాడి చేసారు మరియు ఆయనను దూషించారు. అయినా ఆయన ఓర్పు వహించి, బదులుగా కేవలం అల్లాహ్ యొక్క అనుగ్రహాన్ని మాత్రమే ఆశించారు. దీని గురించి ఇబ్నె మస్ఊద్ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు: "తన ప్రజలచే హాని కలిగించబడిన ప్రవక్త యొక్క పోలిక ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంలో స్పష్టంగా ఉండింది. ఆయన తన ముఖం

[1]. ఖాదీ ఇయ్యాద్, 'అల్ షిఫా బి తఆరీఫ్ హుఖూఖిల్ ముస్తఫా'

నుండి రక్తాన్ని తుడుచుకుని, ఇలా ప్రార్థించారు: 'ఓ అల్లాహ్! నా ప్రజలను మన్నించు. ఎందుకంటే వారికి జ్ఞానం లేదు.' " (బుఖారీ)

ఒక యుద్ధంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వేలి నుండి రక్తం కారినట్లు జుందుబ్ బిన్ సుఫ్యాన్ రదియల్లాహు అన్హు తెలుపుతూ, దానిని చూసి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పలికిన పలుకులను ఇలా ఉల్లేఖించారు: "నీవు అల్లాహ్ మార్గంలో గాయపడి, రక్తం కారుతున్న ఒక వేలువి మాత్రమే" (సహీహ్ బుఖారీ హదీథ్ గ్రంథం)

3. **చిత్తశుద్ధి, నిష్కపటత్వం:** అల్లాహ్ ఆజ్ఞలను అనుసరిస్తూ, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చిత్తశుద్ధితో తన విషయాలన్నింటిలోనూ నిష్కపటంగా మరియు నిజాయితీగా ప్రవర్తించేవారు. దీని గురించి అల్లాహ్ ఇలా ప్రకటించాడు: ఖుర్ఆన్ వచన భావానువాదం - ఇంకా (ఓ ముహమ్మద్) వారితో ఇలా అను: "నిశ్చయంగా, నా నమాజు (ప్రార్థనలు), నా సకల సమర్పణలు-త్యాగాలు (ఆరాధనారీతులు), నా ఈ జీవితం మరియు నా మరణం సర్వమూ – కేవలం సకల లోకాల ప్రభువైన ఆ అల్లాహ్ కొరకే; ఆయనకు సాటి ఎవరూ లేరు – నేను ఈవిధంగానే ఆదేశించబడినాను. తనను తాను స్వయంగా అల్లాహ్ అభీష్టానికి సమర్పించుకుని, ఆయనకు విధేయులైన వారిలో నేనే మొదటివాడిని." 6:162-163

4. **ఉత్తమ లక్షణాలు, నైతిక ప్రవర్తన మరియు సహచర్యం:** మొత్తం మానవజాతి అనుసరణ కొరకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సజీవమైన ఉపమానం. ఆయన ప్రవర్తన గురించి ఆయన భార్య ఆయెషా రదియల్లాహు అన్హాను అడుగగా, ఆవిడ ఇలా జవాబిచ్చారు, 'ఆయన లక్షణాలు, గుణగణాలు - ఖుర్ఆన్'

ఖుర్ఆన్ యొక్క నియమనిబంధనలు మరియు ఆజ్ఞలను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తు.చ. తప్పకుండా ఆచరించేవారు, అది నిషేధించిన వాటన్నింటి నుండి ఆయన దూరంగా ఉండేవారు మరియు దానిలో పేర్కొనబడిన సత్కార్యాలన్నీ ఆచరించేవారని ఆయెషా రదియల్లాహు అన్హా పైపలుకుల ద్వారా ధృవీకరించారు.

ఒకసారి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: 'ఉత్తమ లక్షణాలను పరిపూర్ణం చేయుటకు మరియు సత్కార్యాలు చేయుటకు అల్లాహ్ నన్ను పంపినాడు' (బుఖారీ మరియు అహ్మద్)

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గురించి వర్ణిస్తూ ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటించాడు: (ఖుర్ఆన్ ఆయతు యొక్క భావానువాదం) "మరియు నిశ్చయంగా, నీవు ఒక మహోన్నతమైన నైతిక ప్రవర్తన గలవాడివి." 68:4

అనస్ బిన్ మాలిక్ రదియల్లాహు అన్హు 10 ఏళ్ళ పాటు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు సేవలు చేసారు. రాత్రింబవళ్ళు, ప్రయాణిస్తున్నపుడు మరియు మదీనాలో నిలకడగా ఒకచోట నివసిస్తున్నపుడూ అతను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వెన్నంటే ఉండేవారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నైతిక ప్రవర్తన గురించి అతనికి బాగా తెలుసును. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గురించి అనస్ రదియల్లాహు అన్హు ఇలా అన్నారు "ఏనాడూ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎవరిపైనా (దేనిపైనా) ప్రమాణం చేయలేదు, ఎవరితోనూ అసభ్యకరంగా ప్రవర్తించలేదు, ఆయన ఎవరినీ శపించలేదు, నిందించలేదు, దుర్భాషలాడలేదు, దూషించలేదు.ఎవరినైనా గర్హించాలనుకుంటే, 'అతనికి ఏమైంది?' అని మాత్రమే ఆయన పలికేవారు." సహీహ్ బుఖారీ.

5. **ఉత్తమ మర్యాదలు మరియు ఉత్తమ ప్రవర్తనలు:** ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చాలా ఉత్తమంగా ప్రవర్తించేవారు మరియు చిన్నపిల్లలతో సహా ప్రజలందరితో చాలా మర్యాదగా మెలిగేవారు. ఒకసారి ప్రజల మధ్య ఉన్నపుడు, ఒక పానీయం ఆయన వద్దకు తీసుకురాబడింది. ఆయన దానిలో నుండి కొంత సేవించారు. ఆయనకు కుడివైపున ఒక బాలుడు ఉండగా, ఎడమ వైపున పెద్దలు కూర్చుండినారు. పెద్దలకు చూపవలసిన గౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, ఆ బాలుడి భావాలు కూడా గాయపడకుండా, ఆయన ఆ బాలుడిని ఇలా అడిగారు: "ఈ పానీయాన్ని ముందుగా వారికిస్తే నీవేమైనా భావిస్తావా?" దానికి ఆ బాలుడు ఇలా జవాబిచ్చాడు: "ఓ రసూలుల్లాహ్! మీరు త్రాగిన చోటు నుండి ఇంకొకరు త్రాగటాన్ని నేనిష్టపడను. ఇది నాకు లభించిన న్యాయమైన అవకాశం[1]." అది విని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పానీయాన్ని ఆ బాలుని చేతికిచ్చారు". సహీహ్ అల్ బుఖారీ.

6. **పరిస్థితిని సంస్కరించటాన్ని, సర్దుబాటు చేయటాన్ని ఇష్టపడటం:** ఎప్పుడైనా సర్దుబాటు చేయు పరిస్థితి ఎదురైతే, ఆయన వీలయినంత త్వరగా దానిని పరిష్కరించటానికి ప్రయత్నించేవారు. ఒకసారి ఖుబా[2] ప్రజలు ఏదో విషయం గురించి పరస్పరం విభేదించుకున్నారని తెలుసుకుని, వెంటనే ఆయన ఇలా అన్నారు: "పరిస్థితి సరిదిద్దటానికి మరియు వారి మధ్య మరల శాంతి నెలకొల్పడానికి వెళదాం, పదండి." సహీహ్ బుఖారీ.

---

[1]. ఇస్లామీయ సంప్రదాయాన్ని అనుసరించి, ఎవరైనా ఏ పనినైనా ముందుగా కుడివైపు నుండి మొదలు పెట్టాలి.

[2]. పూర్వం ఖుబా ప్రాంతం, మదీనా నగర సరిహద్దులలో ఉండేది. అయితే ఈనాడు అది మదీనా నగరంలో భాగంగా కలిసిపోయింది.

7. **మంచి పనులు చేయమని ఆజ్ఞాపించటం మరియు చెడు పనుల నుండి నివారించడం:** ఇస్లాంకు విరుద్ధమైన ఏ పనినైనా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చూసినపుడు, దానిని వెంటనే సముచిత రీతిలో మందలించేవారు. అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్ రదియల్లాహు అన్హుమా ఇలా ఉల్లేఖించారు: "ఒక వ్యక్తి బంగారపు ఉంగరం[1] ధరించి ఉండటాన్ని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చూసారు. వెంటనే ఆయన అతనిని సమీపించి, అతని వ్రేలి నుండి దానిని తొలగించి, దూరంగా విసిరివేసి, ఇలా అన్నారు: 'మండుతున్న బొగ్గు తీసుకుని, చేతిలో ఉంచుకోవాలని ఎవరైనా కోరుకుంటారా?'. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అక్కడి నుండి వెళ్ళిపోయిన తరువాత, అక్కడి ప్రజలు అతనితో ఇలా అన్నారు: 'నీ ఉంగరాన్ని తీసుకో! దాని నుండి లాభం పొందు (అమ్మివేయి) ' దానికి అతను ఇలా అన్నాడు : 'లేదు, అల్లాహ్ సాక్షిగా! రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విసిరివేసిన తరువాత, ఇక దానిని నేనెప్పటికీ తీసుకోను. ' " ముస్లిం.

   అబూ సయీద్ అల్ ఖుద్రీ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు: "రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అంటూ ఉండగా నేను విన్నాను: 'మీలో ఎవరైనా ఏదైనా చెడు పని చూసినపుడు, దానిని చేతితో ఆపండి; ఒకవేళ అలా చేయలేకపోతే, నాలుకతో దానిని ఆపండి; ఒకవేళ అది కూడా చేయలేక పోతే, దానిని మనస్సులోనైనా నిరసించండి .... ' " సహీహ్ ముస్లిం.

8. **పరిశుభ్రతను ఇష్టపడటం:** ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: "పరిశుభ్రత అర్ధవిశ్వాసం (ఈమాన్) తో సమానం."

[1]. పురుషులు బంగారం ధరించటాన్ని ఇస్లాం ధర్మం నిషేధించినది.

9. **తన పలుకులను కాపాడుకోవటం మరియు చెడు పలుకుల నుండి జాగ్రత్త పడటం:** ఆయన గురించి ఆయన సహచరుడొకరు ఇలా వివరించారు, "అల్లాహ్ ను స్మరించటంలో రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నిమగ్నమై ఉండేవారు; వ్యర్థమైన మాటలలో కాలం గడిపేవారు కాదు. ఆయన తన నమాజులను పొడిగించేవారు. ఉపన్యాసాలను కుదించేవారు; నిరుపేదలు, అక్కర గల ప్రజలు, వితంతువులకు తోడ్పడటానికి, వారి అవసరాలు తీర్చటానికి ఆయన ఏనాడూ వెనుకాడేవారు కాదు." ఇబ్నె హిబ్బాన్.

10. **ఆరాధనలో ఎక్కువ సమయం గడపటం:** పాదాలు వాచిపోయేటంతగా రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) రాత్రివేళల్లో నమాజు చేసేవారని ఆయెషా రదియల్లాహు అన్హా ఉల్లేఖించారు. అది చూసి ఆవిడిలా అన్నారు, 'మీ యొక్క పూర్వాపరాల, తప్పులన్నింటినీ (ఒకవేళ ఏమైనా ఉంటే వాటినన్నింటినీ) అల్లాహ్ క్షమించి వేసినా, ఓ రసూలుల్లాహ్ మీరింతగా ఎందుకు నమాజులు చేస్తున్నారు?' దానికి ఆయనిలా జవాబిచ్చారు: '(దానికి గాను) నేను అల్లాహ్ కు కృతజ్ఞత చూపే దాసునిగా ఉండకూడదా?'" బుఖారీ

11. **ఓర్పు, సహనం, సంయమనం:** ఒకసారి కొందరు సహచరులు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి, ఇస్లాం స్వీకరించటాన్ని తిరస్కరించిన దౌస్ తెగను శపించమని అడిగారు. అపుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చేతులు పైకెత్తి వారు అడిగిన విధంగా ఆ తెగను శపించటానికి బదులు, ఆ తెగ మేలు కొరకు ఇలా దుఆ చేసారు: "ఓ అల్లాహ్! దౌస్ తెగకు సన్మార్గం చూపుము మరియు వారిని ఇస్లాం దగ్గరికి చేర్చుము"

**12. సుందర స్వరూపం:** ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజలందరిలో అత్యంత అందంగా ఉండేవారని ఆయన సహచరులు ధృవీకరించారు. ఆయన గురించి ఒక సహచరుడు ఇలా వర్ణించారు: "ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మానవులలో సగటు ఎత్తు కలిగి ఉండేవారు. ఆయన భుజాలు విశాలంగా ఉండేవి. ఆయన తల వెంట్రుకలు ఆయన చెవుల క్రింది వరకు ఉండేవి. ఒకసారి నేనాయనను పింగళ వర్ణం దుస్తులలో చూసాను; (ఆ దుస్తులలో) ఆయన కంటే అందమైన వ్యక్తిని నేను ఏనాడూ చూడలేదు." (బుఖారీ)

**13. ప్రాపంచిక విషయాలపై వైరాగ్యం:** ఈ జీవితంలోని సుఖాల గురించి, భోగభాగ్యాల గురించి ఆయన అస్సలు పట్టించుకునేవారు కాదని నిరూపించే అనేక సంఘనలు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితంలో కనబడతాయి. ఇబ్నె మస్ఊద్ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు: "రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చాప మీద పడుకునేవారు. నిద్ర నుండి లేచినపుడు, చాప గుర్తులు ఆయన శరీరంపై కనబడేవి. అపుడు మేమిలా అన్నాము: 'ఓ రసూలుల్లాహ్! మీ కొరకు (తగిన) పక్క తయారు చేయమంటారా?' దానికి ఆయన ఇలా జవాబిచ్చారు, 'ఈ ప్రపంచం (సుఖం) గురించి నేనెందుకు పట్టించుకోవాలి? నేను, తన సవారీపై ఒక చెట్టు నీడలో కొంచెం విశ్రాంతి కొరకు ఆగి, తన ప్రయాణాన్ని ముందుకు కొనసాగించే ఒక బాటసారి లాంటి వాడిని మాత్రమే.'" (అత్తిర్మిథీ)

అమ్ర్ బిన్ అల్ హారిథ్ రదియల్లాహు అన్హు ఉల్లేఖన: 'మరణానంతరం, రసూలుల్లాహు సల్లల్లాహు అలైహి వసల్లం తన వెనుక బంగారు లేక వెండి నాణాలు, మగ లేక ఆడ బానిసలు వదల లేదు. అంతిమ దశలో తన వద్ద నున్న తెల్లటి కంచర గాడిదను, ఆయుధాలను మరియు కొంత స్థలాన్ని కూడా దానం చేసివేయమని ఆయన ఆదేశించారు.' బుఖారీ.

**14. నిస్వార్థపరత్వం:** సహల్ బిన్ సాద్ రదియల్లాహు అన్హు ఉల్లేఖన: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తోటివారి గురించి తనపై కంటే ఎక్కువ శ్రద్ధ తీసుకునేవారు. "ఒకసారి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఒక స్త్రీ ఒక బుర్దాను బహూకరించినది. అపుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన సహచరులతో 'బుర్దా అంటే ఏమిటో మీకు తెలుసా?' అని అడిగారు. దానికి వారు 'తెలుసు, రసూలుల్లాహ్! అది నేయబడిన వస్త్రంలోని భాగం (షాల్ వంటిది)'. అపుడు ఆ స్త్రీ ఇలా అన్నది: 'ఓ రసూలుల్లాహ్! మీరు ధరించాలని ఈ షాలును నేనే స్వయంగా నా చేతులతో నేశాను.' రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దానిని స్వీకరించారు. ఆ కాలంలో అలాంటి షాలు ఆయనకు ఎంతో అవసరమై ఉండినది. కొంతసేపటి తరువాత, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దానిని ధరించి, తన ఇంటి నుండి బయటికి రాగా, ఒక సహచరుడు ఆయనతో ఇలా అన్నారు: 'ఓ రసూలుల్లాహ్! మీ షాలును నాకివ్వండి, నేను తొడుక్కుంటాను.' దానికి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం 'సరే, అలాగే' అని పలికి, ఆయన కొంతసేపు అక్కడే కూర్చుని, మరల ఇంటికి వెళ్ళారు. ఆ షాలును మడచి, తనను అడిగిన ఆ వ్యక్తికి ఇచ్చారు.

సహచరులు అతనిని మందలిస్తూ ఇలా అన్నారు, 'లేదని చెప్పడం గానీ, వట్టి చేతులతో పంపడం గానీ చేయరని తెలిసీ, నీవు ఆయనను ఈ షాలు ఇవ్వమని అడగడం సబబుగా లేదు.' దానికి ఆ వ్యక్తి ఇలా పలికాడు: 'అల్లాహ్ సాక్షిగా! నేను చనిపోయినపుడు, నా మృతదేహం దీనిలో చుట్టబడాలని మాత్రమే నేను దీనిని అడిగాను.' " ఈ హదీథు ఉల్లేఖకుడు సహల్ ఇలా అన్నారు: 'ఆ వ్యక్తి చనిపోయినపుడు, ఆ షాలు అతని కఫన్ గా వాడబడింది.' బుఖారీ.

**15. అల్లాహ్ పై దృఢవిశ్వాసం మరియు పూర్తిగా ఆధారపడటం:** ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఆయన సహచరులు సత్యతిరస్కారుల నుండి తీవ్రమైన పరీక్షలు ఎదుర్కొంటున్నప్పటికీ, అంతిమ విజయం విశ్వాసులదే అవుతుందని మరియు అల్లాహ్ యొక్క ఇష్టానుసారం ఇస్లాం తప్పకుండా విజయం సాధిస్తుందని ఆయన ఎల్లప్పుడూ వారికి గుర్తు చేసేవారు. తమ ఇళ్ళను వదిలి, మదీనాకు వలస వెళ్ళేటపుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు అబూ బకర్ రదియల్లాహు అన్హులు ఒక గుహలో దాగినారు. మక్కా సత్యతిరస్కారులు ఆయన అన్వేషణలో నలువైపులా తమ గూఢచారులను పంపారు. కొందరు గూఢచారులు వారు దాక్కున్న గుహకు ఎంత దగ్గరగా వచ్చేసారంటే, అబూ బకర్ రదియల్లాహు అన్హుకు స్పష్టంగా వారి పాదాలు కనబడసాగాయి. అపుడు అబూ బకర్ రదియల్లాహు అన్హు ఇలా అన్నారు:"మేము (థూర్)గుహలో ఉన్నపుడు, నేను మక్కా ముష్రికుల పాదాలను చూసి, ఇలా అన్నాను. 'ఓ రసూలుల్లాహ్! ఒకవేళ వారిలో ఎవరైనా తమ పాదాల వైపు వంగితే, అతను మమ్మల్ని చూడగలడు'. దానికి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం 'ఓ అబూ బకర్! అల్లాహ్ యే మూడోవానిగా తమతో పాటు ఉన్న ఆ ఇద్దరి (భద్రత) గురించి నీవు ఏమంటావు' అని అన్నారు." ముస్లిం.

**16. వాత్సల్యం మరియు దయాళుత్వం:** ప్రజలందరిలో కెల్లా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అత్యంత దయాళువుగా ప్రవర్తించేవారు. పెద్దవారితో వ్యవహరించే తీరులోనే కాకుండా, ఇది చిన్నపిల్లలతో వ్యవహరించే తీరులో కూడా ప్రదర్శితమయ్యేది. ఉదాహరణకు: 'అబుల్ ఆస్ కుమార్తె అయిన ఉమామహ్ అనే పసిపిల్లను ఒళ్ళో ఎత్తుకుని రసూలుల్లాహు సల్లల్లాహు అలైహి వసల్లం నమాజు చేసారు.

ఆయన (రుకూలో, సజ్దాలో) వంగినపుడు, ఆ పసిపిల్లను నేలపై ఉంచేవారు మరియు నిలబడినపుడు మరలా ఆమెను ఒళ్ళో ఎత్తుకునేవారు.' సహీహ్ బుఖారీ.

17. **నిరాడంబరత్వం మరియు సరళత్వం:** ఎల్లపుడూ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, ప్రజల కొరకు విషయాలను సులభతరం చేయాలని ప్రయత్నించేవారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: 'ఎక్కువ సేపు వరకు కొనసాగించాలనే ఉద్దేశంతో నేను నమాజు చదివించటం మొదలు పెట్టాను. కానీ పసిపిల్లల ఏడుపు శబ్దం వినగానే, ఆ పసివాని ఏడుపు వలన అతని తల్లి ఇబ్బంది పడుతుందేమోననే ఆలోచనతో, నమాజును త్వరత్వరగా ముగించివేసాను..' సహీహ్ బుఖారీ.

18. **అల్లాహ్ పట్ల భయభక్తులు చూపటం మరియు అల్లాహ్ నిర్ణయించిన హద్దులు దాటకుండా జాగ్రత్త పడటం:** రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: 'ఒక్కోసారి నేను ఇంటికి తిరిగి వచ్చినపుడు, నా పక్క పై ఒక ఖర్జూర పండు పడి ఉండటాన్ని గమనించేవాడిని. తినటం కొరకు దానిని చేతిలోనికి తీసుకునే వాడిని; కానీ, అది దానం[1] రూపంలో వచ్చినదేమోనని భయపడి, దానిని మరల (దాని స్థానంలో) ఉంచి వేసేవాడిని.' సహీహ్ బుఖారీ.

19. **ఉదారంగా ఖర్చుచేయటం:** అనస్ బిన్ మాలిక్ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు: "తనకు ఏదైనా ఇవ్వమని ఇస్లాం స్వీకరించిన ఏ వ్యక్తినీ

---

[1]. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఆయన కుటుంబం ఎలాంటి దానధర్మాలనైనా స్వీకరించటాన్ని అల్లాహ్ నిషేధించినాడు.

రసూలుల్లాహు సల్లల్లాహు అలైహి వసల్లం ఏనాడూ అడగలేదు. సరికదా, అతను ఏదైనా అడిగితే తప్పకుండా దానిని ఆయన అతనికి ఇచ్చేవారు. (అపుడే ఇస్లాం స్వీకరించిన) ఒక వ్యక్తి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు రాగా, ఆయన అతనికి రెండు కొండల మధ్య మేస్తున్న గొర్రెల మందనంతటినీ ఇచ్చి వేసారు. ఆ వ్యక్తి, తన ప్రజల వద్దకు వెళ్ళి, వారిలో ఇలా అన్నాడు: 'ఓ నా ప్రజలారా! ఇస్లాం స్వీకరించండి. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బీదరికం గురించి అస్సలు పట్టించుకోని వాని వలే (తన వద్ద నున్న సంపద అయిపోతుందేమోనని చింతించని వానివలే), చాలా ఉదారంగా దానం ఇస్తున్నారు.' " ముస్లిం.

ఇబ్నె అబ్బాస్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖన: "ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజలందరిలో కెల్లా అత్యంత ఉదారంగా ప్రవర్తించేవారు. రమదాన్ నెలలో జిబ్రయీల్ అలైహిస్సలాంను కలిసినపుడు, ఆయన ఇంకా ఎక్కువ ఉదారంగా ప్రవర్తించేవారు. రమదాన్ నెలలో ఆయన జిబ్రయీల్ అలైహిస్సలాంను ప్రతిరాత్రీ కలిసి, ఖుర్ఆన్ పఠించి వినిపించేవారు. పంపబడిన గాలి (వర్షపు నీటితో నిండి ఉన్న మేఘాల) కంటే ఎక్కువ ఉదారంగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉండేవారు." సహీహ్ బుఖారీ.

అబూ ధర్ రదియల్లాహు అన్హు ఉల్లేఖన: "మదీనా సరిహద్దులలోని హర్రా (అగ్నిపర్వత) ప్రాంతంలో ఒకసారి నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు నడిస్తూ, ఉహద్ పర్వతం వద్దకు చేరుకున్నాము. అపుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం 'ఓ అబూ ధర్!' అని నన్ను పిలవగా, నేను 'ఇక్కడే ఉన్నాను, ఓ రసూలుల్లాహ్!' అని పలికాను. అపుడు ఆయన నాతో ఇలా అన్నారు 'ఒకవేళ ఉహద్ పర్వతమంత

బంగారం నా వద్ద ఉంటే, దానిని నేను ఒక్క రాత్రిలో లేదా మూడు రాత్రులలో అల్లాహ్ మార్గంలో ఖర్చు చేసేంత వరకు మరియు దానం చేసేవరకు నాకు తృప్తి కలుగదు. అప్పులలో మునిగి ఉన్నవారికి సహాయంగా ఇచ్చేందుకు, దానిలో నుండి ఒక వెండి ముక్కను మాత్రమే నా దగ్గర ఉంచుకుంటాను'" సహీహ్ బుఖారీ.

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు: "ఏదైనా ఇవ్వమని తనను అడిగిన వానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, దానిని అతనికి ఇవ్వకుండా తిరస్కరించలేదు." సహీహ్ బుఖారీ.

**20. సహకారం:** ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, తన పనులు చేయమని తన సహచరులను ఆజ్ఞాపించే మహారాజు కాదు. కానీ, తన స్వంత పనులను ఎల్లపుడూ ఆయనే స్వయంగా చేసుకునేవారు. అంతేగాక సామూహిక బాధ్యతలు నిర్వర్తించటంలో ఆయన ఇతరులకు సహాయ పడేవారు కూడా. తన కుటుంబంతో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎలా ప్రవర్తించే వారని ఒకసారి ఆయెషా రదియల్లాహు అన్హాను అడుగగా, ఆవిడ ఇలా పలికారు: 'ఇంటి పనులలో ఆయన తన కుటుంబ సభ్యులకు సహాయపడేవారు, తోడ్పాటు అందించేవారు. కానీ, అదాన్ పిలుపు వినబడగానే, ఆయన (చేస్తున్న పని నిలిపి) నమాజులో పాల్గొనుట కొరకు వెళ్ళిపోయేవారు.'

అల్ బరా బిన్ ఆజిబ్ ఇలా ఉల్లేఖించారు: "కందకం (త్రవ్వుతున్న) రోజున, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, తన ఛాతీ అంతా దుమ్ముతో కప్పబడి పోయేటంతగా మట్టిని మోస్తుండటం నేను చూసాను." బుఖారీ.

**21. సత్యశీలత:** ఆయెషా రదియల్లాహు అన్హా ఉల్లేఖన: "అసత్యాలు పలికే గుణాన్ని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎక్కువగా అసహ్యించు కునేవారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సమక్షంలో ఎవరైనా అబద్ధం చెప్పినట్లయితే, ఆ వ్యక్తి తౌబా (ప్రాయశ్చితం) చేసుకునే వరకు, ఆయన అతనిని పట్టుకుని ఆపేవారు." అత్తిర్మిధీ.

ఆయన సత్యశీలతను ఆయన శత్రువులు కూడా ధృవీకరించారు. ఇస్లాం యొక్క ఆనాటి బద్ధ శత్రువైన అబూ జహల్ ఇలా అన్నాడు: "ఓ ముహమ్మద్! నీవు అసత్యం పలుకుతున్నావని నేను అనటం లేదు. కేవలం నీవు తీసుకు వచ్చిన దానిని మరియు ప్రజలకు నీవు పిలుపునిస్తున్న దానిని మాత్రమే నేను నిరాకరిస్తున్నాను."

ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటించాడు: (ఖుర్ఆన్ ఆయతు యొక్క భావానువాదం) "నిశ్చయంగా (ఓ ముహమ్మద్) మేమెరుగుదుము – వారు అంటున్న మాటలు నిన్ను తప్పక విచారానికి గురి చేస్తాయని. అయితే వాస్తవానికి వారు అబద్ధమని నిరాకరిస్తున్నది నిన్ను కాదు. కానీ, ఈ దుష్టులు నిరాకరిస్తున్నది అల్లాహ్ నిదర్శనాలనే". 6:33

**22. అల్లాహ్ నిర్ణయించిన హద్దులను గౌరవించటం మరియు ఎల్లప్పుడూ మధ్యే మార్గాన్ని ఎన్నుకునేవారు:** ఆయెషా రదియల్లాహు అన్హు ఉల్లేఖన: "రెండు విషయాలలో ఏదో ఒకదానిని ఎంచుకోవలసి వచ్చినపుడు, ఆ రెండింటిలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒకవేళ అది పాపకార్యం కాకపోయినట్లయితే, సులభమైన దాన్నే ఎన్నుకునేవారు. ఒకవేళ అది (సులభమైన విషయం) పాపకార్యం అయినట్లయితే, ఆయన దానికి చాలా దూరంగా ఉండేవారు. అల్లాహ్ సాక్షిగా! ఆయన స్వయంగా తనకోసం ఏనాడూ పగదీర్చుకోలేదు. అయితే ప్రజలు

అల్లాహ్ నిర్ణయించిన పరిమితులు మరియు హద్దులు దాటినపుడు ఆయన ఆగ్రహోదగ్రు లయ్యేవారు మరియు ఆలాంటపుడు (అల్లాహ్ కొరకు) ఆయన పగదీర్చుకునేవారు." బుఖారీ హదీథు గ్రంథం.

**23. ఆహ్లాదకరమైన చిరునవ్వు:** అబ్దుల్లాహ్ బిన్ అల్ హారిథ్ ఇలా ఉల్లేఖించారు: "ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కంటే ఎక్కువగా చిరునవ్వు నవ్వుతూ ఉండే వ్యక్తిని నేను చూడలేదు" అత్తిర్మిథీ

**24. నిజాయితీ, విశ్వసనీయత మరియు నమ్మకం:** నిజాయితీ విషయంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతగా ప్రసిద్ధి చెందారంటే, ఆయనకు బహిరంగ శత్రువులైన మక్కా ముష్రికులు (బహుదైవారాధకులు) తమ విలువైన వస్తువులను ఆయన వద్దనే భద్రపరచుకునే వారు. మక్కా ముష్రికులు ఆయనను దుర్భాషలాడటం, ఆయన సహచరులను హింసించటం మరియు వారి ఇళ్ళ నుండి వారిని బయటకు వెళ్ళగొట్టడం వంటివి అధికం చేసారు. అందుకు గాను ఆయన మదీనాకు వలస వెళ్ళటం జరిగినది. ఆ సమయంలో ఆయన నిజాయితీ మరియు విశ్వసనీయత స్పష్టంగా పరీక్షించబడింది. తన వద్ద ప్రజలు నమ్మకంతో ఉంచిన వస్తువులను వాటి వాటి యజమానులకు అప్పగించేందుకు వీలుగా, మదీనా వలసను మూడు రోజులు వాయిదా వేసుకోమని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, తన చిన్నాన్న కుమారుడైన అలీ రదియల్లాహు అన్హును ఆజ్ఞాపించారు.[1]
ఆయన నిజాయితీని నిరూపించే మరొక ఉదాహరణ హుదైబియాహ్ సంధి ఒడంబడికలో ప్రదర్శితమయ్యింది. ఆ ఒడంబడికలో 'ఎవరైనా

---

[1]. ఇబ్నె హిషామ్ రచించిన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర, 1వ గ్రంథం పేజీ 493 (అరబీ భాషలోని గ్రంథంలో)

వ్యక్తి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను వదిలి మక్కా ఖురైషీయుల వద్దకు చేరితే, అతనిని వారు ఆయనకు వాపసు చేయరు. అయితే ఎవరైనా వ్యక్తి మక్కా వదిలి ముస్లింల వద్దకు చేరితే, వారు అతనిని మక్కావాసులకు వాపసు చేయవలసి ఉంది.' అనే షరతుకు ఆయన అంగీకరించారు. ఇంకా ఆ సంధి ఒడంబడిక లిఖించబడలేదు. అపుడు, అబూ జందల్ ఇబ్నె అమర్ అనే ముస్లిం, మక్కా ఖురైషీయుల నుండి ఎలాగోలా తప్పించుకుని, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి, ఆయనతో ఉన్న సహచరులలో కలిసిపోయారు. అయితే, తమ మధ్య అపుడే జరిగిన సంధి ఒడంబడికను గౌరవించమని మరియు తమ దగ్గర నుండి పారిపోయిన వ్యక్తిని తమకు వాపసు చేయమని, మక్కా ముష్రికులు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను కోరారు. అపుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అతనితో ఇలా అన్నారు: "ఓ అబూ జందల్! సహనం వహించు. సహనాన్ని ప్రసాదించమని అల్లాహ్ ను వేడుకో. అల్లాహ్ తప్పకుండా నీకు మరియు హింసింపబడుతున్న వారికి సహాయం చేస్తాడు మరియు మీ పరిస్థితిని సులభం చేస్తాడు. మా మధ్యన ఇపుడే ఒడంబడిక జరిగింది. వారికి మేము నమ్మకద్రోహం చేయదల్చుకోలేదు, వారిని వంచించేలా ప్రవర్తించదలచుకోలేదు." బైహఖీ గ్రంథం.

25. **ధైర్యము మరియు శౌర్యము:** అలీ రదియల్లాహు అన్హు ఉల్లేఖన: "మీరు ఆయనను బదర్ యుద్ధం రోజున చూసి ఉండవలసింది! (యుద్ధ తీవ్రతకు భయపడి) మేము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెనుక శరణు తీసుకున్నాము. మా అందరిలో కెల్లా శత్రువుకు అతి చేరువలో ఉండినది ఆయనే. ఆ రోజున, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మా అందరిలో కెల్లా అత్యంత ఎక్కువగా ధైర్యసాహసాలు చూపారు." అహ్మద్.

మామూలు పరిస్థితులలో ఆయన ధైర్యసాహసాలు – అనస్ బిన్ మలిక్ రదియల్లాహు అన్హు ఉల్లేఖన: రసూలుల్లాహు సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజలందరిలోకెల్లా అత్యంత ఉత్తములు మరియు అత్యంత ధైర్యసాహసాలు గలవారు. ఒకరాత్రి మదీనాలో వింతైన శబ్దం వినబడసాగింది. ప్రజలు భయకంపితులై, దాని గురించి తెలుసు కోవటానికి రాత్రివేళలో ఆ వింతైన శబ్దం వస్తున్న దిశ వైపుకు బయలుదేరారు. అయితే వారికి మార్గంలో, ఆ శబ్దం వస్తున్న చోటు నుండి ప్రమాదమేమీ లేదనే విషయాన్ని ధృవీకరించుకుని, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మరలి వస్తూ ఎదురయ్యారు. ఆయన తన చేతిలో కత్తి పట్టుకుని, అబూ తల్హాకు చెందిన గుర్రంపై, గుర్రపు జీను కూడా లేకుండానే స్వారీ చేస్తూ కనబడినారు. ఆయన ప్రజలతో 'భయపడవద్దు! భయపడవద్దు!' అని పలుకుతూ, వారికి ధైర్యాన్నిచ్చారు." బుఖారీ.

సాధారణంగా ఇలాంటి పరిస్థితులలో; ఇతరులు ఎవరైనా ముందుకు వెళ్ళి, ఆ భయంకర శబ్దం గురించి వాకబు చేసి వస్తారేమోనని నిరీక్షించునట్లు ఆయన నిరీక్షించకుండా, ఆ శబ్దం గురించి తెలుసుకోవటానికి ఆయనే స్వయంగా ధైర్యంతో ముందుకు వెళ్ళారు.

26. **సహజమైన బిడియం మరియు సచ్ఛీలత:** అబూ అయ్యూబ్ అల్ అన్సారీ (రదియల్లాహు అన్హు) ఉల్లేఖన: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు:"ప్రవక్తల అలవాట్లలోనివి నాలుగు (లక్షణాలు); 1. సచ్ఛీలత; 2. సుగంధ ద్రవ్యాల వాడకం; 3. సివాక్ వాడకం (సివాక్ అనే పంటిపుల్ల వాడకం); మరియు వివాహం" అత్తిర్మిధీ.

ఆయెషా రదియల్లాహు అన్హా ఉల్లేఖన: "బహిష్టు ముగిసిన తరువాత పరిశుద్ధమవటానికి చేసే స్నానం గురించి ప్రవక్త సల్లల్లాహు అలైహి

వసల్లంను ఒక స్త్రీ ప్రశ్నించింది. దానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: 'కస్తూరి సుగంధం పూసిన గుడ్డముక్కతో స్వయంగా పరిశుద్ధపరచుకో.' ఆ తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బిడియంతో తన ముఖం త్రిప్పుకున్నారు. ఆయెషా రదియల్లాహు అన్హా ఇంకా ఇలా అన్నారు: 'ఆ స్త్రీని నా దగ్గరకు లాక్కుని, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మాటలను ఆమెకు స్పష్టంగా వివరించాను'" బుఖారీ

27. **వినమ్రత, అణుకువ:** రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అత్యంత అణుకువ కలిగి ఉండి, చాలా సాదా సీదాగా ఉండేవారు. ఆయన ఎంత సాదా సీదాగా ఉండేవారంటే, ఒకవేళ ఎవరైనా క్రొత్త వ్యక్తి మస్జిదులో ప్రవేశించి, సహాబాలతో కూర్చుని ఉన్న ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దగ్గరకు సమీపించినా, అక్కడ కూర్చుని ఉన్న వారిలో నుండి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను గుర్తించలేకపోయేవాడు. అనస్ బిన్ మాలిక్ రదియల్లాహు అన్హు ఉల్లేఖన: "ఒకసారి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు మేము మస్జిదులో కూర్చుని ఉండగా, ఒక వ్యక్తి తన ఒంటెపై మా దగ్గరకి వచ్చాడు. ఆ ఒంటెను త్రాడుతో కట్టివేసి, మమ్మల్ని ఇలా అడిగాడు, 'మీలో ముహమ్మద్ అంటే ఎవరు?' అపుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సహచరుల మధ్య ఉన్నారు. సహచరులు నేలపై కూర్చుని ఉండగా, ఆయన ఒకవైపు వాలి ఉన్నారు. మేము ఆ పల్లెవాసికి, 'అదిగో! నేలపై వాలి ఉన్న ఆ తెల్లటి ఆయన' అని చూపించాము. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, తన సహచరుల కంటే భిన్నంగా కనబడేవారు కాదు."

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బీదప్రజలకు, అక్కరగలవారికి మరియు వితంతువులకు సహాయపడటంలో వెనుకాడేవారు కాదు. అనస్ బిన్ మలిక్ రదియల్లాహు అన్హు ఉల్లేఖన: "ఒకసారి మదీనావాసులలో నుండి

కొద్దిగా పిచ్చి ఉన్న ఒక మహిళ, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇలా అన్నది: 'ఒక విషయం గురించి నేను మిమ్మల్ని (సహాయం) అడగాలనుకుంటున్నాను.' ఆయన ఆమె కోరిన సహాయాన్ని అందించారు మరియు ఆమె అవసరాలు పూర్తిచేసినారు." బుఖారీ.

**28. కరుణ మరియు దయ:** అబూ మస్ఊద్ అల్ అన్సారీ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు: " ఒక వ్యక్తి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇలా అన్నాడు: 'ఓ రసూలుల్లాహ్! అల్లాహ్ సాక్షిగా! నేను ఫజర్ నమాజు చేయలేదు ఎందుకంటే ఫలానా ఫలానా (ఇమాం) సుదీర్ఘమైన నమాజు చదివిస్తారు.' ఉల్లేఖకుడు ఇలా తెలిపారు : 'ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అంత కోపంగా ఉపన్యసించడాన్ని నేను ఎన్నడూ చూడలేదు'. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: 'ఓ ప్రజలారా! ప్రజలను (ఇస్లాం నుండి) బయటకు తోలేవారు, నిశ్చయంగా మీలో కొందరు ఉన్నారు! ఒకవేళ మీరు ప్రజలను నమాజు చదివిస్తుంటే, నమాజు సమయాన్ని పొడిగించకండి. మీ వెనుక నమాజు చదివే వారిలో వృద్ధులు, బలహీనులు మరియు ప్రత్యేక అవసరాలు కలిగున్నవారు కూడా ఉంటారు.' " బుఖారీ.

ఒకసారి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన మనవడిని చూడటానికి వెళ్ళి, కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. "చనిపోతున్న పిల్లవాని వద్ద ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూర్చున్నారు. పిల్లవాని కళ్ళు రాళ్ళలా గడ్డకట్టాయి. అది చూసిన రసూలుల్లాహు సల్లల్లాహు అలైహి వసల్లం కళ్ళ నుండి నీళ్ళు ప్రవహించసాగాయి. అది చూసి సాద్, 'ఇదేమిటి ఓ ప్రవక్తా?' అని అనగా, ఆయన ఇలా అన్నారు: 'మహోన్నతుడైన అల్లాహ్, తన దాసుల మనస్సులలో సృష్టించిన దయ, జాలి ఇది. ఎవరైతే ఇతరులపై దయ చూపుతారో, నిజంగా అల్లాహ్ వారిపై దయ చూపుతాడు.' " బుఖారీ.

**29. సహనం మరియు ఓర్పు:** అనస్ బిన్ మలిక్ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు:"'ఒకసారి నేను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు నడుస్తుండినాను. అపుడు ఆయన గరుకైన అంచులతో ఉన్న ఒక యమనీ పైగుడ్డ ధరించి ఉన్నారు. ఒక పల్లెవాసి ఆయన పైగుడ్డను పట్టుకుని, గట్టిగా లాగాడు. నేను ఆయన మెడ ప్రక్కన చూసాను. గట్టిగా లాగటం వలన పైగుడ్డ యొక్క గరుకు అంచులు ఆయన మెడపై స్పష్టమైన గుర్తులు వదలటం కనబడింది. ఆ పల్లెవాసి 'ఓ ముహమ్మద్! అల్లాహ్ నీకు ప్రసాదించిన సంపదలో నుండి కొంత నాకివ్వు' అన్నాడు. దానికి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చిరునవ్వుతో ఆ పల్లెవాసి వైపు చూసి, అతనికి కొంత (సంపద) ఇవ్వమని ఆజ్ఞాపించారు.' " బుఖారీ.

ఆయన సహనానికి మరో ఉదాహరణ - యూద పండితుడు జైద్ బిన్ సనహ్ యొక్క వృత్తాంతం: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు జైద్ అప్పు ఇచ్చారు. అపుడు జరిగిన వృత్తాంతాన్ని జైద్ స్వయంగా ఇలా తెలిపారు, "అప్పు వాపసు చేయవలసిన గడువుకు రెండు లేక మూడు రోజులకు ముందు, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అన్సారులలోని ఒక వ్యక్తి అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఆయనతో పాటు అబూ బకర్, ఉమర్, ఉథ్మాన్ మరియు కొందరు సహాబాలు కూడా ఉన్నారు. జనాజ నమాజు చదివించిన తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒక గోడ దగ్గర కూర్చున్నారు. అపుడు నేను ఆయనను సమీపించి, ఆయన దుస్తుల అంచులతో ఆయనను గట్టిగా ఒదిమి పట్టుకుని, ఆయన వైపు తీక్షణంగా చూస్తూ, ఇలా అన్నాను: 'ఓ ముహమ్మద్! మీరు నా అప్పు తీర్చరా? అప్పు తీర్చటంలో అబ్దుల్ ముత్తలిబ్ వంశం ఆలస్యం చేయటాన్నే నేను ఎరుగును.' "

ఆ తరువాత నేను ఉమర్ బిన్ ఖత్తాబ్ రదియల్లాహు అన్హు వైపు చూడగా – అతని కళ్ళు కోపంతో ఎర్రగా ఉబ్బి పోయి ఉన్నాయి. అతను నా వైపు చూసి, ఇలా అన్నారు, 'అల్లాహ్ యొక్క శత్రువా! నీవు అల్లాహ్ యొక్క ప్రవక్తతో ఈ విధంగా మాట్లాడుతావా మరియు ఈ విధంగా ప్రవర్తిస్తావా? ఎవరైతే ఆయనను సత్యంతో పంపినారో ఆయన సాక్షిగా, స్వర్గవనాలలో ప్రవేశించలేనేమోననే భయమే గనుక నాలో లేకపోతే, నేనీపాటికి నా ఖడ్గంతో నీ తలనరికి వేసి ఉండేవాడినే.' ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రశాంతంగా మరియు నిశ్చలంగా ఉమర్ వైపు చూస్తూ, అతనితో ఇలా అన్నారు, 'ఓ ఉమర్! నీవు మాకు మేలైనా సలహా ఇవ్వవలసింది పోయి, నీవే తప్పు చేస్తావా. ఓ ఉమర్! అతనిని తీసుకుని వెళ్ళి, అతని అప్పును అతనికి చెల్లించు. నీవు అతనిని భయపెట్టినందుకు గాను, అతనికి అప్పుతో పాటు 20 సాఅలు (తూకం) అదనంగా ఇవ్వు.'

జైద్ ఇంకా ఇలా అన్నారు: 'ఉమర్ నాతో పాటు వచ్చి, అప్పు చెల్లించి, అదనంగా 20సాఅల ఖర్జూరాలు ఇచ్చారు. నేను అతనితో 'ఇదేమిటి?' అని అడిగాను. దానికి అతను 'నేను నిన్ను భయ పెట్టినందుకు గాను, దీనిని అదనంగా నీకివ్వమని రసూలుల్లాహు నన్ను ఆదేశించారు.' అపుడు జైద్, 'ఓ ఉమర్! నేనెవరినో నీకు తెలుసా?' అని ప్రశ్నించగా; ఉమర్, 'లేదు, నీవెవరివో నాకు తెలియదు.' అని జవాబిచ్చారు. దానికి జైద్ ఇలా అన్నారు: 'నేను జైద్ బిన్ సనహ్ ను'. అది విని ఉమర్ 'నీవు రబ్బీవా (యూదుల పండితుడివా)?' అని అడిగారు. దానికి జైద్ 'అవును, నేను ఆ రబ్బీనే' అని జవాబిచ్చారు. ఆ తరువాత ఉమర్ అతనిని 'నీవు రసూలుల్లాహ్ తో ఎందుకు అలా ప్రవర్తించావు మరియు ఆ విధంగా మాట్లాడినావు?' దానికి జైద్ ఇలా జవాబ్చిచ్చారు, '’ఓ ఉమర్! నేను రసూలుల్లాహ్

ముఖంలో ప్రవక్తత్వపు చిహ్నాలన్నింటినీ గుర్తించాను – రెండు చిహ్నాలు తప్ప. మొదటిది – ఆయన సహనం గురించిన చిహ్నం - ఆయన కోపాన్ని ఆయన ప్రశాంతత అధిగమిస్తుంది. రెండవది – ఆయనతో ఎంత ఎక్కువ కఠినంగా ప్రవర్తిస్తే, ఆయన అంతకంటే ఎక్కువ దయ మరియు ఓర్పు చూపుతారనే చిహ్నం. ఇపుడు నేను ఆ రెండింటిని కూడా పరీక్షించుకున్నాను. ఓ ఉమర్! 'అల్లాహ్ యే నా ప్రభువు, ఇస్లాం యే నా ధర్మం మరియు ముహమ్మద్ నా ప్రవక్త' అని నేను అంగీకరిస్తున్నదానికి నిన్ను సాక్షిగా చేస్తున్నాను. అంతేగాక నా సంపదలో సగభాగాన్ని - మదీనాలోని సంపన్నవంతులలో ఒకడిని - నేను అల్లాహ్ మార్గంలో ముస్లింలకు దానం చేస్తున్నాను." దానికి ఉమర్ ఇలా అన్నారు, 'నీవు నీ సంపదను ముస్లింలందరికీ పంచి పెట్టలేవు. కాబట్టి 'నేను దానిని ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సహచరులలో కొందరికి పంచి పెడతాను' అని నీవు పలుకు'. అపుడు జైద్ 'నేను కొందరు ముస్లింలకు పంచి పెడతాను' అని అన్నారు. జైద్ మరియు ఉమర్ – ఇద్దరూ కలిసి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు తిరిగి వచ్చారు. అపుడు జైద్ ఆయనతో 'నేను సాక్ష్యమిస్తున్నాను – కేవలం అల్లాహ్ తప్ప, ఆరాధింప బడటానికి అర్హుడైన వాడెవడూ లేడు మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ యొక్క దాసుడు మరియు ఆయన యొక్క సందేశహరుడు.' అతను ఆయనను ప్రవక్తగా విశ్వసించారు మరియు అనేక యుద్ధాలలో పాల్గొన్నాడు మరియు తబూక్ యుద్ధంలో శత్రువుతో పోరాడుతూ వీరమరణం పొందారు – అల్లాహ్ జైద్ పై దయ చూపుగాక!' ఇబ్నె హిబ్బాన్ గ్రంథం.

ఆయన యొక్క క్షమాగుణాన్ని మరియు స్థిరత్వాన్ని సూచించే మరొక గొప్ప ఉదాహరణ – మక్కా విజయం తరువాత ఆయన మక్కావాసులను క్షమించి, వదిలిపెట్టటం. తనను మరియు తన సహచరులను ఎంతో దూషించినా, హాని కలిగించినా మరియు హింసించిన మక్కావాసులను మక్కా నుండి వెళ్ళగొట్టే సువర్ణావకాశం లభించినా, ఆయన వారిని ఒకచోట జమచేసి, వారితో ఇలా అన్నారు: 'మిమ్మల్ని ఏమి చేస్తానని మీరు అనుకుంటున్నారు?' దానికి వారిలా జవాబిచ్చారు: 'మీరు మాకు కేవలం మేలు మాత్రమే చేస్తారు ఎందుకంటే మీరు దయామయులు మరియు దయతో నిండిన సోదరులు మరియు దయతో, కరుణతో నిండిన బంధువులు!' అపుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారితో ఇలా అన్నారు: 'వెళ్ళండి – మీరు స్వతంత్రులు (యుద్ధఖైదీలు కాదు). మీరు కోరిన విధంగా చేసే స్వేచ్ఛ మీకుంది.' బైహఖీ గ్రంథం.

30. **ఓర్పు,సహనం:** రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఓర్పు, సహనానికి మారుపేరు. ప్రవక్తగా ఎంచుకోబడక పూర్వం, విగ్రహారాధనలలో మరియు అన్ని రకాల పాపపు పనులలో మునిగి ఉన్న తన ప్రజలతో ఆయన ఎంతో సహనంతో వ్యవహరించారు. ప్రవక్తగా ఎంచుకోబడిన తరువాత, తనపై మరియు తన సహచరులపై మక్కా ఖురైషీయులు చేసిన దూషణలను మరియు పెట్టిన హింసలను ఆయన ఓర్పుతో ఎదుర్కొంటూ, సహనం చూపారు. అంతేగాక మదీనాలోని కపటుల దూషణలను కూడా ఆయన ఓర్పుతో మరియు సహనంతో భరించారు. తను అమితంగా ప్రేమించిన భార్య ఖదీజా మరియు ఫాతిమా తప్ప పిల్లలందరూ తన కళ్ళ ఎదుటే చనిపోయినపుడు ఆయన సహనం కఠినంగా పరీక్షించబడింది. ఆయన చిన్నాన్నలు హంజా మరియు అబూ తాలిబ్ లు కూడా

ఆయన కళ్ళ ఎదుటే చనిపోయారు. ఈ క్లిష్టపరిస్థితులను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఓపికతో, సహనంతో ఎదుర్కొని, దీనికి బదులుగా కేవలం అల్లాహ్ నుండి మాత్రమే ప్రతిఫలాన్ని ఆశించినారు. దీని గురించి అనస్ బిన్ మాలిక్ (రదియల్లాహు అన్హు) ఇలా అన్నారు: "కమ్మరిపని చేసే అబూ సైఫ్ ఇంటిలో మేము ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో పాటు ప్రవేశించాం. అబూ సైఫ్ భార్య, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) కుమారుడైన ఇబ్రాహీంకు పాలిచ్చే దాయీగా ఉండినది. అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన కుమారుడిని పైకెత్తి, వాసన చూసి, ముద్దాడినారు. కొంచెం సేపటి తరువాత ఆయన మరల తన కుమారుడి వద్దకు వెళ్ళి చూడగా, అతను చనిపోతూ కనిపించాడు. అది చూసిన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు కన్నీళ్ళు ఆగలేదు. అపుడు అబ్దుర్రహ్మాన్ ఇబ్నె ఔఫ్ (రదియల్లాహు అన్హు) ఇలా అన్నారు: 'ఓ రసూలుల్లాహ్! మీరు కూడా దు:ఖిస్తున్నారా!' దానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: 'ఓ ఇబ్నె ఔఫ్! ఇది ఒక కారుణ్యం. ఆ తరువాత ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంకా ఎక్కువ కన్నీళ్ళు కార్చుతూ, ఇలా అన్నారు: 'కళ్ళు కన్నీళ్ళను వర్షిస్తున్నాయి, మనస్సు దు:ఖంతో బరువైంది మరియు మేము మన ప్రభువు ఇష్టపడే పలుకులు మాత్రమే పలుకుతాము. నీ చావుకు మేము చింతిస్తున్నాము, ఓ ఇబ్రాహీం!' " బుఖారీ హదీథు గ్రంథం.

31. **ధర్మం మరియు న్యాయం:** తన జీవితంలోని ప్రతి విషయంలోనూ మరియు ఇస్లామీయ ఆదేశాలు అమలు పరచటంలోనూ అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంగా మరియు న్యాయంగా ప్రవర్తించేవారు. దీని గురించి ఆయెషా (రదియల్లాహు అన్హా) ఇలా ఉల్లేఖించారు: "బనూ మఖ్జూమ్ తెగకు చెందిన ఒక స్త్రీ, దొంగతనం చేసిన విషయం గురించి (శిక్ష నుండి తప్పించటానికి) ఖురైషీయులు

అన్ని ప్రయత్నాలు చేయసాగారు. వారు తమలో తాము 'అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్ద ఆమె గురించి ఎవరు సిఫారసు చేయగలరు?' అని ప్రశ్నించుకున్నారు. చివరికి 'ఈ విషయం గురించి అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో మాట్లాడగల ధైర్యం, ఆయనకు అత్యంత ప్రియమైన యువకుడు ఉసామా ఇబ్నె జైద్ తప్ప మరెవరు చేయగలరు' అని వారిలోని కొందరు అన్నారు. అపుడు ఆమె గురించి ఉసామా అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్ద ప్రస్తావించగా, ఆయన 'ఓ ఉసామా! అల్లాహ్ విధించిన శిక్షల విషయంలో నీవు కల్పించు కుంటున్నావా?' అని పలికి, లేచి నిలబడి ఇలా ఉపన్యసించారు: 'తమలోని ఉన్నతులలో ఎవరైనా దొంగతనం చేసినపుడు వారిని (శిక్షించకుండా) వదిలివేయడం మరియు ఒకవేళ పేదవారు మరియు బలహీనులు దొంగతనం చేస్తే, వారిని శిక్షించడం వలన మీ కంటే ముందు గతించిన ప్రజలు నాశనం చేయబడినారు. అల్లాహ్ సాక్షిగా! ఒకవేళ ముహమ్మద్ కుమార్తె (నా కుమార్తె) అయిన ఫాతిమా దొంగతనం చేస్తే, నేను ఆమె చేతులు కూడా నరికి వేస్తాను''' బుఖారీ.

అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంగా మరియు న్యాయంగా వ్యవహరించేవారు. పొరపాటున ఒకవేళ ఆయన ఎవరికైనా హాని కలిగిస్తే, స్వయంగా వారిని తనపై ప్రతీకారం తీర్చుకోవటానికి అనుమతించేవారు. ఉసైద్ బిన్ హుదైర్ ఇలా ఉల్లేఖించారు: "ఒకసారి అన్సారులలోని ఒక వ్యక్తి ప్రజలతో పరిహాసాలాడుతూ, వారిని నవ్విస్తుండగా, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతని సమీపం నుండి వెళుతూ, అతనిని తన చేతిలో ఉన్న ఒక చెట్టు రెమ్మతో చిన్నగా గుచ్చారు. దానికి ఆ వ్యక్తి 'ఓ ప్రవక్తా! దీనికి ప్రతీకారం తీర్చుకోవటానికి అనుమతించండి' అని అడుగగా, ఆయన 'అలాగే!

ముందుకు రా' అన్నారు. దానికి ఆ వ్యక్తి ఇలా అన్నాడు, 'ఓ ప్రవక్తా! మీరు దుస్తులు ధరించి ఉన్నారు మరియు మీరు నన్ను పొడిచినపుడు, నాపై బట్టలు లేవు (అనగా మీరు బయటకు కనబడుతున్న నా శరీర చర్మంపై పొడిచారు. కాబట్టి నేను కూడా అదే విధంగా చేయటం న్యాయంగా ఉంటుంది)'. అపుడు అల్లాహ్ యొక్క ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం (అతని వైపు) తన పైబట్టను కొద్దిగా తొలగించారు (తన శరీరం అతనికి కనబడేలా). అపుడు ఆ వ్యక్తి, అక్కడ ముద్దు పెట్టి, ఇలా అన్నాడు: 'నేనీ అవకాశం పొందాలనే (ముద్దు పెట్టుకోవటం) మీతో అలా ప్రవర్తించాను, ఓ ప్రవక్తా!' ". అబూ దావూద్.

32. **అల్లాహ్ కు భయపడం మరియు విధేయుడై ఉండటం:** తన పై ఉన్న అల్లాహ్ యొక్క హక్కుల గురించి రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అత్యంత శ్రద్ధ వహించేవారు. అబ్దుల్లాహ్ బిన్ మస్'ఊద్ (రదియల్లాహు అన్హు) ఉల్లేఖన: "(ఒకసారి) అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో ఇలా అన్నారు: 'ఖుర్ఆన్ లో నుండి నా కొరకు (ఏదైనా) పఠించు!' అది విని అబ్దుల్లాహ్ ఇబ్నె మస్'ఊద్ (రదియల్లాహు అన్హు) ఇలా అన్నారు : 'అది అవతరించింది మీపైనే కదా, అయినా నేను మీకు పఠించి వినిపించనా?' దానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) 'అవును' అన్నారు. అపుడు అతను ఇలా అన్నారు: 'నేను సూరతున్నిసా[1] అధ్యాయాన్ని పఠించడం మొదలు పెట్టి, ఈ వచనం వరకు చేరుకున్నాను – "మేము (ప్రతిఫల దినమున) ప్రతి సమాజం నుండి ఒక సాక్షిని తెచ్చి మరియు (ఓ ప్రవక్తా!) నిన్ను వీరికి సాక్షిగా నిలబెట్టినప్పుడు ఎలా ఉంటుంది?" (ఖుర్ఆన్ ఆయతు భావానువాదం 4:41)

[1]. ఖుర్ఆన్ లోని నాలుగో అధ్యాయం.

ఈ వచనం విన్న తరువాత, అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) 'ఇంత వరకు చాలు!' అని పలికారు. అబ్దుల్లాహ్ ఇబ్నె మస్ఊద్ (రదియల్లాహు అన్హు) ఇలా అన్నారు, 'నేను ఆయన వైపు చూడగా, అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏడవటం కనబడింది.' " బుఖారీ.

ఆయెషా (రదియల్లాహు అన్హా) ఉల్లేఖన: "ఆకాశంలో దట్టమైన మబ్బులను ఒకవేళ అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చూస్తే, ఆయన ఇంట్లో నుండి లోపలికీ, బయటకూ గాభరాగా ముందుకూ, వెనుకకూ అశాంతితో నడిచేవారు. వర్షం కురవటం మొదలవగానే ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రశాంతంగా అయిపోయేవారు. దాని గురించి ఆయెషా (రదియల్లాహు అన్హా) ఆయనను అడుగగా, ఆయన ఇలా జవాబిచ్చారు: 'ఎందుకో నాకు తెలియదు, అయితే కొందరు ప్రజలు ఇలా చెప్పినట్లుగా (భయంతో కావచ్చు): 'మరి వాళ్ళు ఆ విపత్తును కారుమేఘం రూపంలో తమ లోయల వైపునకు రావటం చూసి, 'ఇది మా పై వర్షాన్ని కురిపించే మబ్బుతునక' అని చెప్పుకోసాగారు. కాదు, నిజానికది మీరు తొందర పెట్టిన (విపత్కర) మేఘం. అదొక పెనుగాలి. అందులో వ్యధాభరితమైన శిక్ష ఉంది.' (ఖుర్ఆన్ ఆయతు యొక్క భావానువాదం 46:24) ' " బుఖారీ.

33. **సంతుష్టమైన హృదయం:** ఉమర్ బిన్ ఖత్తాబ్ (రదియల్లాహు అన్హు) ఉల్లేఖన: "ఒకసారి నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంటిలో ప్రవేశించాను. అపుడు ఆయన ఒక చాపపై కూర్చుని ఉన్నారు. ఆయన వద్ద పీచుతో నింపబడిన ఒక తోలు దిండు ఉంది. ఆయన కాళ్ళ దగ్గర ఒక నీటి కుండ ఉంది. కొన్ని బట్టలు గోడపై ఉన్నాయి.

పడుకున్నపుడు శరీరంపై పడిన చాప గుర్తులు ఇంకా అలానే కనబడుతున్నాయి. అది చూసి ఉమర్ కు కన్నీళ్ళు ఆగలేదు. అపుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అతనితో 'నీవు ఎందుకు ఏడుస్తున్నావు?' అని అడిగారు. దానికి ఉమర్ రదియల్లాహు అన్హు ఇలా జవాబిచ్చారు 'ఓ రసూలుల్లాహ్! ఈ ప్రపంచంలోని భోగభాగ్యాలను ఖుస్రో మరియు సీజర్లు చాలా బాగా అనుభవిస్తూ ఉంటే, మీరు బీదరికంలో కష్టపడుతూ ఉన్నారే?'. దానికి ఆయన అన్నారు: 'వారు ఈ ప్రపంచంలోనే సుఖసంతోషాలు అనుభవించటం మరియు మనం పరలోకంలో సుఖసంతోషాలు అనుభవించటమనేది నీకు ఇష్టంగా లేదా?' " బుఖారీ.

**34. తన బద్ధశత్రువుల కోసమైనా సరే మంచినే ఆశించటం:** ఆయెషా (రదియల్లాహు అన్హా) ఉల్లేఖన: "నేను అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ఇలా అడిగాను: 'ఉహుద్ యుద్ధపు దినం కంటే కష్టతరమైన మరియు కఠినతరమైన దినాన్ని మీరెప్పుడైనా ఎదుర్కొన్నారా?' దానికి ఆయనిలా జవాబిచ్చారు: 'మీ ప్రజల నుండి నేను అనేక కష్టాలు ఎదుర్కొన్నాను. వాటిలో అత్యంత కష్టమైనది – అల్ అఖబహ్ దినము. ఆ రోజున నేను అలీ ఇబ్నె అబ్ద్ యలీల్ ఇబ్నె అబ్ద్ కిలాల్ తో మాట్లాడినాను (నాకు సహాయపడమని), కానీ అతను నన్ను నిరాశ పరచి, ఒంటరిగా వదిలివేసినాడు. బాధపడుతూ నేను ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టి, నడక సాగించాను. ఖర్న్ అథ్థలిబ్ అని పిలవబడే ప్రదేశాన్ని చేరిన తరువాత, నేను తల ఎత్తి ఆకాశం వైపు చూడగా, నాపై ఒక మేఘం ఛాయనిస్తూ ఉండడాన్ని గమనించాను. అపుడు జిబ్రయీల్ (అలైహిస్సలాం) నన్ను సంభోదించి, ఇలా అన్నాడు: 'ఓ ముహమ్మద్! మీ ప్రజలు మీతో పలికిన మాటలను మహోన్నతుడైన అల్లాహ్ విన్నాడు. మరియు పర్వతాలపై అధికారం

ఉన్న దైవదూతను పంపినాడు. కనుక మీకిష్టమైన దానిని మీరతనికి ఆజ్ఞాపించండి'. ఇంకా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: 'పర్వతాలపై అధికారం ఉన్న దైవదూత నాతో ఇలా పలికాడు: 'అల్లాహ్ నిన్ను ప్రశంసించుగాక మరియు అన్ని రకాల చెడుల నుండి కాపాడుగాక! ఓ ముహమ్మద్, నీవు ఏమి చేయమని ఆజ్ఞాపించినా సరే, దానిని నేను పూర్తి చేస్తాను. ఒకవేళ నీవు కోరుకుంటే నేను రెండు పర్వతాలను ఢీకొట్టించి, అంతటినీ నాశనం చేయిస్తాను.' దానికి అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: 'వారి నుండి అల్లాహ్ అల్లాహ్ ను మాత్రమే ఆరాధింస్తూ ఇతరులను ఆయనకు సాటి కల్పించకుండా ఉండే ఒక వర్గాన్ని పుట్టించవచ్చు.' "
బుఖారీ.

## ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క నైతిక ప్రవర్తన

1. **తన సహచరులతో సన్నిహిత సంబంధాలు:** సహచరులతో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చాలా సన్నిహితంగా మెలిగేవారు. ఈ విషయాన్ని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క జీవితచరిత్రకు సంబంధించిన వివరణాత్మక నివేదికలు చదివిన వారెవరైనా తేలికగా గ్రహిస్తారు. మన పనులన్నింటిలోనూ మనం అనుసరించ వలసినది ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ఉపమానాన్నే. జరీర్ బిన్ అబ్దుల్లాహ్ (రదియల్లాహు అన్హు) ఇలా అన్నారు: నేను ఇస్లాం స్వీకరించిన నాటి నుండి, తనతో పాటు కూర్చోవడాన్ని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నన్ను ఎన్నడూ నిరోధించలేదు. నా వైపు చూసినపుడల్లా ఆయన చిరునవ్వు నవ్వేవారు. గుర్రపు స్వారీ చేయలేక పోతున్నానని, ఒకసారి నేను ఆయనకు మొరపెట్టుకోగా, ఆయన నా ఛాతీపై (చిన్నగా) చరచి, ఇలా ప్రార్థించారు: "ఓ అల్లాహ్! ఈయనలో నిలకడను ప్రసాదించు. మరియు ఇతనిని ఇతరులకు దారి చూపేవానిగా మరియు మార్గదర్శకత్వపు మూలముగా చేయి." బుఖారీ హదీథు #5739.

2. **తన సహచరులతో సరదాగా ఉండేవారు - పరిహాసాలాడేవారు కూడా:** అల్ హసన్ ఇలా ఉల్లేఖన: "ఒక వృద్ధురాలు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి, ఇలా అన్నది: 'ఓ రసూలుల్లాహ్! నన్ను స్వర్గంలో ప్రవేశించజేయమని అల్లాహ్ ను అడుగు'. దానికి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: 'వృద్ధమహిళలు స్వర్గంలో ప్రవేశించలేరు!' అది విని ఆమె ఏడుస్తూ, అక్కడి నుండి వెళ్ళ సాగింది. అపుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: 'ఆమెకు చెప్పండి! ఆమె వృద్ధురాలిగా స్వర్గంలో ప్రవేశించదు.

ఎందుకంటే ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటించాడు: "మేము వారి (భార్యల)ని ప్రత్యేకంగా ప్రభవింపజేశాము. మరి మేము వారిని కన్యలుగా చేశాము. వారు మనసైన వారై, సమ వయస్కులై ఉంటారు" (ఖుర్ఆన్ ఆయతు యొక్క భావానువాదం 56: 35-7)

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన సహచరులతో పరిహాసాలాడటం మాత్రమే చేయకుండా, వారితో ఆటలు కూడా ఆడేవారు. అనస్ బిన్ మలిక్ (రదియల్లాహు అన్హు) ఉల్లేఖన: "జాహిర్ ఇబ్నె హరమ్ అనే పేరుగల ఒక పల్లెవాసి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు బహుమతులు ఇస్తూ ఉండేవాడు మరియు ఆయన కొరకు వస్తువులను తయారుచేసేవాడు. అందుకని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం (అతని గురించి)ఇలా అనేవారు: 'జాహిర్ మా ఎడారి మరియు మేము అతని నగరం'. ఒకసారి అతను (బజారులో) తన (వ్యాపార) వస్తువులు అమ్ముతూ ఉండగా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనిని సమీపించి, అతను చూడకుండా, వెనుక నుండి అతనిని గట్టిగా ఒడిసి పట్టుకున్నారు. అపుడు అతను 'నన్ను పోనివ్వండి!' అని అన్నాడు. (అలా పట్టుకున్నది) ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అని అతను గ్రహించగానే, అతను తన వీపును ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వైపునకు వాల్చుతూ, ఒదిగి పోయాడు. అపుడు అల్లాహ్ యొక్క ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం (పరిహాసంగా) ఇలా అన్నారు: 'నా నుండి ఈ దాసుడిని ఎవరు కొంటారు?' అపుడు జాహిర్ ఇలా అన్నాడు: 'ఓ అల్లాహ్ యొక్క ప్రవక్తా! నేను విలువలేని వాడిని'. దానికి అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): 'అల్లాహ్ నిన్ను విలువలేని వాడిగా పరిగణించటం లేదు' అనో లేదా 'నీవు అల్లాహ్ కు ప్రియమైన వాడివి మరియు అమూల్యమైన వాడివి' అనో అన్నారు." (ఇబ్నె హిబ్బాన్ 5790)

3. **ఆయన తన సహచరులను సంప్రదించేవారు:** ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన సహచరులతో చర్చించేవారు. అధ్యాత్మికమైన నిదర్శనాలేమీ అవతరించబడని అంశాలలో మరియు విషయాలలో ఆయన వారి అభిప్రాయాలను మరియు ఆలోచనలను పరిగణలోనికి తీసుకునేవారు. అబూ హురైరహ్ (రదియల్లాహు అన్హు) ఉల్లేఖన: "తన సహచరుల నిష్కపటమైన సలహాపై అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చూపినంత శ్రద్ధ చూపే ఏ వ్యక్తినీ నేను చూడలేదు." అత్తిర్మిధీ.

4. **ముస్లిమైనా, ముస్లిమేతరులైనా ఒకవేళ అనారోగ్యంతో బాధపడుతుంటే వారిని పరామర్శించటం:** ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన సహచరుల గురించి, వారి బాగోగుల గురించి శ్రద్ధతో పట్టించు కునేవారు. ఒకవేళ ఎవరైనా సహచరుడు అనారోగ్యంతో ఉన్నాడని ఆయనకు తెలిస్తే, ఆ సమయంలో తనతో పాటు ఉన్న ఇతర సహచరులను వెంట పెట్టుకుని, ఆ రోగిని సందర్శించడానికి వేగిర పడేవారు. ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్న ముస్లింలనే కాదు, ముస్లిమేతరులను కూడా సందర్శించేవారు. అనస్ బిన్ మలిక్ ఉల్లేఖన: "ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)నకు సేవలు చేసే ఒక యూదబాలుడు అనారోగ్యం పాలయ్యాడు. అపుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): 'పదండి, వెళ్ళి అతనిని సందర్శించుదాము'. వారు అతనిని సందర్శించడానికి వెళ్ళారు. ఆ బాలుడి తండ్రి అతని తల వద్ద కూర్చొని ఉన్నాడు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ బాలునితో 'లా ఇలాహ ఇల్లల్లాహ్ (ఆరాధనలకు అర్హుడు ఎవ్వడూ లేడు, ఒక్క అల్లాహ్ తప్ప) అని పలుకు, తద్వారా తీర్పుదినమున నేను నీ కొరకు సిఫారసు చేస్తాను' అన్నారు. ఆ బాలుడు తన తండ్రి వైపు చూసాడు. అతని తండ్రి 'అబుల్ ఖాసిం చెప్పింది విను.' అని పలుకగా, ఆ బాలుడు

‘అష్హదు అన్ లా ఇలాహ ఇల్లల్లాహ్ వ అష్హదు అన్న ముహమ్మదుర్రసూలుల్లాహ్’ అని సాక్ష్య ప్రకటన ఉచ్ఛరించాడు. అది విని అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): ‘సకల స్తోత్రములు ఆ అల్లాహ్ కే - ఎవరైతే ఇతనిని నరకం నుంచి కాపాడినాడో’ అని పలికారు.” ఇబ్నె హిబ్బాన్ 2960.

5. **ప్రజలు చూపే మంచితనానికి బదులుగా వారితో చాలా కృతజ్ఞతతో మెలిగేవారు మరియు వారితో చాలా ఉదారంగా వ్యవహరించేవారు:** ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పలుకులను అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమర్ (రదియల్లాహు అన్హుమా) ఇలా తెలిపారు: “మీ కీడునుండి ఎవరైనా అల్లాహ్ యొక్క శరణు వేడుకుంటే, అతనికి హాని కలుగజేయవద్దు. అల్లాహ్ పేరుతో ఎవరైనా మిమ్మల్ని ఏదైనా అడిగితే, అతనికి ఇవ్వండి. ఎవరైనా మిమ్మల్ని ఆహ్వానిస్తే, అతని పిలుపును స్వీకరించండి. ఎవరైనా మీకు ఉపకారం చేస్తే లేదా మీపై దయ చూపితే, దానికి సరిసమానంగా అతనికి మేలు చేయండి. ఒకవేళ అతనికి ఉపకారం కలిగించేదేదీ మీకు కనబడక పోతే, అతని ఉపకారాన్ని చెల్లించానని మీరు భావించే వరకు నిరంతంగా అతని మేలు కొరకు మీరు అల్లాహ్ ను ప్రార్థించండి.” అహ్మద్ 6106.

ఆయెషా (రదియల్లాహు అన్హా) ఉల్లేఖన: “అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బహుమతులను స్వీకరించేవారు మరియు ఉదారంగా వాటికి బదులు ప్రత్యుపకారం చేసేవారు” బుఖారీ 2445

6. **అందంగా మరియు మంచిగా కనబడే ప్రతిదానిని ప్రవక్త ఇష్టపడేవారు:** అనస్ (రదియల్లాహు అన్హు) ఉల్లేఖన: “అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క చేయి చాలా మెత్తగా ఉండేది. నేను నా జీవితంలో స్పర్శించిన ఏ సిల్కు కన్నా కూడా మెత్తగా ఉండేది.

మరియు నేను ఆఘ్రాణించిన సువాసనలన్నింటికంటే కూడా మధురమైన సువాసన ఆయన నుండి వచ్చేది." బుఖారీ 3368

7. **ఇతరుల తరుఫున సిఫారసు చేస్తూ, వారికి సహాయ పడటాన్ని ప్రవక్త ఇష్టపడేవారు:** అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్ (రదియల్లాహు అన్హుమా) ఉల్లేఖన: బరీరహ్ యొక్క భర్త ఒక బానిస, అతని పేరు ముగీథ్. మదీనా వీధులలో ఏడుస్తూ, తన గడ్డం నుండి క్రిందికి జారుతున్న కన్నీళ్ళతో ఆమె వెనకాల నడుస్తూ ఉన్న అతనిని నేను చూసాను. అల్ అబ్బాస్ (రదియల్లాహు అన్హు)తో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు. 'బరీరహ్ ను ముగీథ్ ఎంతగా ఇష్టపడుతున్నాడో మరియు ముగీథ్ ను ఆమె ఎంతగా అయిష్టపడుతుందో చూసి నీకు ఆశ్చర్యం కలగటం లేదా! '

   ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బరీరహ్ తో 'నీవు అతని వెనుక ఎందుకు వెళ్ళవు (నీ భర్తను ఎందుకు ఇష్టపడవు)?' అని ప్రశ్నించగా, ఆమె 'అలా చేయమని మీరు నన్ను ఆజ్ఞాపిస్తున్నారా?' అని తిరిగి ప్రశ్నించింది. దానికి ఆయన 'లేదు, అతని తరుఫున నేను సిఫారసు చేస్తున్నాను' అన్నారు. అపుడు ఆమె 'ఆయన అవసరం నాకు లేదు' అని అన్నది...." బుఖారీ 4875

8. **అల్లాహ్ యొక్క ప్రవక్త తన పనులను స్వయంగా తనే చేసుకునేవారు:** ఆయెషా (రదియల్లాహు అన్హా) ఉల్లేఖన: "'అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంట్లో ఎలా ప్రవర్తించేవారని నన్ను ప్రశ్నించారు'. దానికి నేనిలా జవాబిచ్చాను: 'ఆయన ఇతర మానవుల వలెనే ఉండేవారు; ఆయన తన దుస్తులను ఉతుక్కునేవారు, తన గొర్రెల పాలు పితికేవారు మరియు తన పనులు స్వయంగా చేసుకునేవారు'" అహ్మద్ 24998.

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ఉత్తమ ప్రవర్తన ఆయన స్వంతానికే పరిమితం గాకుండా, ఇతరులకు కూడా సేవలందించేది. ఆయెషా (రదియల్లాహు అన్హా) ఉల్లేఖన: " 'అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంట్లో ఎలా ప్రవర్తించేవారని నన్ను ప్రశ్నించారు'. దానికి నేనిలా జవాబిచ్చాను : 'రోజువారీ పనులలో ఆయన సహాయం చేసేవారు. మరియు అదాన్ పిలుపు వినగానే, ఆయన (అన్నింటినీ) వదిలి మస్జిదు వైపునకు వెళ్ళిపోయేవారు' " బుఖారీ 5048

## న్యాయం - సమానత్వంతో నిండిన నిష్పక్షపాత తీర్మానాలు

1. జర్మన్ కవి 'ఓల్ఫ్ గాంగ్ గోథె (Wolfgang Gothe) [1], ఇలా అన్నారు, 'ఆదర్శప్రాయమైన మానవుని కోసం నేను చరిత్రలో అన్వేషించాను. అది నాకు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) రూపంలో లభించింది.'

2. ప్రొఫెసర్ కీథ్ మూరె (Professor Keith Moore)[2] తన 'ది డెవలపింగ్ హ్యూమన్ (The Developing Human – మానవ అభివృద్ధి)' అనే గ్రంథంలో ఇలా అన్నాడు: "ఈ (ఖుర్ఆన్) వచనాలు తప్పనిసరిగా దేవుడు లేక అల్లాహ్ నుండే ముహమ్మద్ కు చేరి ఉంటాయని నేను స్పష్టంగా గ్రహించాను. ఎందుకంటే దీనిలోని అత్యధిక జ్ఞానం అనేక శతాబ్దాల తరువాత గాని కనిపెట్టబడలేదు. కాబట్టి ఇది నాకు 'ముహమ్మద్ తప్పనిసరిగా దేవుడి యొక్క లేక అల్లాహ్ యొక్క సందేశహరుడై ఉంటాడని' నిరూపించింది." ఇంకా అతను ఇలా అన్నాడు, "ఆయన ఈ వచనాలను ప్రకటించడానికి కారణమైన ఈ సందేశం (ఖుర్ఆన్) ఒక దివ్యావరణ లేక దివ్య సందేశం అని నా మెదడు రాజీ పడటంలో నాకెలాంటి ఇబ్బందీ లేదు."

---

[1]. జర్మన్ రచయిత మరియు శాస్త్రజ్ఞుడు. కవిత్వం, నాటకం మరియు నవల రచనలో ప్రవీణుడు. అంతేగాక ఆయన అనేక అంశాలపై ముఖ్యంగా వృక్షశాస్త్రంపై వైజ్ఞానిక పరిశోధనలు కూడా చేసాడు మరియు అనేక ప్రభుత్వ పదవులను కూడా చేపట్టినాడు.

[2]. ఆయన కెనడియన్ అసోసియేషన్ ఆఫ్ అనాటొమిష్టస్, డిపార్టమెంట్ ఆఫ్ అనాటొమి అండ్ సెల్ బయోలజీ, టొరంటో విశ్వవిద్యాలయం యొక్క మాజీ అధ్యక్షుడిగా పనిచేసారు.

3. డాక్టర్ మౌరిస్ బుకైలే (Dr. Maurice Bucaille)[1] తన గ్రంథంలో (ది ఖుర్ఆన్ అండ్ మోడ్రన్ సైన్సు) ఇలా పేర్కొన్నాడు: "ఆధునిక పరిజ్ఞానపు వెలుగులో గావించిన దాని (ఖుర్ఆన్) పూర్తి తటస్థపరీక్ష; పలు సందర్భాలలో గమనించబడినట్లు, ఆ రెండూ పరస్పరం ఏకీభవిస్తున్నా యనే సత్యం వైపు మనకు దారిచూపుతుంది. ముహమ్మద్ కాలపు మానవుడు, ఆనాటి జ్ఞానం యొక్క స్థాయి ఆధారంగా అలాంటి వచనాలకు రచయిత కాగలడనేది ఆలోచనలలో కూడా సాధ్యం కాదని అది మనల్ని భావించేటట్లు చేస్తుంది. అలాంటి పరిశీలనలు ఖుర్ఆన్ అవతరణకు అద్వితీయమైన స్థానాన్ని ఇవ్వటంలో దోహదపడుతున్నాయి. మరియు కేవలం భౌతికవాద తర్కమే ఆధారంగా వాటిని వివరించలేని తన అశక్తతను నిష్పక్షపాత శాస్త్రజ్ఞుడు అంగీకరించేటట్లు చేస్తున్నాయి."

4. అన్నె బీసెంట్ (Annie Besant) [2] తన 'ది లైఫ్ అండ్ టీచింగ్స్ ఆఫ్ ముహమ్మద్' అనే పుస్తకంలో ఇలా పేర్కొన్నారు: "మహోన్నత అరేబియన్ ప్రవక్త యొక్క జీవితం మరియు గుణగణాలు అధ్యయనం చేసిన, ఆయన ఎలా బోధించేవారు మరియు ఆయన జీవించేవారు అనే విషయాలు తెలిసిన వారికెవరికైనా, సర్వోన్నతుడి యొక్క గొప్ప సందేశహరుడైన ఆ మహా ప్రవక్తపై గౌరవ భావం కాకుండా వేరే ఇతర భావం కలగటమనేది అసాధ్యం. మరియు నేను మీ ముందు ఉంచుతున్న దానిలో, ఆయన గురించి చాలా మంది ఎరిగిన అనేక

---

[1]. డాక్టర్ మౌరిస్ బుకైలె ఫ్రాన్సు దేశపు ఒక ప్రసిద్ధ శస్త్రవైద్యుడు (సర్జన్), శాస్త్రజ్ఞుడు, పండితుడు, 'ది బైబిలు, ది ఖుర్ఆన్ అండ్ సైన్సు' పుస్తక రచయిత.

[2]. భారతదేశంలో స్వదేశీ ఉద్యమం మరియు విద్యాసంబంధమైన సంస్కరణలను సమర్థించిన ఆంగ్లేయ దివ్యజ్ఞాని, తత్వవేత్త మరియు రాజకీయ నాయకురాలు.

విషయాలను పేర్కొనగలను. అయినా వాటిని చదివిన ప్రతిసారీ ఆ మహాశక్తివంతమైన అరేబియన్ టీచర్ పై ఒక సరికొత్త ప్రశంస, ఒక సరికొత్త గౌరవభావం నాలో స్వయంగా కలుగుతున్నది."

5. డాక్టర్ గుస్తవ్ వెయిల్ (Dr. Gustov Weil) తన 'హిస్టరీ ఆఫ్ ది ఇస్లామిక్ పీపుల్స్' అనే పుస్తకంలో ఇలా పేర్కొన్నారు: తన ప్రజల కొరకు ముహమ్మద్ ఒక మెరిసే ఉపమానం. ఆయన గుణగణాలు స్వచ్ఛమైనవి, నిష్కళంకమైనవి మరియు మచ్చలేనివి. ఆయన ఇల్లు, ఆయన దుస్తులు, ఆయన ఆహారం – ఇవన్నీ నిరాడంబరతలో అరుదైన సామాన్య తరగతికి చెందినవి. తన సహచరుల నుండి ప్రత్యేక గౌరవమర్యాదల చిహ్నాలను స్వీకరించనంతగా మరియు తను స్వయంగా చేసుకోగలిగే పనులను తన సేవకునితో చేయించు కోనంతగా ఆయన నిరాడంబరత ఉండినది. ఆయన అన్ని వేళలా అందరికీ అందుబాటులో ఉండినారు. ఆయన వ్యాధిగ్రస్తులను సందర్శించారు మరియు అందరిపై నిండుగా సానుభూతి కలిగి ఉండేవారు. ఆయన అపరిమితమైన ఉపకారబుద్ధి, ఔదార్యం మరియు దాతృత్వం కలిగి ఉండేవారు. సమాజ శ్రేయస్సు కొరకు ఆత్రుతగా పరితపించేవారు.

6. మారిస్ గాడెఫ్రోయ్ (Maurice Gaudefroy) ఇలా అన్నారు: "ముహమ్మద్ ఒక ప్రవక్త, ఆయన వేదాంతి కాదు. దీనిని పేర్కొనటానికి అసహ్యించుకోవటం తరచుగా ప్రదర్శితమయ్యే ఒక వాస్తవం. ఆయన చుట్టూ ఉండిన పురుషులు ముందుతరం ముస్లిం సమాజాన్ని ప్రేరేపించగలిగే శక్తిగలవారిగా ఏర్పడినారో, వారు అల్లాహ్ పేరుతో ఆయన ప్రకటించిన ధర్మశాసనానికి విధేయత చూపటంలో,

ఆయన బోధనలను మరియు ఆయన నిదర్శనాలను అనుసరించడంలో సంతృప్తి చెందేవారు”[1]

7. వాషింగ్టన్ ఇర్వింగ్ (Washington Irving)[2] ఇలా పేర్కొన్నారు: “స్వార్థ ప్రయోజనాలు సాధించే లక్ష్యంతో చేసే దండయాత్రల వలే గాకుండా, ఆయన సైనిక చర్యలు గర్వాన్ని లేదా వ్యర్థమైన అహంకారాన్నీ మేలుగొలపలేదు. తను అత్యంత శక్తివంతంగా ఉన్నపుడు కూడా, తను కష్టకాలంలో చూపిన నిరాడంబరతనే ఆయన కొనసాగించారు. కాబట్టి రాచమర్యాదలకు బహుదూరంగా ఉండటమే కాకుండా ఎక్కడికైనా వచ్చినపుడు, ఆయనకు ఒకవేళ ఎవరైనా (లేచి నిలబడటం వంటి) ప్రత్యేక గౌరవమర్యాదలు చూపితే, ఆయన అయిష్టపడేవారు.”[3]

---

1. Ibid.
2. ఆయన ఒక సుప్రసిద్ధ రచయిత, 1859లో చనిపోయారు.
3. ఎన్సైక్లోపేడియా ఆఫ్ సీరహ్, అఫ్జలుర్రహ్మాన్.

## ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క భార్యలు

తన మొదటి భార్య ఖదీజా (రదియల్లాహు అన్హా) మరణం తరువాత, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పదకొండు మంది స్త్రీలను పెళ్ళి చేసుకున్నారు. వారిలో ఒక్క ఆయెషా (రదియల్లాహు అన్హా) తప్ప, మిగిలిన వారందరూ వితంతువులు లేదా విడాకులు పొందినవారే. ఆయన భార్యలలో ఆరుగురు ఖురైష్ తెగకు చెందినవారు, మిగిలిన ఐదుగురు వేర్వేరు అరబ్ తెగలకు చెందినవారు. అనేక కారణాల వలన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ వీరిని పెళ్ళాడినారు.

1. **ధార్మిక మరియు చట్టసంబంధమైన ఉద్దేశం:** ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జైనబ్ బిన్తె జహష్ (రదియల్లాహు అన్హా)తో వివాహం. అజ్ఞాన కాలంలో (ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తగా ఎంచుకోబడక పూర్వం) అరబ్బులు, పెంపుడు కుమారుడిని కూడా అన్ని విషయాలలోను అసలైన కుమారుడి వలే చూడాలని నమ్ముతూ 'తమ పెంపుడు కుమారుడి భార్యను (అతను విడాకులు ఇచ్చిన తరువాత లేక అతను చనిపోయిన తరువాత) వారు వివాహమాడ కూడదని' నిషేధించేవారు. జైద్ బిన్ హారిథహ్ (రదియల్లాహు అన్హు) ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క దత్తకుమారుడు. అతను తన భార్య జైనబ్ బిన్తె జహష్ (రదియల్లాహు అన్హా) కు విడాకులు ఇవ్వగా, అరబ్బుల ఆ మూఢనమ్మకాన్ని నిర్మూలించడానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆమెను పెళ్ళాడినారు. ఖుర్ఆన్ లో అల్లాహ్ యొక్క ప్రకటన ఇలా ఉన్నది (ఖుర్ఆన్ వచన భావానువాదం): "మరియు (ఓ ప్రవక్తా జ్ఞాపకం చేసుకో) అల్లాహ్ అనుగ్రహించిన మరియు నీవు అనుగ్రహించిన వ్యక్తితో నీవు 'నీ భార్యను ఉంచుకో (విడిచిపెట్టకు) మరియు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండు'

అని అన్నప్పుడు, నీవు అల్లాహ్ బయట పెట్టదలచిన విషయాన్ని, నీ మనస్సులో దాచి ఉంచావు. నీవు ప్రజలకు భయపడ్డావు, వాస్తవానికి నీవు అల్లాహ్ కు భయపడటమే చాలా ఉత్తమమైనది. జైద్, ఆమెతో తన సంబంధాన్ని తన ఇచ్ఛానుసారంగా త్రెంపుకున్న తరువాతనే, మేము ఆమె వివాహం నీతో జరిపించాము. విశ్వాసులకు తమ దత్తపుత్రుల భార్యలతో పెండ్లి చేసుకోవటంలో – వారు తమ భార్యల నుండి తమ ఇష్టానుసారంగా తమ సంబంధం త్రెంపుకున్నప్పుడు – ఏ విధమైన దోషం లేదు. వాస్తవానికి అల్లాహ్ ఆదేశం తప్పక అమలులోకి రావలసిందే!" 33:37

2. **రాజకీయ కారణాలు మరియు ఇస్లాం వ్యాప్తి, ప్రజలను ఇస్లాం వైపు ఆహ్వానించటం మరియు అరబ్బు తెగల అభిమానాన్ని పొందటం:** ఆ కాలంలో అతి పెద్దవైన మరియు అత్యంత శక్తివంతమైన అరబ్బు తెగల స్త్రీలను ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వివాహమాడినారు. ఆయన తన సహచరులను కూడా అలాగే చేయమని ఆదేశించారు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన సహచరుడైన అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రదియల్లాహు అన్హు)తో ఇలా అన్నారు: "ఒకవేళ వారు నీ మాట వింటే (ఇస్లాం స్వీకరిస్తే), ఆ తెగ నాయకుని కుమార్తెను పెళ్ళాడు"
డాక్టర్ కాహన్ ఇలా పలికినాడు: "నేటి మనస్తత్వపు ఆలోచనల ప్రకారం ఆయన జీవితంలోని కొన్ని ఘటనలు మనకు అస్థవ్యస్థంగా కనబడతాయి. ప్రాపంచిక కోరికలు మనస్సులో ఉండటం వలన, ఆయన తన మొదటి భార్య చనిపోయిన తరువాత తొమ్మిది మంది భార్యలను పెళ్ళాడారని కొందరు ప్రజలు ప్రవక్తను విమర్శిస్తుంటారు. అయితే ఈ పెళ్ళిళ్ళు చాలా వరకు రాజకీయ కారణాల వలన చేసుకున్నారనేది స్పష్టంగా ధృవీకరించబడింది - కొందరు నాయకుల మరియు తెగల విశ్వాసం చూరగొనటమే వాటి ప్రధాన లక్ష్యం."

**3. సామాజిక కారణాలు:** అల్లాహ్ మార్గంలో చేస్తున్న యుద్ధంలో లేక తనకు అప్పజెప్పబడిన ధర్మ ప్రచార బాధ్యతను పూర్తి చేయటంలో ప్రాణాలు కోల్పోయిన కొందరు సహచరుల భార్యలను ఆయన వివాహమాడినారు. వయసులో వారు ఆయనకంటే పెద్దవారైనా, వారికి మరియు చనిపోయిన వారి భర్తలకు సముచిత గౌరవం ప్రసాదించటం కొరకు ఆయన వారిని వివాహమాడినారు.

వెక్కియ వగ్లియరీ[1], తన పుస్తకం 'ఇన్ డిఫెన్స్ ఆఫ్ ఇస్లాం'లో ఇలా పేర్కొన్నది: "తన మొత్తం యవ్వనంలో అనగా మానవుడి కామశక్తి శిఖరాగ్ర స్థితిలో ఉండే వయస్సులో, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కేవలం ఒక్క స్త్రీనే పెళ్ళాడినారు. అప్పటి అరబ్ సమాజంలో బహుభార్యత్వమనేది చాలా మామూలు విషయం. ఇంకా విడాకులు చాలా సులభమైనప్పటికీ ఆయన తన కంటే వయస్సులో పెద్దదైనా, 25 ఏళ్ళ పాటు ఒక విశ్వసనీయమైన భర్తగా ఆమెతోనే జీవితం కొనసాగించారు మరియు ఆమె చనిపోయిన తరువాత తప్ప మరో స్త్రీని పెళ్ళాడలేదు. అపుడు ఆయన వయస్సు50 ఏళ్ళు. ప్రతి భార్యను ఆయన సామాజిక లేక రాజకీయ ప్రయోజనం కొరకు మాత్రమే వివాహమాడినారు; అలా ఆ ఉత్తమ స్త్రీలకు సముచితమైన గౌరవాన్ని ప్రసాదించాలని ఆయన కోరుకున్నారు లేదా కొన్ని తెగల అభిమానాన్ని చూర గొనాలని, తద్వారా ఇస్లాం వారిలో వ్యాపించాలని కోరుకున్నారు. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) భార్యలలో కన్యలెవరూ లేరు, యుక్తవయస్కులూ లేరు మరియు అందగత్తెలూ లేరు – ఒక్క ఆయెషా (రదియల్లాహు అన్హా) తప్ప. మరి, అలాంటపుడు ఆయన కామంతో ఆ పెళ్ళిళ్ళు చేసుకున్నారని ఆరోపించటం ఎంత

---

[1]. ఒక ప్రసిద్ధ తూర్పుదేశాల ఇటాలియన్ పండితురాలు.

వరకు సబబు? ఆయన కూడా మానవమాత్రులే గాని, దేవుడు కాదు. కొడుకు కలగాలనే తన కోరిక వలన కూడా ఆయన వివాహాలు చేసుకుని ఉండవచ్చు, ఎందుకంటే ఖతీజా (రదియల్లాహు అన్హా) ద్వారా కలిగిన మగపిల్లలందరూ చనిపోయారు. ఇంకా తన పెద్ద కుటుంబం యొక్క ఆర్థిక బాధ్యతలను కూడా ఆమె పూర్తి చేసేవారు. ఆయన వద్ద వాటిని పూర్తి చేయటానికి సరిపడా అవకాశాలు లేకుండెను. ఆయన తన భార్యలందరి పట్ల చాలా న్యాయంగా మరియు ధర్మంగా ప్రవర్తించేవారు. వారి మధ్య ఎలాంటి పక్షపాతమూ చూపలేదు. సులైమాన్ (అలైహిస్సలాం), మూసా (అలైహిస్సలాం) మొదలైన పూర్వ ప్రవక్తలు అనేక వివాహాలు చేసుకున్నప్పటికీ, ఎవ్వరూ వారి విషయంలో అభ్యంతరాలు లేవనెత్తలేదు. మరి, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా వారి విధానాన్నే అనుసరించారు కదా! ఆయనకు పూర్వం గడిచిన ప్రవక్తల జీవితం గురించి చాలా తక్కువగా తెలిసి ఉండటం మరియు ఆయన జీవితం గురించిన ప్రతిదీ నమోదు చేయబడటం అనే వాస్తవమే ప్రజలు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) బహుభార్యాత్వంపై అభ్యతరం చెప్పటానికి కారణమా?"

థామస్ కార్లయిల్ ఇలా పేర్కొన్నాడు: "ఆయన గురించి చెప్పగలిగిన విషయాన్నీ చెప్పిన తరువాత, అంతిమంగా చెప్పేదేమిటంటే, ముహమ్మద్ స్వయంగా విలాసపురుషుడు కాదు. ఒకవేళ మనం ఆయనను హేయమైన ఐహిక సుఖాలపై దృష్టి కేంద్రీకరించే మామూలు శృంగార పురుషుడని భావిస్తే, పెద్ద పొరపాటు చేసినట్లే – ఆయన ఎలాంటి సుఖాలపైనా ఆసక్తి చూపలేదు."[1]

[1]. హీరోస్, హీరో వర్షిప్ అండ్ ద హీరోయిక్ ఇన్ హిస్టరీ (Heros, Hero-worship and the Heroic in History)

# గ్రాంధిక నిదర్శనాలు

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సత్యసంధతను ధృవీకరించే నిదర్శనాలు చాలా ఉన్నాయి. వాటిలో కొన్ని మాత్రమే క్రింద పేర్కొంటున్నాము.

## ఖుర్ఆన్ నుండి కొన్ని నిదర్శనాలు:

1. ఖుర్ఆన్ లోని అల్లాహ్ ప్రకటన: (ఖుర్ఆన్ వచన భావానువాదం) "(ప్రజలారా!) ముహమ్మద్ మీ మగవారిలో ఎవరికీ తండ్రి కాడు. అయితే ఆయన అల్లాహ్ యొక్క సందేశహరుడు. ప్రవక్తల పరంపరను పరిసమాప్తం చేసే (చివరి) వాడు. అల్లాహ్ ప్రతిదీ తెలిసినవాడు." 33:40

2. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి ఈసా (జీసస్) అలైహిస్సలాం ఇచ్చిన శుభవార్తను ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా తెలిపినాడు: (ఖుర్ఆన్ వచన భావానువాదం) "మర్యమ్ కుమారుడైన ఈసా, 'ఓ ఇస్రాయీలు సంతతివారలారా! నేను మీవైపు అల్లాహ్ తరఫున పంపబడిన ప్రవక్తను. నాకు పూర్వం వచ్చిన తౌరాతు గ్రంథాన్ని ధృవపరుస్తున్నాను. నా తరువాత రాబోయే ఒక ప్రవక్తను గురించి శుభవార్తను ఇస్తున్నాను. అతని పేరు అహ్మద్ అని చెప్పినప్పటి సంగతి (కూడా స్మరించదగినదే). తీరా అతను స్పష్టమైన నిదర్శనాలను తీసుకు వచ్చినపుడు, 'ఇది పచ్చి ఇంద్రజాలం' అని వారు అన్నారు ' " 61:6

## సున్నతుల[1] నుండి కొన్ని నిదర్శనాలు:

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: "నా ఉపమానం మరియు నాకంటే పూర్వం వచ్చిన ప్రవక్తల ఉపమానం ఎలాంటిదంటే ఒక వ్యక్తి ఒక ఇల్లు నిర్మించాడు. ఆ ఇంటి గోడలలో ఒక ఇటుకరాయిని మాత్రమే వదిలి, అతను ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసాడు. ప్రజలు ఆ ఇంటి చుట్టూ తిరిగి, దాని పరిపూర్ణతను మరియు నిపుణతను విస్మయంతో రెప్పవాల్చకుండా చూస్తూ, ఇలా అనసాగారు 'ఈ ఖాళీ స్థలాన్ని కూడా పూర్తి చేస్తే ఎంత బాగుండేది!''. ఆ తరువాత ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: 'నేనే ఆ ఇటుకరాయిని. ప్రవక్తలలో నేను చిట్టచివరివాడిని' (సహీహ్ బుఖారీ 3342)

## ప్రాచీన గ్రంథాల నుండి కొన్ని నిదర్శనాలు:

అతా బిన్ యాసర్ ఉల్లేఖన: "నేను అబ్దుల్లాహ్ బిన్ అమర్ బిన్ అల్ ఆస్ (రదియల్లాహు అన్హుమా) ను కలిసి, ఇలా అడిగాను: 'అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి తౌరహ్ లో ఏమి వివరించబడిందో నాకు చెప్పండి.' దానికి అతను ఇలా జవాబిచ్చినాడు: 'ఆయన గురించి ఖుర్ఆన్ లో ఉన్న వివరణలలోని కొన్ని వివరణలు తౌరహ్ లో కూడా ఉన్నాయి; 'నిశ్చయంగా మేము నిన్ను (మానవజాతిపై) సాక్షిగా పంపాము. మరియు శుభవార్తలు ఇచ్చేవానిగా, ఇతరులను హెచ్చరించే వానిగా, సామాన్యులకు శరణిచ్చేవానిగా మరియు వారిని కాపాడేవానిగా పంపాము. నీవు నా దాసుడివి మరియు సందేశహరుడివి; నేను నిన్ను ముతవక్కిల్ (నమ్మదగినవాడు) అని పిలుస్తాను. నీవు దుష్టస్వభావం

[1]. సున్నహ్ : ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పలుకులు, ఆచరణలు, గుణగణాలు, అనుమతించిన విషయాలు.

కలిగిన వాడివి కాదు, చెడ్డవాడివి కాదు, తన స్వరాన్ని హెచ్చించేవాడివీ కావు (ఆగ్రహించుకునే వాడివి కావు). నీవు అపకారానికి బదులు అపకారం చేయవు, కానీ, క్షమిస్తావు మరియు మన్నిస్తావు. దేశదేశాలకు నేను సన్మార్గం చూపేవరకు మరియు వారు 'లా ఇలాహ ఇల్లల్లాహ్ (ఆరాధింపబడటానికి అర్హత గలవారెవ్వరూ లేరు, అల్లాహ్ తప్ప)' అని పలికే వరకు మరియు వారు సత్యాన్ని స్పష్టంగా చూడనంత వరకు, నేను అతని ప్రాణాన్ని తీయను.'

ఇంకా అతా ఇలా అన్నారు: 'నేను యూదుల పండితుడు (రబ్బీ) కఆబ్ ను కలిసినపుడు, పై ఉల్లేఖన గురించి అడుగగా, స్వల్పంగా ఉల్లేఖనలోని పదాల గురించి తప్ప, అతను అబ్దుల్లాహ్ బిన్ అమర్ బిన్ అల్ ఆస్ (రదియల్లాహు అన్హుమా) తో విభేదించలేదు.' " (బైహఖీ 13079)

అబ్దుల్ అహద్ దావూద్[1] ఇలా అన్నారు: "అయితే భాషాపరమైన విభేదాలకు చాలా అరుదుగా అనుమతించే కొన్ని బైబిలు వచనాలపైనే నా వాదనలను కేంద్రీకరించటానికి ప్రయత్నించాను. నేను లాటిన్, గ్రీకు లేదా అరామిక్ భాషల వైపుకు వెళ్ళను ఎందుకంటే వాటి వలన ప్రయోజనం లేదు: ఈ క్రింది పలుకులను బ్రిటీష్ అండ్ ఫారిన్ బైబిల్ సొసైటీ వారిచే ప్రచురించబడిన రివైజుడు వర్షనులో పేర్కొన్న అసలు పదాలలో నిష్పాక్షికంగా పేర్కొంటున్నాను.

[1]. ఇస్లాం స్వీకరించక ముందు, అతని పేరు రెవరెండు డేవిడ్ బెంజామిన్ కెల్డానీ, బి.డి. అతను యునియేట్ – ఛాల్డియన్ (Uniate-Chaldean) వర్గానికి చెందిన ఒక రోమన్ కేథలిక్కు గురువు. అతను 1867వ సంవత్సరంలో పర్షియాలోని ఉర్మియాలో జన్మించారు.

క్రింది పదాలను మనం ద్వితీయోపదేశకాండము, 18వ అధ్యాయం, 18వ వచనంలో చదువుతాం: "నీ వంటి ఒక ప్రవక్తను నేను వారి కోసం పంపిస్తాను. ఈ ప్రవక్త వారి స్వంత ప్రజల్లో ఒకడే. అతడు చెప్పాల్సిన విషయాలు నేను అతనికి చెబుతాను. నేను ఆజ్ఞాపించేవి అన్నీ అతడు ప్రజలకు చెబుతాడు. ఈ ప్రవక్త నా పక్షంగా మాట్లాడతాడు. అతడు నా పక్షంగా మాట్లాడినపుడు, ఏ వ్యక్తి అయినా సరే నా ఆజ్ఞలు వినటానికి నిరాకరిస్తే, ఆ వ్యక్తిని నేను శిక్షిస్తాను." ఒకవేళ ఈ పదాలు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు వర్తించ నట్లయితే, అవి ఇంకా పూర్తి కాకుండా మిగిలి ఉన్నట్లే. దీనిలో సూచించబడిన ప్రవక్తను తనే అని ప్రవక్త జీసస్ ఏనాడూ దావా చేయలేదు. ఆయన సహచరులు కూడా ఇదే అభిప్రాయం కలిగి ఉండినారు. జీసస్ రెండవ ఆగమనం ఈ భవిష్యవాణిని నిజం చేస్తుందని వారు ఎదురు చూసేవారు. ఇక్కడి వరకు స్పష్టమైనదే మిటంటే, 'నీ వంటి ఒక ప్రవక్తను నేను వారి కోసం పంపిస్తాను' అనే పలుకులు జీసస్ (ఈసా అలైహిస్సలాం) మొదటి ఆగమనాన్ని సూచించటం లేదని మరియు ఆయన రెండవ ఆగమనం కూడా ఈ పదాలను పూర్తి చేయటం కష్టమనీ నిర్వివాదంగా తేలిపోయింది. చర్చి విశ్వాసం ప్రకారం, జీసస్ (ఈసా అలైహిస్సలాం) ఒక న్యాయమూర్తిగా వస్తారే గాని శాసనకర్తగా కాదు. అయితే వాగ్దానం చేయబడిన రాబోయే ప్రవక్త తన కుడి చేతిలో కఠినమైన శాసనాన్ని తీసుకుని వస్తాడు.

వాగ్దానం చేయబడిన రాబోయే ప్రవక్త వ్యక్తిత్వం గురించి నిర్ధారించు కోవటానికి, మూసా (అలైహిస్సలాం) తెలిపిన 'మక్కా పర్వతాల లోని పరాన్ నుండి ప్రకాశించే దేవుడు' అనే మరొక భవిష్యవాణి చాలా బాగా ఉపయోగపడుతుంది. ద్వితీయోపదేశ కాండము 33వ అధ్యాయం, 2వ వచనం: "యెహోవా సీనాయి నుండి వచ్చెను. శేయీరులో నుండి వారికి ఉదయించెను. ఆయన పారాను కొండ నుండి ప్రకాశించెను. వేవేల

పరిశుద్ధ సమూహముల మధ్య నుండి ఆయన వచ్చెను. ఆయన కుడి పార్శ్వమున అగ్ని జ్వాలలు మెరియు చుండెను."

దేవుడు ఈ పదాలలో సూర్యుడితో పోల్చబడెను. ఆయన సీనాయి నుండి వచ్చును, శేయీరులో ఉదయించును, కానీ పారాను కొండ నుండి పరిపూర్ణంగా ప్రకాశించును, ఎక్కడైతే ఆయన పదివేల మంది సహచరులతో, తన కుడిచేతిలో ధర్మశాసనంతో ప్రత్యక్షమగును. జీసస్ తో సహా, ఇస్రాయీలులలో ఎవ్వరికీ పారానుతో సంబంధం లేదు. హాజరహ్ తన పుత్రుడు ఇస్మాయీలుతో బీర్ షేబా నిర్జన ప్రదేశంలో సంచరిస్తూ, చివరికి నిర్మానుష్య ప్రాంతమైన పారానులో నివాసం ఏర్పరచుకున్నారు (ఆదికాండము, 21వ అధ్యాయం). ఆయన ఒక ఈజిప్టు స్త్రీని పెళ్ళాడెను మరియు తన మొదటి సంతానం కేదార్ నుండి అరబ్బుల సంతతి వ్యాపించి, నాటి నుండి నేటి వరకు పారాను ప్రాంతంలో నివసిస్తున్నది. ఒకవేళ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం), కేదార్ ద్వారా ప్రవక్త ఇస్మాయీలు (అలైహిస్సలాం) సంతతికి చెందుతారని మరియు పారాన్ నిర్మానుష్య ప్రాంతంలో ఆయన ప్రవక్తగా ప్రత్యక్షమయ్యారని, పదివేల మంది సహచరులతో ఆయన విజయవంతంగా మక్కా నగరంలో పున: ప్రవేశించారని, తన ప్రజలకు ఆయన చట్టాన్ని బోధించారని పూర్తిగా అంగీకరిస్తే, పైన తెలుబడిన భవిష్యవాణి అక్షరం కూడా పొల్లు పోకుండా నిజమవటం లేదా?

హబక్కూకులో పేర్కొనబడిన భవిష్యవాణి పదాలు ప్రత్యేకంగా గమనించదగినవి. ఆయన (పారానులోని పరిశుద్ధుని) కీర్తి ఆకాశాలను కప్పివేసింది మరియు భూమండలం మొత్తం ఆయన ప్రశంసలతో నిండిపోయింది. ఇక్కడ 'ప్రశంసలతో' అనే పదం చాలా ముఖ్యమైనది – ఆయన అసలు పేరు ముహమ్మద్ అనగా భాషాపరంగా 'ప్రశంసించ బడేవాడు' అని అర్థం. అరబ్బులతో పాటు, పారాను అరణ్య ప్రాంత

వాసులకు కూడా దివ్యవాణి ప్రసాదించబడుతుందని వాగ్దానం చేయబడింది: "అరణ్యమును దాని పురములును కేదారు నివాస గ్రామములును బిగ్గరగా పాడవలెను. సెల నివాసులు సంతోషించుదురు గాక. పర్వతముల శిఖరముల నుండి వారు కేకలు వేయుదురు గాక. ప్రభావం గలవాడని మనుష్యులు యెహోవాను కొనియాడుదురు గాక. ద్వీపములలో ఆయన స్తోత్రం ప్రచురము చేయుదురు గాక. యెహోవా శూరుని వలె బయలు దేరును. యోధుని వలె ఆయన తన ఆసక్తి రేపుకొనును. ఆయన హుంకరించుచు తన శత్రువులను ఎదిరించును. వారి యెదుట తన పరాక్రమమును కనుపరచుకొనును." యెషయా 42:11

దీనితో పాటు కేదారు గురించి సూచించబడిన మరో రెండు భవిష్యవాణులు కూడా గమనించదగినవి. ఒకటి యెషయా గ్రంథంలోని 60వ అధ్యాయం, 1-7 వచనాలలోనిది - "నీకు వెలుగు వచ్చియున్నది, లెమ్ము, తేజరిల్లుము. యెహోవా మహిమ నీమీద ఉదయించెను. చూడుము భూమిని చీకటి కమ్ముచున్నది.కటిక చీకటి జనములను కమ్ముచున్నది. యెహోవా నీమీద ఉదయించుచున్నాడు. ఆయన మహిమ నీమీద కనబడుచున్నది. జనములు నీ వెలుగునకు వచ్చెదరు. రాజులు నీ ఉదయకాంతికి వచ్చెదరు. కన్నులెత్తి చుట్టు చూడుము. వీరందరు కూడుకొని నీ యొద్దకు వచ్చుచున్నారు. నీ కుమారులు దూరము నుండి వచ్చుచున్నారు. నీ కుమార్తెలు చంకనెత్తబడి వచ్చుచున్నారు. నీవు చూచి ప్రకాశింతువు. నీ గుండె కొట్టుకొనుచు ఉప్పొంగును. సముద్ర వ్యాపారము నీ వైపు త్రిప్పబడును. జనముల ఐశ్వర్యము నీ యొద్దకు వచ్చును. ఒంటెల సమూహము మిద్యాను ఏయిఫాల లేత ఒంటెలును నీ దేశము మీద వ్యాపించును. వారందరు షేబనుండి వచ్చెదరు. బంగారమును, ధూపద్రవ్యమును తీసికొని వచ్చెదరు. యెహోవా

స్తోత్రములను ప్రకటించెదరు. నీ కొరకు కేదారు గొఱ్ఱెమందలన్నియు కూడుకొనును? నెబాయోతు పొట్టేళ్ళు నీ పరిచర్యకు ఉపయోగము లగును. అవి నా బలిపీఠము మీద అంగీకారములగును. నా శృంగార మందిరమును నేను శృంగారించెదను."

రెండో భవిష్యవాణి కూడా యెషయా గ్రంథంలోనే ఉన్నది – "అరేబియాను గూర్చిన దేవోక్తి – దెదానీయులైన సార్థవాహులారా, సాయంకాలమున మీరు అరబి యెడారిలో దిగవలెను. తేమా దేశనివాసులారా, దప్పిగొన్నవారికి నీళ్ళు తెండి. పారిపోవుచున్నవారికి ఎదురుగా ఆహారము తీసికొని రండి. ఖడ్గ భయము చేతను దూసిన ఖడ్గ భయము చేతను, ఎక్కు పెట్టబడిన ధనుస్సుల భయము చేతను, క్రూరయుద్ధ భయము చేతను వారు పారిపోవుచున్నారు. ప్రభువు నాకీలాగు సెలవిచ్చియున్నాడు – కూలివారు ఎంచునట్లుగా ఒక యేడాదిలోగానే కేదారు ప్రభావమంతయు నశించిపోవును. కేదారీయుల బలాఢ్యుల విలుకాండ్లలో శేషించువారు కొద్దివారగుదురు." 21:13-17. యెషయాలోని ఈ భవిష్యవాణులను ఆదికాండములోని 'పారాను కొండ నుండి పరిపూర్ణంగా ప్రకాశించును' అనే వచనం వెలుగులో చదవండి.

ఒకవేళ:

- ఇస్మాయీలు నిర్మానుష్య పారాను ప్రాంతంలో నివసించి, అరబ్బుల పూర్వీకుడైన కేదారుకు జన్మనివ్వటం,
- కేదారు సంతానం వైపుకు దివ్యసందేశం పంపబడటం,
- కేదారు తెగలు కొన్ని శతాబ్దాలుగా గాఢాంధకారం కప్పబడిన ఉన్న భూమిపై, సర్వలోక సృష్టికర్తను అంగీకరించి, 'నా స్తుతి నిలయాన్ని' స్తుతించటం కొరకు ముందుకు రావటం మరియు ఆ ప్రాంతంపై సృష్టకర్త నుండి దివ్యవాణి అవతరణ జరగటం,

- కేదారుల కీర్తి అంతా నశించటం,
- మరియు (ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం) వలస పోవటం జరిగిన ఒక సంవత్సరం లోపలే విలుకాండ్లు, కేదారు సంతానంలోని యోద్ధులు కత్తుల ద్వారా మరియు వంగిన విల్లుల ద్వారా వధించబడటం,

మొదలైనవన్నీ జరిగిన వాస్తవాలను గమనిస్తే, పారానులోని ప్రశంస నీయుడు (హబక్కూకు 3) ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తప్ప, ఇంకెవ్వరూ కాజాలరు. పారాను నిర్మానుష్య ప్రాంతంలో నివాస మేర్పరచుకున్న ఇస్మాయీలు (అలైహిస్సలాం) సంతతికి చెందిన కేదారు వంశంలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మించారు. అజ్ఞానాంధకారం భూమిని కప్పివేసిన కాలంలో, అరబ్బులు దివ్యవాణిని అందుకుంది కేవలం ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా మాత్రమే

ఆయన ద్వారా సృష్టికర్త పారాను నుండి ప్రకాశించాడు. మరియు (ఎల్లవేళలా) స్తుతింపబడే దైవగృహం (కాబా) ఉన్నది కేవలం మక్కాలో మాత్రమే. కేదారు తెగలు దాని బలిపీఠాన్ని స్వీకరించారు. తన ప్రజలచే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హింసించబడినారు మరియు మక్కా నగరాన్ని వదిలి వలస పోయారు. ఆయన దాహంతో ఉండినారు. ఒరలలో నుండి బయటకు దూయబడిన కత్తున నుండి మరియు ఎక్కుపెట్టబడిన విల్లుల నుండి తప్పించుకుని, ఆయన మక్కా వదిలినారు. వలస పోయిన సంవత్సరం లోపలే, కేదారు సంతతిలోని అవిశ్వాసులు, విగ్రహారాధకులు బదర్ యుద్ధంలో ఆయనతో తలబడినారు. మక్కావాసులకు మరియు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు మధ్య బదర్ వద్ద మొట్టమొదటి యుద్ధం జరిగినది. దీనిని బదర్ యుద్ధం అంటారు. అనేక మంది కేదారు ముష్రికులు మరియు వారి విలుకాండ్రులు యుద్ధంలో వధించబడినారు. కేదారు వంశీయుల (ఖురైషీయుల) కీర్తి తుడిచి

పెట్టుకుని పోయింది. ఒకవేళ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా ఈ భవిష్యవాణులు పూర్తయ్యాయని అంగీకరించకపోతే, అవి నేటికీ పూర్తికాలేదని అంగీకరించవలసి వస్తుంది. యెషయా 60వ అధ్యాయంలో పేర్కొనబడిన "నా స్తుతినిలయం" కాబాగృహాన్ని సూచిస్తున్నదే గాని క్రైస్తవ వ్యాఖ్యాతలు భావిస్తున్న క్రైస్తవ చర్చ్ ను కాదు. 7వ వచనంలో పేర్కొనబడిన కేదారు తెగలు ఏనాడూ క్రైస్తవ చర్చ్ ను సందర్శించలేదు. మరొక వాస్తవం ఏమిటంటే మొత్తం ప్రపంచంలో ఎలాంటి క్రైస్తవ చర్చ్ ప్రభావానికి లోనుకాకుండా అభేద్యంగా మిగిలినది కేవలం కేదారు పల్లెలు మరియు వాటి నివాసులు మాత్రమే.

ఇంకా, ద్వితీయోపదేశకాండము 33వ అధ్యాయంలో పదివేల మంది శిష్యుల గురించి పేర్కొనబడటంలో చాలా ప్రాధాన్యత ఉన్నది. "యెహోవా సీనాయి నుండి వచ్చెను. సెయీరులో నుండి వారికి ఉదయించెను. ఆయన పారాను కొండ నుండి ప్రకాశించెను. వేవేల పరిశుద్ధ సమూహముల మధ్య నుండి ఆయన వచ్చెను." ద్వితీయోపదేశకాండము 33:2. మీరు పారాను అరణ్య ప్రాంతం గురించిన మొత్తం చరిత్ర చదవండి – ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మక్కాను జయించిన సంఘటన తప్పితే, దీనిని పోలిన మరో సంఘటన మీకు కనబడదు. ఆయన మదీనా నుండి 10,000 మంది సహచరులతో వచ్చి, 'నా స్తుతినిలయం (కాబాగృహం)' లో మరల పున: ప్రవేశించినారు. ఆయన ప్రపంచానికి స్పష్టమైన దివ్యశాసనాన్ని ఇచ్చారు. అది ఇతర చట్టాలన్నింటినీ రద్దు చేసింది. జీసస్ పేర్కొన్న 'ఆదరణకర్త – సత్యస్వరూపియైన ఆత్మ' మరెవరో కాదు, స్వయంగా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తప్ప. క్రైస్తవ ధర్మశాస్త్రం చెబుతున్నట్లుగా, అది పరిశుద్ధాత్మ కాదు. దీనికి ఆధారం - యోహాను 16:7లోని జీసస్ పలుకులు: "అయితే నేను మీతో సత్యము చెప్పు చున్నాను, నేను

వెళ్లిపోవుట వలన మీకు ప్రయోజనకరము; నేను వెళ్ళన యెడల ఆదరణకర్త మీ యొద్దకు రాడు; నేను వెళ్ళిన యెడల ఆయనను మీ యొద్దకు పంపుదును."

జీసస్ (ఈసా అలైహిస్సలాం) వెళ్ళిన తరువాతనే ఆదరణకర్త వస్తాడని మరియు జీసస్ ఈ వచనాలు పలికినప్పుడు ఆదరణకర్త, ఆయనతో పాటు లేడని పై పదాలు స్పష్టంగా తెలుపుతున్నాయి. జీసస్ వెళ్ళిన తరువాతనే పరిశుద్ధాత్మ వస్తాడనే షరతు ద్వారా పరిశుద్ధాత్మ రాకకు జీసస్ వెళ్ళకపోవటం ఆటంకమని మనం ఊహించ వలసి వస్తుంది: అంతేగాక, జీసస్ వివరించిన దాని ప్రకారం ఆదరణకర్త ఒక మానవుడే గాని ఆత్మ కాదు. దీనికి ఆధారం – యోహాను 16:13 "ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును". పరిశుద్ధాత్మ మరియు దేవుడు – ఇద్దరూ వేర్వేరైనవని మరియు పరిశుద్ధాత్మ స్వయంగా తన గురించే పలుకుతుందని మరియు తను దేవుడి నుండి విన్నదానిని కూడా పలుకుతుందని మనం ఊహించాలా? జీసస్ పలుకులు స్పష్టంగా 'సృష్టికర్త నుండి రాబోయే ఒక సందేశహరుడిని' సూచిస్తున్నాయి. జీసస్ ఆయనను సత్యస్వరూపి అని పేర్కొన్నారు మరియు ఖుర్ఆన్ కూడా ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి ఇలా పేర్కొన్నది, "వాస్తవానికి ఆయన (ప్రవక్త) సత్యాన్నే తీసుకుని వచ్చాడు. దైవప్రవక్తలందరినీ (సత్యవంతులుగా) ధృవీకరిస్తున్నాడు." 37:37[1]

[1]. ముహమ్మద్ ఇన్ ద బైబిల్ (Muhammed in the Bible), అబ్దుల్ అహద్ దావూద్.

## గోస్పెల్ నుండి కొన్ని నిదర్శనాలు:

ఆయన కార్యాల మరియు కర్తవ్యాల స్వభావాన్ని సూచిస్తూ, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆగమనం గురించి తెలిపే అనేక వచనాలు కొత్త నిబంధనలో ఉన్నాయి:

యోహాను: "నీవెవడవని అడుగుటకు యూదులు యెరూషలేము నుండి యాజకులను లేవీయులను యోహాను నొద్దకు పంపినప్పుడు అతడిచ్చిన సాక్ష్యమిదే: అతడు ఎరుగననక ఒప్పుకొనెను; క్రీస్తును (అభిషిక్తుడని) కానని ఒప్పుకొనెను. కాగా వారు – మరి నీవెవరవు, నీవు ఏలీయావా అని అడుగగా, అతడు కాననెను. నీవు ఆ ప్రవక్తవా అని అడుగగా – కానని ఉత్తరమిచ్చెను. కాబట్టి వారు – నీవెవరవు? మమ్ము పంపినవారికి మేము ఉత్తరమియ్యవలెను గనుక నిన్ను గూర్చి నీవేమి చెప్పుకొనుచున్నావని అతని నడిగిరి. అందుకతడు – ప్రవక్తయైన యెషయా చెప్పినట్టు నేను ప్రభువు త్రోవ సరళము చేయుడి అని అరణ్యములో ఎలుగెత్తి చెప్పు ఒకని శబ్దము అని చెప్పెను. పంపబడినవారు పరిసయ్యులకు చెందినవారు. వారు – నీవు క్రీస్తువైనను ఏలీయావైనను ఆ ప్రవక్తవైనను కానియెడల ఎందుకు బాప్తిస్మమిచ్చు చున్నావని అతనిని అడుగగా, యోహాను – నేను నీళ్లలో బాప్తిస్మమిచ్చు చున్నాను గాని నా వెనుక వచ్చువాడు మీ మధ్య ఉన్నాడు; " యోహాను సువార్త 1:20-25

ఆ ప్రవక్త జీసస్ (ఈసా అలైహిస్సలాం) కాదు, కానీ ఆయన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం). ఎందుకంటే యోహాను, బోధించడాన్ని మరియు బాప్తిస్మమివ్వడాన్ని మరియు రాబోయే ప్రవక్త గురించి భవిష్యవాణి చెప్పడాన్ని జీసస్ జీవిత కాలంలో కూడా కొనసాగించారు.

జీసస్: 'పెరిక్లైటోస్ - Perqlytos' లేదా 'పారాక్లెట్ - Paraclete' లేదా 'పారాకలోన్ - Paracalon' అనే పేరున్న మరియు (ఆయన సందేశ కాలం) అంతమవ్వని రాబోయే ప్రవక్త ఆగమనం గురించి ప్రవక్త జీసస్ ముందుగానే ఇలా తెలిపారు: "నేను తండ్రిని వేడుకొందును, మీ యొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను, అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును." యోహాను సువార్త 14:16

'పెరిక్లైటోస్' అనే పదానికి అర్థం 'ప్రసిద్ధమైన', 'కీర్తిగల' మరియు 'ప్రశంసించదగిన'. 'అహ్మద్' అనే పదానికి అర్థం కూడా సరిగ్గా ఇదే. తన తరువాత 'అహ్మద్' అనే పేరుగల ప్రవక్త రాబోతున్నాడని ప్రవక్త జీసస్ చెప్పిన భవిష్యవాణి, ఇలా ఖుర్ఆన్ లో ధృవీకరించబడింది. అల్లాహ్ ఇలా ప్రకటించాడు: ఖుర్ఆన్ (ఆయతు యొక్క భావానువాదం) "మర్యమ్ కుమారుడైన ఈసా, 'ఓ ఇస్రాయీలు సంతతివారా! నేను మీ వైపు అల్లాహ్ తరఫున పంపబడిన ప్రవక్తను. నాకు పూర్వం వచ్చిన తౌరాతు గ్రంథాన్ని ధృవపరుస్తున్నాను. నా తరువాత రాబోయే ఒక ప్రవక్తను గురించి శుభవార్తను ఇస్తున్నాను. అతని పేరు అహ్మద్ అని చెప్పినప్పటి సంగతి (కూడా స్మరించదగినదే).' " 61:6

# విజ్ఞానుల ధృవీకరణలు

1. **ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నిరక్షరాశి:** ఆయనకు చదవటం మరియు వ్రాయటం తెలియదు. అంతేగాక, ఆయన చుట్టుప్రక్కల ఉన్నవారు కూడా నిరక్షరాశ్యులే. కాబట్టి ఖుర్ఆన్ రచించింది ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యేనని ఎవ్వరూ దావా చేయలేరు. అల్లాహ్ ఇలా ప్రకటించాడు: "(ఓ ప్రవక్తా!) ఇంతకు ముందు నువ్వు ఏ గ్రంథాన్నీ చదివినవాడవు కావు, ఏ గ్రంథాన్నీ నీ కుడిచేత్తో వ్రాసిన వాడవూ కావు. ఒకవేళ అదే గనుక జరిగివుంటే ఈ మిథ్యావాదులు (నీ విషయంలో) సందేహానికి లోనయ్యేవారే" ఖుర్ఆన్ (ఆయతు యొక్క భావానువాదం) 29:48

2. **ఖుర్ఆన్ సవాలు:** సాహిత్యంలో, వక్తృత్వంలో మరియు వాక్పటిమలో ఆరితేరిన అరబ్బులను, తనను పోలినటు వంటి దానిని తీసుకురమ్మని ఖుర్ఆన్ సవాలు చేసింది. అయినా అరబ్బులు అలా చేయలేక పోయారు. ఖుర్ఆన్ మాధుర్యం, నిర్మాణక్రమం మరియు లోతైన అర్థాలు అరబ్బులను ఆశ్చర్యపరచినది. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి శాశ్వత మహిమగా నిలిచిపోయింది. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా పలికారు: "ప్రవక్తల మహిమలు వారి వారి కాలములకే పరిమితం అయ్యాయి. నాకు ఇవ్వబడిన మహిమ 'ఖుర్ఆన్'. ఇది శాశ్వతంగా మిగిలి ఉంటుంది. కాబట్టి, (తీర్పుదినాన) నేను ఎక్కువ మంది అనుచరులను కలిగి ఉంటానని ఆశిస్తున్నాను." బుఖారీ 4598.

   ఆయన ప్రజలు సాహిత్యంలో, వక్తృత్వంలో ప్రవీణులు. మరియు ఉత్తమమైన కవిత్వంలో వారు ప్రసిద్ధులు. అయితే, ఖుర్ఆన్ వంటి దానిని రచించి తీసుకురమ్మని అల్లాహ్ వారిని సవాలు చేసినపుడు,

వారు రచించి తీసుకురాలేక పోయారు. అపుడు అల్లాహ్ వారిని ఖుర్ఆన్ లోని ఒక అధ్యాయానికి సమానమైన దానినైనా రచించి తీసుకురమ్మని సవాలు చేయగా, వారు దానిని కూడా పూర్తి చేయలేకపోయారు.

అల్లాహ్ ఇలా ప్రకటించాడు, (ఖుర్ఆన్ ఆయతు యొక్క భావానువాదం) "మా దాసునిపై (ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై) అవతరింపజేసిన దాని గురించి ఒకవేళ మీరు సందేహంలో ఉంటే, అటువంటి ఒక అధ్యాయాన్నైనా తీసుకురండి మరియు అల్లాహ్ తప్ప మీ సహాయకులను అందరినీ పిలుచుకోండి, మీరు సత్యవంతులే అయితే (ఇది చేసి చూపండి)" 2:23

ఖుర్ఆన్ వంటి దానిని రచించి ముందుకు తీసుకురమ్మని, సమస్త మానవజాతిని మరియు జిన్నాతులను అల్లాహ్ బహిరంగంగా ఇలా సవాలు చేసినాడు: (ఖుర్ఆన్ ఆయతు యొక్క భావానువాదం) వారికి చెప్పు " ఒకవేళ సమస్త మానవులూ యావత్తు జిన్నులు కలిసి ఈ ఖుర్ఆనులాంటి గ్రంథాన్ని తేదలచినా – వారు ఒండొకరికి తోడ్పాటును అందజేసుకున్నా, ఇటువంటి దానిని తీసుకు రావటం వారి వల్ల కాని పని" 17:88.

3. **ధర్మప్రచారం:** ప్రజలకు ఇస్లాం గురించి బోధించడంలో మరియు ఇస్లాం వైపు పిలవడంలో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు అనేక కష్టాలు, ఇబ్బందులు ఎదురైనా ఆయన దానిని కొనసాగించారు. ధర్మప్రచారంలో ఆయన ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత ఎదురైంది. వారు ఆయనను చంపడానికి కుట్ర కూడా పన్నారు. అయినా ఆయన దానిని కొనసాగించారు మరియు ఓర్పు, సహనం వహించారు. ఒకవేళ

ఆయన వంచకులే అయితే, తన ప్రాణం గురించి భయపడేవారు మరియు పర్యవసానంగా ధర్మప్రచారాన్ని ఆపివేసేవారు.

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి డబ్ల్యూ. మోంట్గొమెరీ వాట్ (w. Montgomery Watt) ఇలా పలికారు: తను నమ్మిన ధర్మవిశ్వాసాల కొరకు యాతనలను ఎదుర్కొనటానికి సిద్ధం గావడం, ఆయనను విశ్వసించి, ఒక నాయకునిలా చూసిన వారి యొక్క మహోన్నత నైతిక స్వభావం మరియు సత్ప్రవర్తన మరియు ఆయన సాధించిన అంతిమ సాఫల్యం యొక్క ఔన్నత్యం – ఇవన్నీ ఆయన యొక్క మౌలిక నిష్కపటత్వాన్ని సమర్థిస్తున్నాయి. ముహమ్మద్ ను వంచకునిగా ఊహించటమనేది, సమస్యలను అధికం చేస్తుందే తప్ప, వాటిని పరిష్కరించదు. అంతేగాక పాశ్చాత్య దేశాలలో ముహమ్మద్ తో పోలిస్తే, చరిత్రలోని మహా పురుషులలో ఎవ్వరూ అంత చిన్నచూపు చూడబడలేదు / తక్కువగా మెచ్చుకోబడలేదు..కాబట్టి మనం ముహమ్మద్ కు కేవలం అనివార్యమైన నిజాయితీని మరియు లక్ష్యసాధనలో చిత్తశుద్ధిని కట్టబెట్టడమే కాకుండా - ఒకవేళ మనం ఆయనను సరిగ్గా అర్థం చేసుకోవాలంటే మరియు గతం నుండి సంక్రమించిన తప్పులను సరిదిద్దు కోవాలంటే – పైకి నిజమనిపించే బూటకాలను నమ్మటానికి బదులు అంతిమ నిదర్శనాలను నమ్మటం చాలా ఆవశ్యకమైనదనే విషయాన్ని మనం ఎంతమాత్రం మరచిపోకూడదు. ఎందుకంటే దీనిని (ఈ సత్యాన్ని) పొందటం చాలా కష్టతరమైనది.

4. **ప్రాపంచిక ఆకర్షణలకు లోనుకాకపోవటం:** సహజంగా మానవుడు అందమైన జీవితాన్ని మరియు అందులోని భోగభాగ్యాలను ఇష్టపడపడటమే కాకుండా వాటి వైపు మొగ్గు చూపుతాడు కూడా.

దీని గురించిన అల్లాహ్ ప్రకటన ఇలా ఉన్నది: (ఖుర్ఆన్ ఆయతు యొక్క భావానువాదం) "వ్యామోహం కలిగించే వాటిపట్ల ప్రేమ మానవుల కొరకు ఆకర్షణీయం చేయబడినది - అనగా స్త్రీలు, కుమారులు, కూడబెట్టబడిన బంగారం, వెండి, అచ్చువేసిన మేలుజాతి గుర్రాలు, పశువులు, పొలాలు మొదలైనవి. ఇవన్నీ ప్రాపంచిక జీవనసామగ్రి. కానీ, మరలిపోవలసిన శ్రేష్ఠమైన గమ్యస్థానం అల్లాహ్ వద్దనే ఉన్నది." 3:14

తన సహజసిద్ధ స్వభావం వలన మానవుడు ఈ ప్రపంచంలోని అందమైన వాటిని పొందటానికి ఆతృతగా ఉంటాడు. వాటిని పొందే విధానంలో ప్రజల మధ్య తేడాలు ఉండవచ్చు - కొందరు న్యాయమైన మార్గాలనే అనుసరిస్తే, మరికొందరు ఐశ్వర్యాన్ని, భోగభాగ్యాలను పొందటానికి నేరాలు చేస్తూ, దారి తప్పిపోవచ్చు. ఇస్లామీయ ధర్మప్రచారాన్ని ఆపి వేయమని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను అంగీకరింపజేయటానికి ఖురైషీయులు అనేక విధాలుగా ప్రయత్నించారు. ఖురైషీయుల నాయకునిగా చేస్తామని, అత్యంత అందమైన స్త్రీతో పెళ్ళి జరిపిస్తామని, తమలో అత్యంత ధనవంతునిగా చేస్తామని ఆయనకు ఆశజూపారు. ఆకర్షణీయమైన ఈ ప్రతిపాదనలకు త్రోసిపుచ్చుతూ ఆయన ఇలా స్పందించారు: "అల్లాహ్ సాక్షి! ఈ విషయాన్ని (ఇస్లామీయ ధర్మప్రచారాన్ని) వదలటానికి ఒకవేళ వారు నా కుడిచేతిలో సూర్యుడిని మరియు నా ఎడమ చేతిలో చంద్రుడిని పెట్టినా – అల్లాహ్ దీనిని సుస్పష్టం చేసేవరకు లేదా ప్రజలను దీని వైపు పిలుస్తూ చంపబడే వరకు, నేను దీనిని వదిలి పెట్టను." (ఇబ్నె హిషామ్)

ఒకవేళ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మోసగాడై నట్లయితే, ఆయన నిస్సంకోచంగా ఈ ప్రతిపాదనల్ని తప్పక స్వీకరించి ఉండేవారు.

థామస్ కార్లైల్ (Thomas Carlyle) ఇలా పలికారు: "వారు ఆయనను ప్రవక్త అని పిలిచారని మీరంటున్నారా? ఆయన వారికి ఎదురు బదురుగా ఎందుకు నిలబడినాడు, ఎలాంటి రహస్యాలు, మర్మాలు, కుతంత్రాలలో ఆయన ఎందుకు పాల్గొనలేదు. ఎందుకు తన స్వంత దుస్తులకు అతుకులు వేసుకుంటూ కనబడేవారు, ఎందుకు తన బూట్లను స్వయంగా మరమ్మత్తు చేసుకునేవారు, ఎందుకు వారితో ధర్మపోరాటం చేసేవారు, ఎందుకు వారి మధ్య సలహా సంప్రదింపులు జరిపేవారు. ఆయన ఎలాంటి వ్యక్తో వారు తప్పకుండా చూసే ఉంటారు, ఆయనను మీరు ఇష్టం వచ్చినట్లు పిలవండి. సామాన్య దుస్తులలోని ఈయనకు చూపబడిన విధేయత, ఏ చక్రవర్తీ తన సహచరుల నుండి పొంది ఉండలేదు. 23 సంవత్సరాల కఠినాతి కఠినమైన అసలు పరీక్షకు తగిన వ్యక్తిగా, అనుపమ యోధునిగా, ఆయన్ని నేను కనుగొన్నాను."[1]

5. **నిరాడంబరత:** ఒక రాజ్యానికి సంబంధించిన విషయాలు మరియు సంపద, దాని రాజు ఇష్టానికి మరియు అతని సేవకు లోబడి ఉంటాయి. మరి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి అయితే, ఈ ప్రాపంచిక జీవితం పరలోకానికి దారితీసే ఒక తాత్కాలిక, అశాశ్వత స్థానమనే విషయం ఆయనకు స్పష్టంగా తెలుసు. అబ్దుల్లాహ్ తనకు తెలిపిన విషయాన్ని ఇబ్రాహీమ్ బిన్ అల్ఖమహ్ ఇలా ఉల్లేఖించారు:"ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గడ్డితో నేయబడిన ఒక చాపపై నడుము వాల్చగా, వాటి గుర్తులు ఆయన శరీరం పై

[1]. 'Heroes, Hero-Worship and Heroic in History'

పడినాయి. అది చూసి నేను ఆయనతో ఇలా అన్నాను 'ఓ అల్లాహ్ యొక్క ప్రవక్తా! నా తల్లిదండ్రులను మీకు అర్పించుదునుగాక! ఈ చాపపై పరుపు తయారు చేయటానికి మాకు అనుమతినివ్వండి. దాని వలన మీరు దీనిపై పడుకున్నపుడు, అది మీ శరీరానికి గుచ్చుకోదు మరియు మీ శరీరం పై గుర్తులు పడవు'. దానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బదులిచ్చారు, 'ఈ ప్రాపంచిక జీవితంలో నా ఉపమానం - ఒక గుర్రపు రౌతు ఒక చెట్టు క్రింద కొంతసేపు విశ్రాంతి గావించి, మరల తన ప్రయాణాన్ని కొనసాగించటం వంటిది'" (ఇబ్నె మాజా 4109)

అన్నోమాన్ బిన్ బషీర్ (రదియల్లాహు అన్హు) ఉల్లేఖన: "తన ఆకలి తీర్చుకోవటానికి, చవకబారు ఖర్జూరాలు కూడా కనుగొనలేని స్థితిలో నేను ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను చూసాను." (ముస్లిం 2977)

అబూ హురైరహ్ (రదియల్లాహు అన్హు) ఉల్లేఖన: "తన మరణం వరకు, ఏనాడూ రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మూడు రోజులు వరుసగా తన కడుపునిండా తిని ఉండలేదు." (బుఖారీ 5059)

ఇది, అరేబియా ద్వీపకల్పం ఆయన ఆధీనంలోనికి వచ్చినా గానీ, ఒక్కోసారి చాలినంత భోజనం కూడా పొందలేనంత నిస్వార్థపరత్వం కారణంగా, ఆయన తన ప్రజల కొరకు అంతులేని మంచితనానికి మూలమవటాన్ని స్పష్టం చేస్తున్నది. ఆయన భార్య ఆయెషా (రదియల్లాహు అన్హా) ఇలా ఉల్లేఖించారు: "ఒకసారి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ఆయుధాలను తాకట్టుగా పెట్టి, ఒక యూదుని వద్ద నుండి, తిరిగి ఇస్తాననే షరతుపై కొంత ఆహారాన్ని అప్పుగా కొనుక్కు / తీసుకువచ్చారు" (బుఖారీ 2088)

తన కోరిన దాన్ని ఆయన పొందలేకపోయేవారని ఎంతమాత్రం కాదు. ఎందుకంటే మస్జిదులో ఆయన ఎదురుగా గొప్ప ధనరాశులు గుట్టగా వేయబడి ఉండేవి. నిరుపేదలలో మరియు అక్కరగలవారిలో దాని నంతటినీ పూర్తిగా పంచిపెట్టేసే వరకు ఆయన తను కూర్చున్న చోటు నుండి కదిలేవారు కాదు. ఆయన సహచరులలో కొందరు చాలా ధనవంతులు. ఆయనకు సేవలందించడంలో మరియు తమ వద్ద నున్న వాటిలో నుండి అత్యంత విలువైన వాటిని ఆయనకు సమర్పించడంలో వారు పోటీ పడేవారు. అయినా, ఆయన తనకు బహుమతిగా ఇవ్వబడిన ఆ సంపదను అల్లాహ్ మార్గంలో ఇస్లామీయ ధర్మప్రచారం కొరకు ఖర్చు పెట్టేసేవారు. ఈ ప్రాపంచిక ఐశ్వర్యాలను ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) త్యజించారు. ఎందుకంటే ఆయన ఈ జీవితం యొక్క వాస్తవం గురించి తెలుసుకున్నారు. ఆయన పలుకులలో: "పరలోకంతో పోలిస్తే ప్రపంచం ఎలాంటి దంటే, ఒక వ్యక్తి సముద్రంలో తన వ్రేలిని ముంచటం వంటిది. వ్రేలితో పాటు వచ్చిన దానిని అతను చూడాలి." (ముస్లిం 2858)

**రెవరెండు బోస్వర్థ్ స్మిత్ (Reverend Bosworth Smith) ఇలా పలికారు:** "ఒకవేళ అత్యంత సముచితమైన రీతిలో పరిపాలించిన వారెవరైనా ఉన్నారంటే, అది కేవలం ముహమ్మద్ మాత్రమే. ఎందుకంటే వారు సమర్థించ వలసిన అవసరం లేకుండా ఆయన అధికారాలన్నింటినీ కలిగి ఉండేవారు. ఆ అధికారాన్ని అలంకరించటం కోసం ఆయన పట్టించుకునే వారు కాదు. తన సొంత జీవితంలోని నిరాడంబరతను ఆయన బయటి జీవితంలో కూడా కొనసాగించారు."[1]

---

[1]. ముహమ్మద్ అండ్ ముహమ్మదనిజం.

6. **దివ్యవాణి సాక్ష్యం:** కొన్ని సంఘటనలు జరిగేవి. వాటి వివరణ ఆయనకు అవసరమయ్యేది. ఆ విషయంలో దివ్యసందేశం అవతరించ నంతవరకు ఆయన దాని గురించి ఏమీ చేసేవారు కాదు. ఆ నిరీక్షణ కాలంలో (సంఘటనకు మరియు దివ్యావతరణకు మధ్య గడిచిన కాలంలో), ఆయన బాధాకరమైన పరిస్థితిని ఎదుర్కొనేవారు మరియు తన దీనస్థితిని చూసుకుని ఆందోళన చెందేవారు. అలాంటి ఒక సంఘటన – ఇఫ్క్ సంఘటన, దేనిలోనైతే ప్రవక్త యొక్క భార్య ఆయెషా (రదియల్లాహు అన్హా) పై ద్రోహం మరియు వ్యభిచారపు ఆరోపణ మోపబడటం. దాదాపు నెల రోజుల వరకు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ సంఘటన గురించి వహీ అందుకోలేదు. ఆ నిరీక్షణా కాలంలో, ఆయెషా (రదియల్లాహు అన్హా) అమాయకత్వాన్ని దివ్యావతరణ వెల్లడిచేసే వరకు, ఆయన శత్రువులు ఆయన గురించి హీనంగా మాట్లాడారు. ఒకవేళ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వంచకులే అయితే, ఆరోపింపబడిన క్షణంలోనే ఏదైనా అసత్యపు దివ్యావతరణను ముందు పెడుతూ ఆయన తప్పకుండా ఈ సంఘటనను పరిష్కరించు కుని ఉండేవారు. ఆయన గురించి అల్లాహ్ ప్రకటన ఇలా ఉన్నది: (ఖుర్ఆన్ ఆయతు యొక్క భావానువాదం) "ఆయన తన మనోవాంఛల ప్రకారం మాట్లాడటమూ లేదు." 53:3

7. **నిగర్వం:** తనను పొగడమని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏనాడూ ప్రజలను కోరలేదు. దీనికి విరుద్ధంగా, ఎవరైనా వ్యక్తి ఏ విధంగానైనా తనను స్తుతిస్తే, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అలా చేయడాన్ని ఇష్టపడేవారు కాదు. అనస్ (రదియల్లాహు అన్హు) ఇలా ఉల్లేఖించారు: "సహచరులకు అల్లాహ్ యొక్క ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కంటే ఎక్కువ ప్రియమైన వారెవరూ ఉండేవారు కాదు." ఇంకా ఆయన ఇలా పలికారు, "ఒకవేళ వారు ఆయనను చూస్తే, లేచి నిలబడేవారు కాదు.

ఎందుకంటే అలా చేయటమంటే ఆయనకు అయిష్టమని వారికి తెలుసు." (తిర్మిథీ 2754)

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు, "క్రైస్తవులు మరియం కుమారుడైన జీసస్ ను స్తుతించినట్లుగా మీరు నన్ను స్తుతించవద్దు. (స్తుతించటంలో హద్దులు మీరవద్దు). నిజానికి నేను కేవలం ఒక దాసుడిని మాత్రమే, కాబట్టి ఇలా అనండి: 'అబ్దుల్లాహ్ (అల్లాహ్ యొక్క దాసుడు) మరియు రసూలుల్లాహ్ (అల్లాహ్ యొక్క సందేశహరుడు)' " బుఖారీ 3445

వాషింగ్టన్ ఇర్వింగ్ (Washington Irving) ఇలా పలికారు: "ఆయన సైనిక విజయాలు ఎలాంటి అహంభావాన్నీ, లేదా విజయగర్వాన్నీ మేలుకొల్పలేదు. వాటి వెనుక స్వార్థప్రయోజనాలుంటే అలా జరిగి ఉండేది. తిరుగులేని అత్యంత శక్తిమంతుడి స్థానానికి ఎదిగిన తరువాత కూడా ఆయన కష్టకాలంలో చూపిన నిరాడంబర స్వభావాన్ని మరియు ఆకారాన్నే కొనసాగించారు. రాచరీవికి సంబంధించి నంత వరకు, గదిలో ప్రవేశించినపుడు ఎవరైనా తనకు ప్రత్యేకమైన గౌరవాభిమానాల్ని చూపితే, వెంటనే ఆయన అయిష్టత చూపేవారు."

8. **కొన్ని ఖుర్ఆన్ వచనాలు:** సంఘటనల లేక పరిణామాల కారణంగా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను మందలిస్తూ ఖుర్ఆన్ లో కొన్ని వచనాలు అవతరించినవి. అయినా ఆయన ఆ వచనాలను ప్రజల ముందు పెట్టారు మరియు వాటిని ప్రచారం చేసారు. ఉదారహణకు:

అ) అల్లాహ్ యొక్క ప్రకటన: "ఓ ప్రవక్తా! అల్లాహ్ నీ కోసం ధర్మసమ్మతం చేసిన దానిని నువ్వెందుకు (నీ కొరకు) నిషేధించుకున్నావు? (ఏమిటి?) నువ్వు నీ భార్యల ప్రసన్నతను

పొందగోరుతున్నావా? అల్లాహ్, క్షమాశీలుడు, దయామయుడు." ఖుర్ఆన్ (ఆయతు యొక్క భావానువాదం) 66:1

కొందరు భార్యల అభ్యంతరం వలన ఒకసారి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇక నుండి తను తేనె సేవించనని అన్నారు. దానిపై అల్లాహ్ ఆయనను మందలిస్తూ పైవచనాలను అవతరింపజేసాడు. ఎందుకంటే అల్లాహ్ ధర్మ సమ్మతం చేసిన దానిని ఆయన స్వయంగా తనపై నిషేధించుకున్నారు.

ఆ) అల్లాహ్ యొక్క ప్రకటన: "అల్లాహ్ నిన్ను మన్నించుగాక (ఓ ముహమ్మద్)! నీ సమక్షంలో సత్యవంతులెవరో తేలి, అబద్ధం చెప్పేవారెవరో కూడా నువ్వు తెలుసుకోకుండానే అసలు నువ్వు వారికి అనుమతి ఎందుకిచ్చావు?" ఖుర్ఆన్ (ఆయతు యొక్క భావానువాదం) 9:43

ఇక్కడ కూడా అల్లాహ్, తన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను మందలించటం జరిగింది. ఎందుకంటే తబూక్ యుద్ధంలో పాల్గొనకుండా వెనుక ఉండి పోయిన కపట విశ్వాసుల సాకులను, బూటకపు కారణాలను నిజానిజాలు తేల్చకుండానే, ఆయన ఒప్పుకున్నారు.

ఇ) అల్లాహ్ యొక్క ప్రకటన: "రాజ్యంలో బాగా రక్తపాతంతో కూడిన యుద్ధం జరగనంతవరకూ యుద్ధ ఖైదీలను తన వద్ద ఉంచుకోవటం ఏ ప్రవక్తకూ తగదు. మీరు ప్రాపంచిక సంపదలను కోరుకుంటున్నారు. కాని అల్లాహ్ (మీ కోసం) పరలోకాన్ని కోరుకుంటున్నాడు. అల్లాహ్ సర్వాధిక్యుడు, వివేకవంతుడు." ఖుర్ఆన్ (ఆయతు యొక్క భావానువాదం) 8:67

ఇస్లామీయ బద్ధశత్రువుల కుతంత్రాలను నిష్ఫలం చేసిన అల్లాహ్ ఇష్టానికి విరుద్ధంగా ఆయన వారిపై హద్దుమీరి దయ చూపటం

మరియు సామ్యాన్ని ప్రదర్శించటం. కఠినాతి కఠినంగా శిక్షించక పోవటంపై అల్లాహ్ ఆయనను మందలించటం గురించిన ఈ వచనం, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హదీథులలో చాలా స్పష్టంగా వివరించబడింది.

ఈ) అల్లాహ్ యొక్క ప్రకటన: "(ఓ ముహమ్మద్!) అల్లాహ్ వారి పశ్చాత్తాపాన్ని స్వీకరించినా లేదా వారిని శిక్షించినా అందులో నీ ప్రమేయం ఏమీలేదు. ఎందుకంటే నిశ్చయంగా వారు దౌర్జన్యపరులు." ఖుర్ఆన్ (ఆయతు యొక్క భావానువాదం) 3:128

ఉ) అల్లాహ్ యొక్క ప్రకటన: "(ప్రవక్త) నుదురు చిట్లించాడు, ముఖం త్రిప్పుకున్నాడు – తన వద్దకు ఒక అంధుడు వచ్చినంత మాత్రానికే. (ఓ ప్రవక్తా) నీకేం తెలుసు, బహుశా అతను తనను సంస్కరించుకుంటాడేమో! లేదా ఉపదేశం వింటాడేమో! ఉపదేశం అతనికి ప్రయోజనకరం అవుతుందేమో!" ఖుర్ఆన్ (ఆయతు యొక్క భావానువాదం) 80:1-4

అంధుడైన అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమ్మె మఖ్తూమ్, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చాడు. ఆ సమయంలో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక ఖురైషీ నాయకునికి లేదా కొందరు ఖురైషీ నాయకులకు ఇస్లాం గురించి బోధిస్తున్నారు. అతనిని చూసి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ముఖం చిట్లించుకుని, ముఖం త్రిప్పుకున్నారు. దీనిపై అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను పై వచనాల ద్వారా మందలించాడు. ఒకవేళ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వంచకుడే అయితే, ఇలాంటి వచనాలు ఖుర్ఆన్ లో కనబడేవి కావు.

ముహమ్మద్ మర్మడుక్ పిక్తల్ ఇలా వ్యాఖ్యానించారు: ఒకరోజు ఖురైషీ నాయకులలోని ఒక గొప్ప నాయకునితో ప్రవక్త (సల్లల్లాహు అలైహి

వసల్లం) మాట్లాడుతూ, అతనికి ఇస్లాంలోని సత్యాన్ని గురించి చర్చిస్తుండగా, ఒక అంధుడు ఆయన వద్దకు వచ్చి, ఈమాన్ (విశ్వాసం) గురించి ఒక ప్రశ్న అడిగారు. తమ చర్చకు అంతరాయం కలిగించినందుకు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అసహనానికి లోనై, నుదురు చిట్లించి, ఆ అంధుడి నుండి ముఖం త్రిప్పుకున్నారు. ఒక వ్యక్తి యొక్క బహిరంగ రూపురేఖలు లేదా అతని ప్రాపంచిక స్థాయిని బట్టి అతని గురించి నిర్ణయించుకోకూడదని ఈ సూరహ్ లో ఆయనకు తెలుపబడింది.[1]

9. **దివ్యావతరణ మహిమ:** ఖుర్ఆన్ లోని అల్ మసద్ అధ్యాయంలో ఆయన ప్రవక్తత్వం తెలిపే ఖచ్చితమైన చిహ్నాలలోని ఒక చిహ్నం గురించి సూచించబడినాయి. అబూ లహబ్ కు (ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క చిన్నాన్న) నరకశిక్ష విధించబడిందని అల్లాహ్ ప్రకటించాడు. ఆయన ధర్మప్రచార తొలిదినాలలో ఈ అధ్యాయం అవతరింప జేయబడింది. ఒకవేళ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వంచకుడే అయితే, ఇలాంటి తీర్పును ముందుగానే ప్రకటించి ఉండేవారు కాదు, ఎందుకంటే ఆయన చిన్నాన్న తర్వాతి దినాలలో ఇస్లాం స్వీకరించ వచ్చును కదా!

   **డాక్టర్ గ్యారీ మిల్లర్ (Dr. Gary Miller) ఇలా వ్యాఖ్యానించారు:** "... ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు ఒక చిన్నాన్న ఉండేవారు. అతని పేరు అబూ లహబ్. ఇతను ఇస్లాంను ఎంతగా ద్వేషించుకునే వాడంటే, ఆయనను అవమానించడానికి ప్రయత్నిస్తూ అతను ప్రవక్త ను వెంబడిస్తుండేవాడు. ఒకవేళ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎవరైనా కొత్త వ్యక్తితో మాట్లాడు తున్నట్లయితే, వారి సంభాషణ పూర్తయ్యేవరకు

---

[1]. ది గ్లోరియస్ ఖుర్ఆన్ పే.685.

అతడు నిరీక్షించేవాడు. ఆ తరువాత అతను ఆ కొత్త వ్యక్తిని సమీపించి, అతనితో ఇలా అనేవాడు 'ఆయన నీకు ఏమని చెప్పాడు? ఆయన నలుపు అని చెబితే, అది తెలుపు అని అర్థం చేసుకో. ఆయన పగలు అని చెబితే, అది రాత్రి అని అర్థం చేసుకో'. అతను ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నుండి ఏదైతే వినేవాడో, అతను దానికి వ్యతిరేకంగా నమ్మబలికేవాడు. ఏదేమైనా, అబూ లహబ్ చనిపోవటానికి పదేళ్ళ ముందే ఖుర్ఆన్ లో అతని గురించి ఒక చిన్న అధ్యాయం అవతరించింది. అతడు నరకాగ్నిలోనికి పోతాడని అది స్పష్టంగా ప్రకటించింది. ఇంకో మాటలో, అతను ఎన్నటికీ ముస్లింగా మారడని ధృవీకరించి, అతడికి శాశ్వతంగా నరకశిక్ష విధించింది. ఈ పదేళ్ళలో అబూ లహబ్ చేయవలసిందల్లా, 'నేను ఎన్నటికీ మారను, అంటే నేను ఏనాటికీ ముస్లింగా మారను మరియు నరకాగ్నిలో ప్రవేశిస్తాననే దివ్యవాణి ప్రకటన ముహమ్మద్ పై అవతరించినట్లు నేను విన్నాను. సరే, నేనిప్పుడు ముస్లింగా మారాలని కోరుకుంటున్నాను. దీనిని మీరేవిధంగా ఇష్టపడతారు? మీ దివ్యావతరణ గురించి ఇప్పుడు మీ అభిప్రాయం ఏమిటి?'. కానీ అతడు ఎన్నడూ అలా చేయలేదు. అయితే, అతడు అలా చేస్తాడని ఇతరులు అతని నుండి ఆశించారు. ఎందుకంటే అతడు ఎల్లప్పుడూ ఇస్లాం సందేశాలకు విరుద్ధంగా ప్రవర్తించేవాడు. అసలు సారాంశాన్ని వివరిస్తూ, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "నీవు నన్ను అసహ్యించుకున్నావు మరియు నన్ను అంతం చేయాలనుకోవటం లేదా? అలాగైతే, ఈ పదాలను పలుకు, నేను అంతమైపోతాను. రా, ముందుకు రా, వీటిని పలుకు!" కానీ, అబూ లబహ్ ఎన్నడూ వాటిని పలకలేదు. పదేళ్ళు గడిచాయి! అన్ని సంవత్సరాలలో అతడు ఏనాడూ ఇస్లాం స్వీకరించలేదు లేదా ఇస్లాం పై మెతక ధోరణి

అవలంబించలేదు. ఒకవేళ ఆయన (ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం) నిజంగా అల్లాహ్ యొక్క ప్రవక్త కాకపోయినట్లయితే; అబూ లహబ్, తన గురించి అవతరించిన ఖుర్ఆన్ దివ్యవాణిని నిజం చేస్తాడని అంత ఖచ్చితంగా ముహమ్మద్ పదేళ్ళకు ముందే ఎలా తెలుసుకోగలిగారు? దీనికి లభించే ఒకే ఒక సమాధానం ఏమిటంటే – ఆయన నిజంగా అల్లాహ్ యొక్క ప్రవక్తయే; అంతటి ప్రమాదకరమైన తిరుగులేని సవాలును ముందుంచటాన్ని బట్టి, ఆయన వద్ద దివ్యవాణి అవతరణ ఉండిందనే వాస్తవాన్ని ఎవరైనా సరే పూర్తిగా నమ్మితీరవలసిందే.[1]

10. **అహ్మద్ - ముహమ్మద్:** ఖుర్ఆన్ లోని ఒక వచనంలో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) 'ముహమ్మద్' అనే పేరుతో గాకుండా 'అహ్మద్' అనే పేరు పేర్కొనబడినారు. అల్లాహ్ ప్రకటన: "మర్యమ్ కుమారుడైన ఈసా, 'ఓ ఇస్రాయీలు సంతతివారా! నేను మీ వైపు అల్లాహ్ తరఫున పంపబడిన ప్రవక్తను. నాకు పూర్వం వచ్చిన తౌరాతు గ్రంథాన్ని ధృవపరుస్తున్నాను. నా తరువాత రాబోయే ఒక ప్రవక్తను గురించి శుభవార్తను ఇస్తున్నాను. అతని పేరు అహ్మద్ అని చెప్పినప్పటి సంగతి (కూడా స్మరించదగినదే).' " (ఖుర్ఆన్ ఆయతు యొక్క భావానువాదం) 61:6

ఒకవేళ ఆయనే గనుక వంచకుడైనట్లయితే, ఖుర్ఆన్ లో 'అహ్మద్' అనే పేరును పేర్కొనేవారు కాదు ఎందుకంటే తన ప్రజలలో ఆయన 'ముహమ్మద్' అనే పేరుతో పిలవబడేవారు. ఇది గోస్పెలులో ఆయన గురించి పేర్కొనబడిన భవిష్యవాణులను సూచిస్తున్నది.

---

[1]. ది అమేజింగ్ ఖుర్ఆన్

**11. ఇస్లాం వ్యాప్తి:** ఇస్లామీయ ధర్మం ఈనాటికీ మిగిలి ఉంది. ప్రపంచం నలుమూలలకూ వ్యాపిస్తున్నది: ఇస్లామీయ ధర్మప్రచారకులకు చాలినన్ని ఆర్థిక వనరుల సహాయం లేనప్పటికీ మరియు ఇస్లాం ధర్మం వ్యాపించకుండా నిరోధించాలని, ఇస్లాం యొక్క శత్రువులు తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నప్పటికీ, వేల కొద్దీ ప్రజలు ఇస్లాం ధర్మాన్ని స్వీకరిస్తున్నారు మరియు ఇతర ధర్మాలపై ఇస్లాం ధర్మానికి ప్రాధాన్యతనిస్తున్నారు. అల్లాహ్ ప్రకటన: "మేమే ఈ ఖుర్ఆన్ ను అవతరింపజేశాము. మరి మేమే దీనిని రక్షిస్తాము." (ఖుర్ఆన్ ఆయతు యొక్క భావానువాదం) 15:9

**థామస్ కార్లైల్ ఇలా వ్యాఖ్యానించారు:** "ఒక అసత్యవాది ధర్మాన్ని కనిపెట్టాడా? ఎందుకు, ఒక అసత్యవాది ఇటుకలతో ఒక ఇంటినే కట్టలేడే! సున్నం యొక్క లక్షణాలు, మట్టిని కాల్చడం మరియు ఆ పనిలో అవసరమయ్యే ఇతర విషయాల గురించి ఒకవేళ అతనికి తెలీక పోతే మరియు నిజంగా వాటి పద్ధతులను అనుసరించకపోతే, అతను నిర్మించేది ఇల్లు కాదు – ఒక చెత్తకుప్ప తప్ప. నూట ఎనభై మిలయన్ల మందిని చేర్చుకుని, అది 12 శతాబ్దాల పాటు నిలబడదు – అది తిన్నగా పడిపోతుంది. మానవుడు స్వయంగా ప్రకృతి నియమాలకు బద్ధుడై ఉండవలెను. నిజంగా ప్రకృతితో కలిసి మెలిసి ఉండవలెను. విషయాలలోని నిజం లేదా ప్రకృతి అతనికి సమాధానమిస్తుంది, కాదు, అస్సలు కాదు! కృత్రిమమైనవి కృత్రిమమైనవే .. ఆహ్. నేను! కాగ్లియోస్ట్రో, అనేక కాగ్లియోస్ట్రోలు, ప్రసిద్ధ ప్రపంచ నాయకులు, తమ బూటకపు పరిష్కారాలతో వర్ధిల్లుతారు – ఒక రోజున. అది నకిలీ బ్యాంకు నోటు వంటిది; వారి అనర్థమైన చేతుల ద్వారా అవి ముందుకు పంపబడుతున్నాయి: ఇతరులు, దాని కొరకు చురుకుగా తయారు కావాలి. ప్రకృతి అగ్ని

జ్వాలగా బ్రద్ధలవుతుంది; ఫ్రెంచి విప్లవాలు మరియు అలాంటి ఇతర ఉద్యమాలు - నకిలీ నోట్లు నకిలీవేనని భయంకరమైన ప్రామాణికతతో దావా చేస్తున్నాయి. కానీ, ప్రత్యేకమైన ఆ మహాపురుషుడిలో, ఆయనలో విశేషంగా నిజం తప్ప మరేమీ లేదనే అపురూపమైన వాస్తవాన్ని నొక్కి చెప్పటానికి నేను సాహసిస్తున్నాను. అది ఆయనలోని ప్రాథమిక పునాది అని నాకనిపిస్తుంది మరియు అన్నింటిలో ఆయనపై అబద్ధం ఆరోపించబడేది ఇదే.[1]"

గ్రంథరూపంలో మరియు తరతరాల ప్రజల జ్ఞాపకాలలో (కంఠస్థం ద్వారా) అల్లాహ్ ఖుర్ఆన్ ను సురక్షితం చేసినాడు. ఆ తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూడా ఖుర్ఆన్ ను భద్రపరచినారు. నిశ్చయంగా ఖుర్ఆన్ ను జ్ఞాపకం చేయటం (కంఠస్థం చేయటం) మరియు దానిని పఠించటం, దానిని నేర్చుకోవటం మరియు బోధించటం మొదలైనవి ముస్లింలు చాలా ఆసక్తిగా చేసే పనులలోనివి. ఎందుకంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు, 'ఎవరైతే ఖుర్ఆన్ నేర్చుకుంటారో మరియ దానిని బోధిస్తారో, వారే మీలో ఉత్తములు' బుఖారీ 4639

ఖుర్ఆన్ లో మార్పులు చేర్పులు చేయాలని, కొన్ని వచనాలను కలపాలని మరియు కొన్నింటిని తీసివేయాలని అనేక మంది ప్రయత్నించారు. కానీ, వారేనాడూ ఖుర్ఆన్ ను అలా కలుషితం చేయటంలో సఫలం కాలేకపోయారు. ఎందుకంటే వారి నీచ ప్రయత్నాలు వెంటనే గుర్తించబడినాయి.

ఇస్లాం ధర్మం యొక్క రెండో మూలాధారం, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క సున్నతులు. నమ్మకస్తులైన సజ్జనుల తీవ్రమైన

[1]. 'Heros, Hero-Worship and the Heroic in History'

మరియు కష్టతరమైన ప్రయత్నాల వలన అవి జాగ్రత్తగా భద్రపరచ బడినాయి. వీటిని జమ చేయడంలో మరియు ప్రామాణికమైన వాటిని బలహీనమైన వాటి నుండి వేరు చేసే పరిశోధనలలో, కల్పించబడిన ఉల్లేఖనలలోని అసత్యాన్ని సరైన ఆధారాలతో ఋజువు చేయటంలో వారు తమ జీవితాలను ధారపోసారు. ఎవరైనా హదీథు విజ్ఞానశాస్త్రంపై వ్రాయబడిన గ్రంథాలను పరిశీలిస్తే, ప్రామాణికంగా వర్గీకరించబడిన ఉల్లేఖనలు నిజానికి సత్యాసత్యాలను ధృవీకరించే అనేక ప్రామాణిక కఠిన పరీక్షలలో నెగ్గినవేననే వాస్తవాన్ని గ్రహిస్తారు.

**మైకెల్ హార్టు (Michael Hart)[1] ఇలా అన్నారు:** "ప్రపంచ ధర్మాల లోని ఒక గొప్ప ధర్మాన్ని[2] ముహమ్మద్ స్థాపించారు మరియు ప్రకటించారు. మరియు తీవ్రమైన ప్రభావశీల రాజకీయ నాయకునిగా ఎదిగారు. ఆయన మరణించి 13 శతాబ్దాలు గడిచినా, నేటికీ ఆయన ప్రభావం చాలా శక్తివంతంగా మరియు నలుమూలలకూ వ్యాపించేదిగా నిరూపించ బడుతున్నది."

12. **ఆయన సిద్ధాంతాల ప్రామాణికత మరియు యదార్థత – ప్రతికాలానికీ మరియు ప్రతిప్రాంతానికీ శుభకరమైనది మరియు సముచితమైనది:** ఇస్లాంను అనుసరిస్తే కలిగే ఫలితాలు చాలా స్పష్టమైనవి మరియు ప్రసిద్ధమైనవి. ఇస్లాం ధర్మాన్ని ఏకైక ప్రభువైన అల్లాహ్ యే అవతరింప జేసాడనే వాస్తవానికి ఇది ఒక సాక్ష్యం. ఇది అనేక మంది

---

[1]. 'The 100' A ranking of the most influential persons in history.

[2]. ఇస్లాం ధర్మం అల్లాహ్ నుండి అవతరింపజేయబడిన ఒక దివ్యసందేశమని మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏదైతే తనపై అవతరింపజేయబడిందో, కేవలం దానిని మాత్రమే ప్రచారం చేసారని మరియు అది ఆయనకు అప్పజెప్పబడిన ఒక పవిత్ర బాధ్యత అని మేము విశ్వసిస్తాము.

ప్రవక్తల మరియు సందేశహరుల విషయంలో సాధ్యమైనపుడు, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కు ఎందుకు సాధ్యం కాదు? ఒకవేళ ఈ ప్రశ్నకు 'దీనిని నిరోధించేదేదీ లేదు' అనేది జవాబైతే, మనం 'ఆయన ప్రవక్తత్వాన్ని ఎందుకు తిరస్కరిస్తున్నారు మరియు ఆయన కంటే ముందు వచ్చిన ప్రవక్తల ప్రవక్తత్వాన్ని ఎందుకు ధృవీకరిస్తున్నారు?'

13. **సామాజిక వ్యవస్థ:** జీవితంలోని ఆరాధనలు, వ్యాపార లావాదేవీలు, వివాహం మరియు విడాకులు వంటి సామాజిక వ్యవహారాలు, బహిరంగ మరియు రహస్య ప్రవర్తనలు, రాజకీయాలు మొదలైన ప్రతి విషయానికి సంబంధించిన ధర్మశాసనాన్ని సూచించే ఇస్లామీయ చట్టాన్ని పోలిన చట్టాల్ని తయారు చేయటం ఏ మానవుడికీ సాధ్యం కాదు: 20 సంవత్సరాలలో ఒక పెద్ద నాగరికత రూపుదిద్దుకోవటానికి ఆధారమైన వీటన్నింటినీ ఒక నిరక్షరాశి ఎలా తీసుకురాగలడు? ఇది ఒక స్పష్టమైన నిదర్శనం మరియు ఆయన ప్రవక్తత్వానికి చిహ్నం.

14. **తన వయస్సు 40 ఏళ్ళకు చేరుకునే వరకు, ప్రవక్త** (సల్లల్లాహు అలైహి వసల్లం) **ప్రజలను ఇస్లాం వైపు పిలవటం ప్రారంభించలేదు:** ఆయన యవ్వనం గడిచిపోయింది. సామాన్యంగా ఈ వయస్సులో ఎవరైనా విశ్రాంతి తీసుకోవాలని చూస్తారు. తమ సమయంలో అధిక భాగాన్ని తీరికగా గడపాలని చూస్తారు. కానీ, ఈ వయస్సులో ఆయనకు ప్రవక్తత్వపు బాధ్యత ఇవ్వబడింది మరియు ఇస్లామీయ ప్రచారం అప్పజెప్పబడింది.

**థామస్ కార్లయిల్ ఇలా అన్నారు:** "ఇది వంచకుల సిద్ధాంతాలకు పూర్తి వ్యతిరేకంగా పోతుంది. తన వయస్సు వేడి అంతమయ్యే వరకు ఆయన పూర్తిగా నిర్దోషమైన, ప్రశాంతమైన మరియు సామాన్యమైన

జీవితాన్ని గడిపారు. ఆకాశం నుండి అవతరింపజేయబడిన ఏ ధర్మం గురించైనా ప్రకటించటానికి ముందు ఆయన వయస్సు 40 ఏళ్ళకు చేరుకుంది. ఆయన యొక్క నిజమైన మరియు ఇతరులు కల్పించిన అన్ని రకాల ఒడిదుడుకులు - 50 ఏళ్ళ వయస్సులో, భార్య ఖదీజా రదియల్లాహు అన్హా చనిపోయిన తర్వాత నుండే మొదలయ్యాయి. పూర్తి నిజాయితీతో కూడిన జీవితాన్ని గడపటమే ఆయన ముఖ్యలక్ష్యంగా కనబడుతున్నది. ఆయనను ఎరిగిన ఆయన ఇరుగు పొరుగు ప్రజల మంచి అభిప్రాయాలే ఆయన యొక్క కీర్తి ప్రతిష్ఠలుగా చాలు. వయసు పైబడనంత వరకు, తీక్షణమైన తన యవ్వన వేడి చల్లారిపోనంత వరకు, ఆయనకివ్వటానికి ఈ ప్రపంచం వద్ద అశాంతి మాత్రమే మిగలనంతవరకు, ఆయన తన లక్ష్యసాధన దిశలో నడక మొదలు పెట్టనేలేదు. గడిచిన జీవితపు సుగుణాలు మరియు మంచిపేరు ఆయనను సమర్ధించలేక / ఆయన నిలబెట్టుకోకుండా, ఇక తను అనుభవించలేని సుఖసంతోషాలను పొందజూసే దయనీయ ఒంటరి కువైద్యుడిగా / గారడాలమారిగా ఆయనను నిలబెట్టినది! నా విషయానికి వస్తే, ఏదేమైనా, అందులో నాకేమాత్రం విశ్వాసం లేదు.[1]

[1]. 'Heroes, Hero-Worship and the Heroic in History'

# లా ఇలాహ ఇల్లల్లాహ్ – ముహమ్మదుర్రసూలుల్లాహ్

## ఒక్క అల్లాహ్ కు తప్ప, ఆరాధింపబడే హక్కు మరెవ్వరికీ లేదు
## మరియు
## ముహమ్మద్ - అల్లాహ్ యొక్క సందేశహరుడు

# అనే సాక్ష్యప్రకటన నిర్దేశించే దేమిటి ?

1. అల్లాహ్ యొక్క సందేశహరుడిని విశ్వసించుట మరియు ఆయన సమస్త మానవజాతి కొరకు పంపబడినారని దృఢంగా నమ్ముట; కాబట్టి ఇస్లాం సందేశం కేవలం కొంత మంది ప్రజలకే పరిమితం కాదు మరియు కొంత కాలానికే పరిమితం కాదు. దీని గురించి అల్లాహ్ యొక్క ప్రకటన ఇలా ఉంది (ఖుర్ఆన్ ఆయతుల భావానువాదం):

   సమస్త లోకవాసులను హెచ్చరించేవానిగా ఉండటానికి గాను తన దాసునిపై గీటురాయి (ఖుర్ఆన్) ను అవతరింపజేసిన అల్లాహ్, గొప్ప శుభకరుడు. 25:1

2. దీన్ (ధర్మం) విషయంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎలాంటి పొరపాటూ చేయరని విశ్వసించుట: దీని గురించి అల్లాహ్ ప్రకటన ఇలా ఉంది (ఖుర్ఆన్ ఆయతుల భావానువాదం):

   అతను తన ఇష్ట ప్రకారం మాట్లాడటము లేదు. అది అతని వద్దకు పంపబడే దైవవాణి (వహీ) తప్ప మరేమీ కాదు.53:3-4

ప్రాపంచిక వ్యవహారాల విషయంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూడా మానవులే మరియు ఆయన వాటి గురించిన సరైన అవగాహన కొరకు ప్రయత్నించేవారే అని తెలుసుకోవాలి.

ఒకసారి తీర్పునిస్తూ, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: "మీరు మీ అభియోగాలను నా ముందు పెడతారు – మీలో కొందరు మీ ప్రత్యర్థుల కంటే ఎక్కువగా వాక్చాతుర్యం కలిగి ఉండి, ఒప్పించే విధంగా మీ వాదన గలిగే నేర్పూ, చాకచక్యమూ కలిగి ఉండవచ్చు. దాని ప్రభావానికి అంటే ఆ నిజమనిపించే ఆ మోసపూరితమైన వాక్చాతుర్య ప్రభావానికి లోనై, ఒకవేళ నేను ఒకరివ్వవలసిన హక్కును వారికివ్వకుండా వేరే వానికిస్తే, నేను వారికిస్తున్నది నరకాగ్ని భాగాన్ని మాత్రమే అనేది గుర్తుంచుకుని, అతను దానిని తీసుకోకూడదు." బుఖారీ మరియు ముస్లిం.

మరోచోట ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: "నేను కూడా మానవుడినే. ఇరు పక్షాల వారు తమ సమస్యను పరిష్కరించుకోవటానికి నా వద్దకు వస్తారు. మీలో కొందరు తమ వాదనను తమ ప్రత్యర్థి కంటే ఎక్కువ వాగ్ధాటితో నాకు వినిపించవచ్చు – దాని వలన నేను అతని వాదనే సరైనదని భావించి, అతని పక్షాన తీర్పునిచ్చే అవకాశముంది. కాబట్టి ఒకవేళ నేను పొరపాటున ఒక ముస్లిం హక్కును, వేరే అతనికి ఇచ్చినట్లయితే, అపుడు అతనికి ఇవ్వబడుతున్నది కేవలం నరకాగ్ని భాగం మాత్రమే (అని అతను గుర్తుంచుకోవాలి). కాబట్టి, దానిని (ఆ అగ్నిని) స్వీకరించాలని ఎంచుకోవటమా లేదా పునరుత్థాన దినానికి ముందే, (తన వాగ్ధాటి ప్రభావం వలన పొరపాటుగా ఇవ్వబడిన ఇతరుల హక్కును) వదులు కోవటమా అనేది నిర్ణయించుకోవాలి." బుఖారీ మరియు ముస్లిం.

3. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మొత్తం మానవజాతి కొరకు కరుణామూర్తిగా, దయామయుడిగా పంపబడినారని విశ్వసించుట: దీని గురించి అల్లాహ్ యొక్క ప్రకటన ఇలా ఉంది (ఖుర్ఆన్ ఆయతుల భావానువాదం):

"(ఓ ముహమ్మద్!) మేము నిన్ను సమస్త లోకాల కోసం కారుణ్యంగా చేసి పంపాము" 21:107

మానవజాతి కొరకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం 'ఒక కరుణ' అని చెప్పటంలో అల్లాహ్ నిశ్చయంగా సత్యమే పలికినాడు – అల్లాహ్ కంటే సత్యవంతులు ఇంకెవ్వరు కాగలరు? సృష్టి ఆరాధనల నుండి ఆయన మానవుడిని నిరోధిస్తూ, సర్వలోక సృష్టికర్త ఆరాధన వైపునకు మార్గదర్శకత్వం చేసారు. దౌర్జన్యం మరియు అన్యాయంతో కూడిన (అసత్య మరియు కల్పిత) ధర్మాల నుండి ఆయన మానవుడిని న్యాయం మరియు స్వచ్ఛతతో కూడిన ఇస్లాం ధర్మం వైపునకు, స్వార్థపూరిత ప్రాపంచిక జీవితం నుండి ఆయన మానవుడిని పరలోకం కొరకు శ్రమించే నిస్వార్థ జీవితం వైపునకు దారి చూపినారు.

4. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అత్యంత గౌరవనీయులైన ప్రవక్త మరియు సందేశహరుడని, అంతిమ ప్రవక్త మరియు సందేశహరుడని దృఢంగా విశ్వసించుట: దీని గురించి అల్లాహ్ ప్రకటన ఇలా ఉంది (ఖుర్ఆన్ ఆయతుల భావానువాదం):

"(ప్రజలారా!) ముహమ్మద్ మీ పురుషులలో ఎవరికీ తండ్రి కాడు. అయితే ఆయన అల్లాహ్ యొక్క సందేశహరుడు. ప్రవక్తల

పరంపరను పరిసమాప్తం చేసే (చిట్టచివరి) వాడు. అల్లాహ్ ప్రతిదీ తెలిసినవాడు." 33:40

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: "మిగిలిన ప్రవక్తలందరిపై నాకు ఆరు విషయాలలో (ప్రత్యేక) అనుగ్రహం ప్రసాదించబడింది: నాకు జవామీ అల్ కలిమ్[1] ప్రసాదించబడింది, శత్రుహృదయాలలో భయం చొప్పించబడింది, యుద్ధసంపత్తి నా కొరకు ధర్మసమ్మతం చేయబడింది, భూమండలం మొత్తం ఆరాదనా స్థలంగా (నమాజు చేయగలిగే స్థలంగా) చేయబడింది, శుద్ధి అయ్యే మాధ్యమములు తెలుపబడినాయి, నేను మొత్తం మానవజాతి కొరకు పంపబడినాను మరియు నేను అంతిమ ప్రవక్తను." ముస్లిం మరియు అత్తిర్మిధీ.

5. దీనె ఇస్లాం (ఇస్లామీయ ధర్మాన్ని) ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మనకు అందజేసారని దృఢంగా విశ్వసించడం: అది అన్ని కోణాల నుండి సంపూర్ణమైనది. ఎవరైనా దానికి ఏదైనా చేర్చడం గానీ లేదా దాని నుండి ఏదైనా తొలగించడం గానీ చేయలేరు. అల్లాహ్ యొక్క ప్రకటన ఇలా ఉంది (ఖుర్ఆన్ ఆయతుల భావానువాదం):

"ఈ దినమున నేను మీకొరకు మీ ధర్మాన్ని పరిపూర్ణం గావించాను. అలాగే మీపై నా అనుగ్రహాన్నీ పూర్తి చేసాను మరియు ఇస్లాంను మీకొరకు ధర్మంగా ఆమోదించాను" 5:3

---

[1]. జవామీ అల్ కలిమ్ (పలుకులలో సంగ్రహము): ఇది ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మహిమలలోని ఒక మహిమ. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప గొప్ప భావాలను, పలుకులను కేవలం అతి తక్కువ పదాలలో పలికేవారు.

ఇస్లాం ఒక సంపూర్ణ జీవన వ్యవస్థ; దీనిలో జీవితపు సామాజిక, రాజకీయ, ఆర్థిక మరియు నైతిక పద్ధతులున్నాయి. అది ఇహపరలోకాలలో సాఫల్యవంతమైన జీవితాన్ని గడిపే విధంగా ప్రజలకు మార్గదర్శకత్వం వహిస్తుంది.

థామస్ కార్లయిల్ ఇలా పలికారు: "ముహమ్మదీయులు తమ ఖుర్ఆన్ ను ఎంతో గౌరవాభిమానాలతో చూస్తారు. కొద్దిమంది క్రైస్తవులు మాత్రమే ఆ విధంగా తమ బైబిలును గౌరవిస్తారు. ప్రతిచోటా ముస్లింలు దీనిని ఇతర చట్టాల కంటే మరియు ఆచరణల కంటే ప్రామాణికమైనదిగా సమ్మతిస్తారు; దీని ప్రభావం వారి ఆలోచనలపైనా మరియు జీవితంపైనా పూర్తిగా ఉంది; ఈ దివ్యసందేశం ఆకాశం నుండి తిన్నగా పంపబడింది, దేనినైతే ఈ భూలోకం ధృవీకరించవలసి ఉందో, అనుసరించ వలసి ఉందో; అది (ప్రతి ఒక్కరిచే) చదవబడవలసిన దివ్యసందేశం. వారి న్యాయమూర్తులు దీని ఆధారంగానే తీర్పు చెబుతారు. ముస్లిములందరూ దీనిని తప్పనిసరిగా చదువ వలసి ఉంది మరియు తమ జీవిత మార్గదర్శకత్వాన్ని దీన్నుండి పొందవలసి ఉంది. వారి వద్ద మస్జిదులున్నాయి – వాటిలో ఇది ప్రతిరోజూ పఠించబడుతుంది. దీని 30 భాగాలను ఇమాములు వంతుల వారీగా పఠిస్తారు. అన్ని సందర్భాలలోనూ, అనేక మంది ప్రజల చెవులలో మరియు మనస్సులలో మారుమ్రోగే ఈ పఠనం మొదలై 1200 సంవత్సరాలు అయ్యాయి. ఒక మహమ్మదీయ డాక్టరు దీనిని 70,000 సార్లు చదివాడని విన్నాము."

6. అల్లాహ్ యొక్క ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దివ్యసందేశాన్ని పూర్తిగా అందజేశారని మరియు సమాజానికి మనస్ఫూర్తిగా బోధించారని దృఢంగా విశ్వసించు: ఆయన తన సమాజానికి చూపిన

మంచి, శుభం తప్ప మరే మంచీ, శుభమూ ఇహలోకంలో లేదు. మరియు ఆయన తన సమాజాన్ని హెచ్చరించిన చెడు, పాపం తప్ప ఇహలోకంలో మరే చెడూ, పాపమూ లేవు. ఆయన తన అంతిమ హజ్ ప్రసంగంలో ఇలా ప్రశ్నించారు:

"'నేను మీకు అల్లాహ్ యొక్క సందేశాన్ని అందజేయలేదా?' వారు అవునని జవాబిచ్చారు. అది విని ఆయనిలా అన్నారు: 'ఓ అల్లాహ్! దీనికి సాక్ష్యంగా ఉండుము' " ముత్తఫిఖ్ అలైహి.

7. కేవలం ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క షరిఅహ్ (ఇస్లామీయ చట్టం) మాత్రమే ఆమోదయోగ్యమైన చట్టమని విశ్వసించుట. ఈ షరిఅహ్ చట్ట ప్రకారమే మానవజాతి కొరకు తీర్పు చెప్పబడాలి. దీని గురించి అల్లాహ్ ఆదేశం ఇలా ఉంది (ఖుర్ఆన్ వచనాల భావానువాదం): "మరియు ఎవరైనా ఇస్లాంను కాక మరే ఇతర ధర్మాన్ని అవలంబించినా, అది అసలు ఎంతమాత్రమూ అతని నుండి స్వీకరించబడదు. అంతేకాక, పరలోకంలో అతడు నష్టపోయే వారిలోని వాడవుతాడు." 3:85

8. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు విధేయత చూపటం గురించి అల్లాహ్ యొక్క ప్రకటన ఇలా ఉంది (ఖుర్ఆన్ ఆయతుల భావానువాదం): "మరియు ఎవరైతే అల్లాహ్ మరియు ఆయన సందేశహరుని పట్ల ఆజ్ఞానువర్తనులై ఉంటారో, (తీర్పుదినాన) అలాంటి వారే అల్లాహ్ అనుగ్రహించిన వారి సాంగత్యంలో ఉంటారు – అనగా ప్రవక్తల, సత్యవంతుల, షహీదుల (అల్లాహ్ మార్గంలో ప్రాణాలు అర్పించినవారి) మరియు సజ్జనుల సాంగత్యంలో – ఎంత మంచి సహచరులు వీరు!" 4:69

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు విధేయత చూపటమంటే, దేనినైతే ఆయన చేయమని ఆజ్ఞాపించారో, దానిని చేయటం మరియు దేనినైతే ఆయన చేయవద్దని నిషేధించారో, దానిని చేయకుండా ఆగిపోవటం.

“ప్రవక్త మీకు ఇచ్చిన దానిని పుచ్చుకోండి. ఆయన దేని నుండైనా మిమ్మల్ని వారిస్తే, దాన్ని వదిలిపెట్టండి” 59:7

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారించిన దాని నుండి ఆగని వారు ఎదుర్కోబోయే శిక్ష గురించి మహోన్నతుడైన అల్లాహ్ ప్రకటన ఇలా ఉంది: (ఖుర్ఆన్ వచన భావానువాదం)

“మరియు ఎవరైతే అల్లాహ్ కు, ఆయన సందేశహరునికి అవిధేయత చూపుతాడో మరియు ఆయన నిర్ణయించిన హద్దులను అతిక్రమిస్తాడో, అతడిని ఆయన నరకాగ్నిలోనికి ప్రవేశింపజేస్తాడు. అందులో అతడు శాశ్వతంగా పడి ఉంటాడు మరియు అతడి కొరకు అవమానకరమైన శిక్ష ఉన్నది.” 4:65

9. అల్లాహ్ యొక్క సందేశహరుడు సల్లల్లాహు అలైహి వసల్లం ఇచ్చిన తీర్పుకు సంతృప్తి చెందుట మరియు ఆయన ధర్మసమ్మతం చేసిన మరియు అనుమతించిన వాటి గురించి సందేహించకుండా ఉండుట గురించి అల్లాహ్ ఇలా ప్రకటించినాడు (ఖుర్ఆన్ ఆయతు భావానువాదం)

“కనుక (ఓ ముహమ్మద్!) నీ ప్రభువు సాక్షిగా! వారసులు విశ్వాసులే కాదు - తమ మధ్య చోటు చేసుకునే ఏ వివాదం లోనైనా, నిన్ను న్యాయనిర్ణేతగా చేసుకోనంత వరకు మరియు

నీ తీర్పు పట్ల తమ మనస్సులలో ఎటువంటి అసంతృప్తి లేకుండా, దానిని సంతోషంగా స్వీకరించనంత వరకు" 4:65

అంతేగాక, ఎవ్వరూ షరిఅహ్ చట్టం పై వేరే వాటికి ఆధిక్యత నివ్వకూడదు. దీని గురించి అల్లాహ్ ప్రకటన ఇలా ఉంది: (ఖుర్ఆన్ ఆయతు భావానువాదం)

"ఏం? అజ్ఞాన కాలపు తీర్పు (ఆదేశాలు, ఆచారాలు, సంప్రదాయాలు) కావాలని కోరుకుంటున్నారా వారు? దృఢంగా విశ్వసించేవారి కొరకు, తీర్పు చేయడంలో అల్లాహ్ కంటే ఉత్తములు ఎవరు కాగలరు?" 5:50

10. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సున్నతులను అనుసరించుట గురించి అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు, (ఖుర్ఆన్ ఆయతు భావానువాదం) "(ఓ ముహమ్మద్!) ఇలా ప్రకటించు: "ఒకవేళ మీరు నిజంగా అల్లాహ్ ను ప్రేమించేవారే అయితే, నన్ను అనుసరించండి - అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు మరియు మీ పాపాలను క్షమిస్తాడు. అల్లాహ్ అమితంగా క్షమించేవాడూ, అపారంగా కరుణించేవాడూనూ."" 3:31

ప్రతి ఒక్కరూ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరించాలి మరియు ఆయననే అత్యుత్తమైన ఆదర్శంగా తీసుకోవాలి. దీని గురించి అల్లాహ్ ఆదేశం ఇలా ఉంది, (ఖుర్ఆన్ వచన భావానువాదం) "నిశ్చయంగా ప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమైన ఆదర్శం ఉంది. అల్లాహ్ పట్ల, అంతిమదినం పట్ల ఆశ కలిగి ఉండి, అల్లాహ్ ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కొరకు" 33:21

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరించుట కొరకు ఆయన జీవితాన్ని గురించి తెలుసుకోవాలి మరియు అధ్యయనం చేయాలి.

జైనుల్ ఆబిదీన్ (అతనిపై అల్లాహ్ దయ చూపుగాక) ఇలా అన్నారు, "ఖుర్ఆన్ లోని ఆయతులు బోధించినట్లుగా, మాకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క యుద్ధాలను గురంచి బోధించేవారు"[1]

11. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ను అత్యధికంగా గౌరవించటం మరియు ఆదరించటం. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు, "మితిమీరి నన్ను గౌరవించకండి, ఎందుకంటే సందేశహరునిగా బాధ్యత అప్పగించక ముందు, నేను కూడా అల్లాహ్ యొక్క దాసుడినే" అత్తబ్రానీ.

12. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్థాయిని ఇంకా ఉన్నతపరచ మని అల్లాహ్ ను వేడుకోవటం. దీని గురించి అల్లాహ్ ఇలా ఆదేశించాడు (ఖుర్ఆన్ వచన భావానువాదం)

"నిశ్చయంగా అల్లాహ్, ఆయన దూతలు కూడా దైవప్రవక్తపై కారుణ్యాన్ని పంపిస్తున్నారు. ఓ విశ్వాసులారా! మీరు కూడా అతనిపై దరూద్ పంపండి. అత్యధికంగా అతనికి సలాములు పంపుతూ ఉండండి." 33:56

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు, "ఎవరైతే నా పేరు పేర్కొనబడటం విన్న తరువాత నా పై సలాములు పంపడో, అతనే లోభి" అత్తిర్మథీ.

[1]. ఇబ్నె కథీర్, అల్ బిదాయహ్ వల్ నిహాయహ్ (ఆరంభం మరియు అంతం) vol 3.

13. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఆదరించే మరియు గౌరవించే విధంగా ఆదరించటాన్ని మరియు గౌరవించటాన్ని ప్రేమించటం, ఎందుకంటే మానవజాతి ఆయన ద్వారా ఇస్లాం వైపు దారి చూపబడింది. స్వయం కంటే ఎక్కువగా ఆయనను ఆదరించవలసి ఉంది మరియు ప్రేమించవలసి ఉంది. ఎందుకంటే ఎవరైతే ఇస్లాం స్వీకరించారో, వారు ఈ ప్రాపంచిక జీవితంలోనూ మరియు పరలోకంలోనూ సఫలమవుతారు. దీని గురించి అల్లాహ్ ఇలా ప్రకటించినాడు, "(ఓ ప్రవక్తా) వారికి చెప్పు: 'ఒకవేళ మీ తండ్రులు, మీ పుత్రులు, మీ సోదరులు, మీ భార్యలు, మీ దగ్గరి బంధువులు, మీరు సంపాదించిన ఆస్తిపాస్తులు, కుంటుపడుతుందేమోనని మీరు భయపడే మీ వర్తకం, మీకెంతో ప్రియమైన మీ గృహాలు మీకు అల్లాహ్ కన్నా, ఆయన ప్రవక్త కన్నా, ఆయన మార్గంలో సలిపే పోరాటం కన్నా ఎక్కువ ప్రియమైనవైతే అల్లాహ్ తీసుకువచ్చే తీర్పు (శిక్ష) కొరకు ఎదురు చూడండి. అల్లాహ్ అవిధేయులకు సన్మార్గం చూపడు.''' 9:24

"అంతిమదినం ఎపుడు వస్తుంది" అని ఒక వ్యక్తి అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ, తనను ప్రేమించే వారికి లభించే ప్రతిఫలితం గురించి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా స్పష్టం చేసారు, "నీవు దానికోసం ఏమి తయారుచేసావు? అని అడుగగా, ఆ వ్యక్తి వెంటనే ఏమీ జవాబు చెప్పక, కొంచెం సేపు తరువాత, 'ఓ రసూలుల్లాహ్, నేను అసంఖ్యాకమైన (సున్నతు, నఫిలు) నమాజులు చేయలేదు మరియు ఉపవాసాలు పాటించలేదు, ఎక్కువ దానధర్మాలు చేయలేదు, అయితే నేను అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తను మాత్రం ప్రేమిస్తాను'అది విని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అతనితో

'ఎవరినైతే ప్రేమిస్తున్నావో, వారితో పాటు పునరుత్థాన దినం నాడు నీవు లేపబడతావు' అన్నారు." బుఖారీ మరియు ముస్లిం.

మరో సందర్భంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు, "ఒకవేళ ఎవరైనా ఈ మూడు విషయాలను ఎంచుకుంటే, అతను ఈమాన్ యొక్క మాధుర్యాన్ని మరియు సౌందర్యాన్ని రుచి చూస్తాడు – (మొదటిది) అన్నింటి కంటే అతనికి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ప్రియమై ఉండుట, (రెండోది) ఎవరినైనా కేవలం అల్లాహ్ కొరకు మాత్రమే ప్రేమించటం (మూడోది) విశ్వాసం వైపు అల్లాహ్ దారి చూపిన తరువాత, తిరిగి అవిశ్వాసం వైపు మరలటాన్ని 'నరకాగ్నిలో పడటాన్ని అసహ్యించుకున్నట్లుగా' అసహ్యించు కోవటం" ముస్లిం.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ను ఆదరించటం మరియు గౌరవించటం అంటే ఆయన ఆదరించేవారనీ మరియు గౌరవించేవారినీ తను కూడా ఆదరించటం మరియు గౌరవించటం; ఉదాహరణకు ఆయన కుటుంబం, ఆయన సహచరులు (రదియల్లాహు అన్హుమ్). అలాగే ఆయన అసహ్యించుకునే వారిని మరియు తిరస్కరించేవారిని తను కూడా అసహ్యించుకోవాలవి మరియు తిరస్కరించాలి. ఎందుకంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కేవలం అల్లాహ్ కొరకు ఎవరినైనా ప్రేమించేవారు మరియు అసహ్యించుకునేవారు (తిరస్కరించేవారు).

14. ఇస్లాం ధర్మప్రచారం మరియు ప్రజలను ఇస్లాం వైపు ఆహ్వానించుట; వివేకంతో మరియు మంచి ఉపాయంతో అల్లాహ్ యొక్క ధర్మాన్ని ను పునరుద్ధరించుట: అజ్ఞానులకు బోధించటం, తెలియని వారికి తెలియజేయటం మరియు మరచిపోయిన వారికి జ్ఞాపకం చేయటం ద్వారా ఈ పని చేయ వచ్చును. దీని గురించి అల్లాహ్ యొక్క

ఆదేశం ఇలా ఉంది, (ఖుర్ఆన్ ఆయతు భావానువాదం): “నీ ప్రభువు మార్గం వైపు జనులను వివేకంతోనూ, చక్కని ఉపదేశంతోనూ పిలువు. ఉత్తమరీతిలో సంభాషణ జరుపు” 16:125

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు, “నా నుండి ఖుర్ఆన్ లోని ఒక ఆయతునైనా (ఇతరులకు) అందజేయండి.” ముస్లిం.

15. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను మరియు ఆయన సున్నతును కాపాడుట – ఆయనకు వ్యతిరేకంగా ప్రజలు కల్పించే అన్నిరకాల కల్పితాలను ఖండించటం ద్వారా; ఇస్లాం శత్రువులు లేవనెత్తే అన్నిరకాల సందేహాల, సందిగ్ధాలలోని వాస్తవికతలను స్పష్టంగా వివరించడం ద్వారా మరియు ఇస్లాం గురించి తెలీని వారికి, ఇస్లాం యొక్క స్వచ్ఛమైనన బోధనలను అందజేయటం ద్వారా.

16. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సున్నతును గట్టిగా అంటిపెట్టుకుని ఉండటం: దీని గురించి ఆయనిలా బోధించారు: “నా సున్నతును అనుసరించండి మరియు నా తరువాత ఖులఫాయే రాషిదీనుల (సన్మార్గగాములైన ఖలీఫాల) సున్నతును అనుసరించండి. వాటిని (ఆ సున్నతులను) ముందు పళ్ళతో (గట్టిగా కరిచి) పట్టుకోండి[1] మరియు నూతన కల్పితాలకు దూరంగా ఉండండి. ఎందుకంటే (ధర్మం విషయంలో కనిపెట్టే) ప్రతి నూతన విషయం ఒక కల్పితమే (బిదఅహ్ యే), మరియు ప్రతి నూతన కల్పితం మార్గభ్రష్టత్వం వైపునకు తీసుకు పోతుంది” (బుఖారీ మరియు ముస్లిం)

[1]. ఇక్కడ ముందు పళ్ళతో పట్టుకోవటమనేది రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సున్నతును ఎంత గట్టిగా పట్టుకోవాలే తెలియజేయటానికి వాడిబడిన ఒక ఉపమానం.

# ముగింపు

'Historie de al Turquie' (తుర్కీ చరిత్ర) లో అల్ఫోన్సే డి లమార్టైన్ (Alphonse de LaMartaine)[1] వ్రాసిన పదాలతో మేము ఈ పరిశోధనను ముగిస్తున్నాము.

ఏనాడూ స్వయంగా తనకోసం మానవుడు ఇష్టపడి లేదా అయిష్టపడి, దీని కంటే గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకోలేదు. ఎందుకంటే ఈ లక్ష్యం మానవాతీతమైనది; దేవుడిని మానవుడిగా మరియు మానవుడిని దేవుడిగా చేసేలా మానవుడికి మరియు అతని సృష్టికర్తకు మధ్య నెలకొల్పబడిన మూఢవిశ్వాసాల్ని రూపుమాపడం; హేతుబద్ధమైన, న్యాయమైన, వివేకవంతమైన మరియు పవిత్రమైన దైవత్వ ఆలోచనను, ఆనాడు అనుసరించబడుతున్న భౌతిక మరియు అసత్య దైవ విగ్రహారాధనల గందరగోళం మధ్య పున:స్థాపించటం. ఈనాటి వరకు మానవశక్తికి మించిన ఈ పనిని బలహీన మార్గాల ఆధారంగా సాధించే లక్ష్యాన్ని మానవుడు ఎన్నడూ చేపట్టలేదు. అయితే దానిని సాధించే గొప్ప బృహత్ ప్రణాళికను ఆయన (ముహమ్మద్) ఊహించటమే కాకుండా, దానిని అమలు చేసి చూపారు కూడా – స్వయం తప్ప మరే సాధనాలూ లేకుండా మరియు ఎడారిలోని ఒక మూల ప్రాంతంలో నివసించే పిడికెడు మనుషులు తప్ప. అంతిమంగా, ప్రపంచంలో అలాంటి గొప్ప మరియు చిరస్థాయిగా నిలిచిపోయే విప్లవాన్ని మానవుడు ఏనాడూ స్థాపించలేదు, ఎందుకంటే ఇస్లాం ప్రత్యక్షమై రెండు శతాబ్దాలు దాటకుండానే, విశ్వాసంలో మరియు సైనికపరంగా అది మొత్తం అరేబియా ప్రాంతాన్ని పరిపాలించింది

[1]. ఆయన ఒక కవి. తత్కాలీన ప్రభుత్వపు సభ్యుడు మరియు ఒకప్పటి అధ్యక్ష పదవి పోటీదారుడు.

మరియు అల్లాహ్ పేరుతో అది పర్షియా, ఖురాసాన్, మధ్యాసియా, పశ్చిమ భారత్, సిరియా, ఈజిప్టు, అబిసీనియా, ఉత్తర ఆఫ్రికాలోని తెలిసిన దేశాలన్నీ, మెడిటేరియన్ సముద్రంలోని అనేక ద్వీపాలు, స్పెయిన్ మరియు యూరోపులో కొంత భాగాన్ని జయించింది. 'ఒకవేళ గొప్పదైన లక్ష్యం, స్వల్పమైన సాధనాలు, ఆశ్చర్యకరమైన ఫలితాలు మానవ అసమాన ప్రతిభకు మూడూ కొలమానాలైతే, ఆధునిక ప్రపంచపు ఏ గొప్ప వ్యక్తినైనా ముహమ్మద్ తో పోల్చడానికి ఎవరు సాహసించగలరు?

ప్రపంచంలో ప్రఖ్యాతులైన వారు ఆయుధాలు సృష్టించారు. చట్టాలు చేశారు. సామ్రాజ్యాలు స్థాపించారు. వారు స్థాపించినవి ఏమైనప్పటికీ ఉ భౌతిక/పదార్ధ శక్తికి సంబంధించినవే. అవి తరచుగా వాళ్ళ కళ్ళ ముందే నేలకూలాయి. ఈ వ్యక్తి ముహమ్మద్, సైనిక పునాదుల్ని కదిలించడమే కాకుండా, శాసనాలు, రాజ్యాలు, జాతులు, సామ్రాజ్యాలనే కాక ఆనాడు ప్రజలు నివసిస్తుండిన మూడోవంతు భూమండలంలోని లక్షలాది మనుషులన్ని చలింపజేశాడు. దాని కంటే ముఖ్యంగా బలిపీఠాలు, దేవతలు, మతాలు, భావాలు, మూఢ- నమ్మకాలు, ఆత్మలు – అన్నింటినీ స్థానభ్రంశం చేశాడు. 'దాని ప్రతి అక్షరం శాసనమైన ఒక దివ్యగ్రంథం ఆధారంగా, ఆయన ఒక ఆధ్యాత్మిక జాతీయతను సృష్టించినారు. అసత్య దైవాలను అసహ్యించుట మరియు ఏకైక, అశరీర శరీరధారుడుకాని దైవాన్ని ఆరాధించుట అనే ముస్లిం జాతీయత యొక్క చెరగని ముద్రను ఆయన వదిలారు. అపవిత్రమైన ఆరాధనలకు విరుద్ధంగా పగదీర్చుకునే ఈ జాతీయభక్తి, ముహమ్మద్ సహచరుల సుగుణంగా మారింది. మూడో వంతు భూమండలాన్ని ఈ సిద్ధాంతం జయించుట ఆయన యొక్క ప్రత్యేక మహిమ. లేదా అది ఒక మానవుడి మహిమ కాదు గానీ, అది ఒక ముఖ్యకారణం. 'అవిశ్వసనీయ, కృత్రిమ దైవాల గురించిన శూన్య సిద్ధాంతాల గందరగోళం మధ్య ఏకదైవారాధన

భావన, 'ఆయన పెదవుల నుండి ఉచ్చరించబడిన వెంటనే అది ప్రాచీన విగ్రహారాధక దేవాలయాన్నింటినీ నాశనం చేసివేసి, మూడోవంతు ప్రపంచంలో అగ్ని రాజేయడం' అనేది స్వయంగా తనలో మహిమ కలిగి ఉన్న ఒక అద్భుత విషయమే. ఆయన జీవితం, ఆయన ధిక్ర్ (ధైవధ్యానం), మూఢవిశ్వాసాలను ఆయన వీరోచితంగా, శౌర్యవంతంగా వ్యతిరేకించటం, విగ్రహారాధకుల కోపావేశాలను ధైర్యసాహసాలతో ఎదుర్కొనటం, మక్కాలో దాదాపు 13 ఏళ్ళ పాటు నిలకడగా ప్రజల హింసను ఓర్పుగా సహించటం, మక్కా అవిశ్వాసుల అలక్ష్యాన్ని మరియు వారు పెట్టిన బాధలను, హింసలను ఆయన స్వీకరించటం: ఇవన్నీ మరియు అంతిమంగా ఆయన వలస, ఆయన నిరంతరమైన బోధన, అన్యాయంపై ఆయన చేసిన యుద్ధాలు, తన సాఫల్యంలో తన అచంచలమైన దృఢనమ్మకం, దురదృష్ట సమయంలో ఆయన యొక్క మానవాతీతమైన భద్రత, విజయ సమయంలో ఆయన యొక్క సంయమనం మరియు క్షమాగుణం, కేవలం ఏకదైవారాధనయే ధ్యేయంగా తప్ప సామ్రాజ్య స్థాపన వంటి అత్యాశలు లేని ఆయన స్వచ్ఛమైన అభ్యుదయేచ్ఛ, విడుపులేని ఆయన ఆరాధనలు, అల్లాహ్ తో వహీ ద్వారా ఆయన సంభాషించటం, ఆయన మరణం, మరణానంతరం కూడా కొనసాగిన ఆయన సాఫల్యం; ఇవన్నీ ఆయన దృఢమైన, స్థిరమైన విశ్వాసాన్ని ధృవీకరిస్తున్నాయే గాని వంచన, మోసం, కపటం మొదలైన వాటిని కాదు. ఏక దైవారాధన సిద్ధాంతాన్ని పున: స్థాపించటానికి ఆ దృఢవిశ్వాసమే ఆయనకు శక్తినిచ్చింది. దేవుని ఏకత్వం మరియు మానవుడి ఆలోచలకు అందని సృష్టికర్త ప్రత్యేక ఆకారం అనే రెండు మడతలలో ఆ సిద్ధాంతం ఉంది: మొదటిది దేవుడంటే ఏమిటి అనే విషయాన్ని తెలిపితే, రెండోది దేవుడు కాజాలని దానిని తెలుపుతుంది; అది అసత్య దైవాలను కరవాలంతో కూలదోసింది, రెండోది పదాలతో ఒక

ఆలోచనను ప్రారంభించింది. తత్వవేత్త, వక్త, ప్రవక్త, శాసనకర్త, యోధుడు, భావాల విజేత, హేతుబద్ధమైన విశ్వాసాల సంస్థాపకుడు, విగ్రహ రహిత ఆరాధనా బోధకుడు, ఇరవై ప్రాపంచిక సామ్రాజ్యాల మరియు ఒక ఆధ్యాత్మిక సామ్రాజ్య స్థాపకుడు – ఆయనే ముహమ్మద్. మానవ ఔన్నత్యాన్ని కొలిచే సకల ప్రమాణాల రీత్యా ఆయనకంటే గొప్పవాడు మరెవడైనా ఉన్నాడా? - అని మనం ప్రశ్నించవచ్చు. ' '

## Glossary

1. అఖీదహ్:మూలసిద్ధాంతం
2. దీనార్: ఒక రకమైన ధనం
3. దిర్హమ్: ఒక రకమైన ధనం
4. ఫరీదహ్: ఆరాధనలోని తప్పనిసరి, విధి అయిన ఆచరణ
5. ఫిత్నహ్: పరీక్ష, విపత్తు, ఘర్షణ, ఆపద, ఉపద్రవం, కష్టం, ఇబ్బంది
6. హదీథ్: ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశం
7. హౌద్: అంతిమ దినాన మహోన్నతుడైన అల్లాహ్, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు ప్రసాదించే ఒక సరస్సు. దానిలో నుండి త్రాగిన వారికి ఇంకెన్నడూ దప్పిక వేయదు.
8. హుదూద్: ఇస్లాంలోని తీవ్రమైన శిక్షలు
9. హుకుమ్: ఆదేశం
10. ఇజ్తిహాద్: దీని సాధారణ అర్థం ప్రయత్నంలోని శ్రమ. ఈ పుస్తకంలో ఇది ఏదైనా విషయంలో ధర్మాదేశం ఏమిటో తెలుసుకోవటానికి చేసే ప్రయత్నం.
11. ఇతెకాఫ్: సాధారణంగా దీని అర్థం ఏకాంతం. ఇతెకాఫ్ అంటే మస్జిద్ అల్లాహ్ ను ఆరాధించుట కొరకు తనకై తాను ఏకాంతంలో గడిపే ఒక రకమైన ఆరాధన
12. ఈమాన్: విశ్వాసం
13. జన్నహ్: తన భక్తులకు అల్లాహ్ ప్రసాదించే ఆకాశాలలోని నివాసస్థలం లేక ఉద్యానవనం. కొందరు దీనిని స్వర్గం అని వ్రాస్తారు.

14. జవామీ అల్ కలిమ్: పొందికగా, సంగ్రహంగా సంభాషించుట. ఇది ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క మహిమలలోని ఒక మహిమ. ఆయన కొన్ని పదాలే పలికేవారు. కానీ వాటి అర్థం చాలా లోతుగా ఉండేది.

15. కుఫ్ర్: అవిధేయత, సత్యతిరస్కారం

16. నఫల్: ఐచ్ఛిక, స్వంత ఇష్టంతో కూడుకున్న

17. షైతాన్: అల్లాహ్ చే బహిష్కరింపబడిన దుష్టుడు, సైతాను

18. షరిఅహ్: ఇస్లామీయ ధర్మశాసనం

19. షిర్క్: అల్లాహ్ కు భాగస్వాములుగా చేర్చుట

20. సున్నహ్: దీనిలో అనేక అర్థాలున్నాయి. ఇది ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సాంప్రదాయాన్ని సూచించవచ్చు. సున్నహ్ ధృవీకరించిన ధర్మాదేశాలు.

21. తఖ్వా: అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండుట

22. ఉమ్మహ్: సమాజం

23. వలీ: ఎల్లప్పుడూ అల్లాహ్ ను ధ్యానించే, అల్లాహ్ ను ఆరాధిస్తూ కాలం గడిపే, అధర్మమైన వాటికి దూరంగా ఉండే సజ్జనులు, అల్లాహ్ యొక్క భయభక్తులు కలిగి ఉండే ముస్లింలు.

# 13వ రమదాన్ సాంస్కృతిక పోటీ షరతులు, 1432హి, రబ్వహ్ జాలియాత్, రియాద్.

1. క్రింద ఇవ్వబడిన ప్రశ్నలకు ఈ పుస్తకంలో నుండే సరైన జవాబు ఎన్నుకోవలెను.
2. మీ సమాధానములను రబ్వహ్ ఆఫీసులో స్వయంగా గాని లేదా, telugu@islamhouse.com కు ఈమెయిల్ ద్వారా గాని లేదా, p.o.box 29465, Riyadh 11457 కు ఉత్తరం ద్వారా గాని 29/11/1432 హిజ్రీ – 26/10/2011 లోపుగా చేర్చవలెను.
3. మీ పేరు ఖచ్చితంగా మీ ఇఖామా లేదా మీ పాస్ పోర్టు లేదా మీ ఇతర ఐడెంటిటీ కార్డులో వ్రాయబడిన విధంగానే వ్రాయవలెను. ఒకవేళ విజేత పేరులో మరియు అతని ఐడెంటిటీ కాపీలో పేర్కొనబడిన పేరులో తేడా ఉంటే, అతనికి బహుమతి ఇవ్వబడదు.
4. మీ పేరు, సెల్ నెం, ఫోన్ నెంబరు, ఈమెయిలు ఇంటర్నేషనల్ డయల్ కోడ్ తో సహా స్పష్టంగా వ్రాయవలెను.
5. విజేతలకు ఫోన్ నెంబరుల ద్వారానే ఫలితాలు తెలుపబడును.
6. ఇన్షాఅల్లాహ్ విజేతల పేర్లు 1433హి ముహర్రం (డిసెంబరు 2011) నెలలో రబ్వహ్ ప్రచార కేంద్రంలో ప్రకటింపబడును. అన్నిభాషల ఫలితాలు www.islamhouse.com లో కూడా చూసుకోవచ్చును.
7. మీ సమాధానములను స్పష్టమైన చేతి వ్రాతలో గాని లేక నీటుగా టైపు చేసి గాని పంపవలెను. ప్రతి ప్రశ్న యొక్క క్రమసంఖ్య

మరియు దాని జవాబు (a,b,c,d,e లలో సరైన జవాబు) సూచిస్తే సరిపోతుంది. ఉదా: 1 – a, 2 – b,

**8.** చీటింగ్ ఇస్లాంలో నిషేధించబడినది. కాబట్టి ఇతరుల నుండి కాపీ చేయవద్దు.

**9.** విజేతలు బహుమతులు తీసుకోవటానికి 1433హి సఫర్ నెల 29వ తేదీ అంటే 23rd Jan 2012 ఆఖరి రోజు. (కారణాలేమైనాసరే)**దీని తర్వాత విజేతలు బహుమతి పొందే హక్కును కోల్పోతారు**

## బహుమతులు

1. మొదటి బహుమతి : 1,500 సౌదీ రియాల్స్
2. రెండవ బహుమతి : 1,250 సౌదీ రియాల్స్
3. మూడవ బహుమతి : 1,000 సౌదీ రియాల్స్
4. నాలుగువ బహుమతి : నాలుగు నుండి పదవ విజేత వరకు – ప్రతి ఒక్కరికి 300 సౌదీ రియాల్స్ i.e., 7 x 300SR
5. ఐదో బహుమతి : పదకొండు నుండి ఇరవైవ విజేత వరకు – ప్రతి ఒక్కరికి 200 సౌదీ రియాల్స్ i.e., 10 x 200SR

# ప్రశ్నలు

1. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తండ్రి పేరు
   a) అబుల్ ఖాశిం
   b) అబ్దుల్లాహ్
   c) అబ్దుల్ ముత్తలిబ్
   d) హాషిం

2. 'ఇతరులను గురించి ఎప్పుడూ ఒక్క అసత్యమైనా పలకని వ్యక్తి, దైవం గురించి అస్సలు అబద్ధం పలుకడని' హిరాక్యులస్ చక్రవర్తి ఎవరి గురించి రూఢీ పరచుకున్నాడు –
   a) అబూ సుఫ్యాన్
   b) దిహ్యా అల్ కల్బి
   c) ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం
   d) వరఖా ఇబ్నె నౌఫల్

3. కాబాగృహాన్ని పునర్నిర్మించింది ఎవరు?
   a) ఇబ్రాహీం అలైహిస్సలాం
   b) ఇస్మాయీల్ అలైహిస్సలాం
   c) ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం
   d) పై వాటిలో a & b సరైన జవాబులు.

4. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏ ఏ పేర్లతో ప్రసిద్ధి చెందారు
   a) అల్ అమీన్ (అత్యంత నిజాయితీ పరుడు)
   b) అల్ సాదిక్ (అత్యంత సత్యవంతుడు)
   c) పై రెండూ సరైనవే
   d) పై వాటిలో ఏదీ కాదు

5. ఇస్లాం

a) ఒక సంపూర్ణ జీవనవిధానం
b) కేవలం అల్లాహ్ ను మాత్రమే ఆరాధించవలెనని పిలుపునిస్తుంది
c) అల్లాహ్ ను, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను మరియు బాబాలను వేడుకోవాలని పిలుపునిస్తుంది
d) చెడు అలవాట్లను, బహుదైవారాధనను వ్యతిరేకిస్తుంది.
e) పై వన్నీ సరైనవే
f) పై వాటిలో a, b, d మాత్రమే సరైనవి.

6. "దాని అత్యద్భుతమైన జీవనోపయోగ్యత్వము వలన ముహమ్మద్ యొక్క ధర్మాన్ని నేను ఎల్లప్పుడూ అత్యున్నతమైనదిగా గౌరవించాను" – ఇలా పలికినది ఎవరు?

a) రోమన్ చక్రవర్తి హిరాక్యులస్
b) మహాత్మా గాంధీ
c) సరోజినీ నాయుడు
d) జార్జి బెర్నార్డ్ షా

7. "మీలో ఎవరైనా ఏదైనా చెడు పని చూసినపుడు, దానిని చేతితో ఆపండి; ఒకవేళ అలా చేయలేకపోతే, నాలుకతో దానిని ఆపండి; ఒకవేళ అది కూడా చేయలేక పోతే, దానిని మనస్సులోనైనా నిరసించండి" – అని బోధించింది ఎవరు?

a) అబూ సయీద్ ఖుద్రీ
b) సహీహ్ ముస్లిం
c) ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం
d) ఇది ఖుర్ఆన్ ఆయతు యొక్క భావానువాదం

8. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం –

a) కేవలం ముస్లింల కొరకు పంపబడిన ప్రవక్త

b) కేవలం అరబ్బుల కొరకు పంపబడిన ప్రవక్త

c) మొత్తం మానవజాతి కొరకు పంపబడిన అంతిమ ప్రవక్త

d) కేవలం ఒక మహోన్నత వ్యక్తి మాత్రమే

9. "ఈ (ఖుర్ఆన్) వచనాలు తప్పనిసరిగా దేవుడు లేక అల్లాహ్ నుండే ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కు చేరి ఉంటాయని నేను స్పష్టంగా గ్రహించాను..." అని పలికింది ఎవరు?

a) డాక్టర్ మౌరిస్ బుకైలే

b) జర్మన్ కవి 'ఓల్ఫ్ గాంగ్ గోథె

c) ప్రొఫెసర్ కీథ్ మూరె

d) అన్నె బీసెంట్

10. 'ఒకవేళ గొప్పదయిన లక్ష్యం, స్వల్పమైన సాధనాలు, ఆశ్చర్యకరమైన ఫలితాలు మానవ అసమాన ప్రతిభకు మూడూ కొలమానాలైతే, ఆధునిక ప్రపంచపు ఏ గొప్ప వ్యక్తినయినా ముహమ్మద్ తో పోల్చడానికి ఎవరు సాహసించగలరు?' అని ప్రకటించింది ఎవరు?

a) థామస్ కార్లైల్

b) లమార్టైన్

c) మైకెల్ హార్టు

d) వాషింగ్టన్ ఇర్వింగ్